సాహిత్య

# ప్రస్థానం

ఏప్రిల్ - 2008

వెల రూ. 10






సాహితీ స్రవంతి




హైదరాబాదుకు చెందిన చిత్రకళా విద్యార్థి కీర్తి మోహన్ కుంచె నుండి జాలువారిన చిత్రం ఇది. కొన్నాళ్ళ క్రితం బెంగాల్‌లో పర్యటించిన సమయంలో కేవలం నలుపు, తెలుపు రంగులతో ఇలాంటి చిత్రాలను రూపొందించాడు. ప్రతి చిత్రానికి కుడివైపు అంచున నిలువు పట్టీలో పాదముద్రలు, బస్ టిక్కెట్‌నంబర్లను తన ప్రయాణానికి సంకేతంగా చూపడం కీర్తిమోహన్ ప్రత్యేకత.

సాహిత్య
ప్రస్థానం
ఏప్రిల్, 2008
సంపుటి : 6 సంచిక : 30

## విద్వేషం, విధ్వంసం

హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై ఆరెస్సెస్ వాదుల దాడిని ప్రగతిశీల కవులు రచయితలు ముక్తకంఠంతో ఖండించారు. రాజకీయ తేడాలతో నిమిత్తం లేకుండా సాహిత్య సాంస్కృతిక సభా నిలయంగా అందరికీ అందుబాటులో వున్న విజ్ఞాన కేంద్రంపై దాడి నిజంగానే అత్యంత దిగ్భ్రాంతికరమైంది. ఇప్పటి వరకూ అనేక రూపాలలో అసహన పూరిత దాడులు చేస్తున్న సంఘ పరివార్ ఈ ఘటనతో రాజధాని నడిబొడ్డులో వికృత విశ్వరూపం చూపింది. దీనికి సమర్థనగా చేసుకుంటున్న వాదనలు ఇంకా దారుణంగా వున్నాయి. ఇలాటి విద్వేషాలను విధ్వంసాలను సహించేది లేదని ప్రజాస్వామిక వాదులందరూ చాటి చెప్పడం అభినందనీయం. గతంలోనూ గుజరాత్ గాయం సందర్భంలోనూ, ఇతర దాడులను ఖండించడంలోనూ ఇదే స్ఫూర్తి వ్యక్తమైంది. ఇది తెలుగు నాట బలంగా వున్న లౌకిక ప్రజాస్వామిక సంప్రదాయాలకు తార్కాణం.

...............

ఈ వారం పలువురు సాహిత్య కారులు మనకు దూరమైనారు. తెలంగాణా పోరాట సాహిత్యానికి ప్రతీకగా నిల్చిన తిరునగరి రామాంజనేయులు మృతితో ఒక ఘట్టం ముగిసింది. అనుభవాలే అక్షరాలుగా అగ్ని జ్వాలలు రగిల్చిన ఆయన జ్ఞాపకాలు పునర్ముద్రిస్తున్నాం. అలాగే పోలవరపు కోటేశ్వరరావు చిరకాలంగా ప్రజాసాంస్కృతిక ఉద్యమాలతో ప్రజాతంత్ర రాజకీయాలతో పెనవేసుకున్న రచయిత. ఆయన రచనలు జ్ఞాపకాలు రాబోయే సంచికలో అందించగలం. హేమలతా లవణం సంఘ సంస్కరణ కార్యకర్తగా ఎక్కువ పరిచయమైనప్పటికీ రచయిత్రిగానూ అంతకు మించి జాషువా గారి కూతురు గానూ స్మరణీయురాలు. ఆయన సాహిత్య వారసత్వాన్ని ముందుకు గొనిపోయేందుకు ఆమె చివరి వరకూ కృషి చేస్తూనే వచ్చారు.

...............

ప్రస్థానం మెరుగుదలకు సన్నాహాలు సాగుతున్నాయి. 2008 జూన్‌లో వెలువడే ప్రత్యేక సంచిక నుంచి మరిన్ని శీర్షికలు, ఆకర్షణలు సంతరించుకుంటుందని తెలిజేయడానికి సంతోషిస్తున్నాం. అందుకే ఉగాదికి ప్రత్యేక సంచిక తీసుకురావడం లేదు. పాఠకులకు రచయితలకు శ్రేయోభిలాషలకు సంవత్సరాది శుభాకాంక్షలు.

కథల బొమ్మలు : చంద్ర, శివాజి

## ఈ సంచికలో...


| | |
|---|---|
| ఆధిపత్యం (కథ) | 2 |
| అందని చందమామ (దీర్ఘ కవిత) | 4 |
| దళిత కథ ప్రతిబింబించిన ఓ జానపద కళ | 5 |
| సైనైడ్ (కథ) | 7 |
| కవితలు | 11 |
| శివసాగర్ సాహితీ సాక్షాత్కారం | 12 |
| కవితలు | 16 |
| జంట నగరాలను జల్లెడ పట్టిన కవులు | 17 |
| పుస్తకాలూ - ముందుమాటలు | 19 |
| కవితలు | 21 |
| బరువు బతుకులు (కథ) | 22 |
| అంతరించిపోతున్న జానపద కళా సంపద | 26 |
| మన ఇంగ్లీషు! | 28 |
| మన మాల్గుడి మిట్టూరోడి ఆల్ ఇన్ వన్! | 29 |
| కొన్ని కలలు, కొన్ని మెలకువలు | 31 |
| నేను సైతం కవిని అయ్యాను | 34 |
| సంస్కరణ, సాహిత్యం ఆమెకు రెండు కళ్ళు | 39 |
| సుందరయ్య విజ్ఞానకేంద్రంపై దాడిని నిరసించిన కవులు, కళాకారులు | 40 |
| డైరీ | 42 |
| స్వీకారం | 48 |



సంపాదకవర్గం

తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
ఎ.సత్యభాస్కర్
వొరప్రసాద్
ఎం.నరహరి

కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
1-1-187/1/2,
వివేక్‌నగర్, చిక్కడపల్లి,
హైదరాబాద్-500 020
ఫోన్లు : 27660013, 27635136

# ఆధిపత్యం



**మేడం ... చేతులు నులుముకుంటూ ఎదురుగా నిలబడ్డ ఆఫీసు అటెండరు బాలరాజు వైపు ప్రశ్నార్థకంగా చూసింది శ్రీలేఖ.**

**"మేడం... చిన్న సహాయం.. ఓ వెయ్యి రూపాయలు ఉంటే ఇవ్వండి... జీతాలు రాగానే ఇచ్చేస్తాను అన్నాడు బాలరాజు ప్రాధేయపడుతున్నట్లుగా, 'ఎందుకు బాలరాజూ అంత అర్జెంటుగా వెయ్యి రూపాయలు. అంత అవసరం ఏమొచ్చింది' అడిగింది శ్రీలేఖ.**

**జి. అనసూయ**

**బా**లరాజు కింకా పెళ్ళి కాలేదు. "ఏం లేదమ్మా తమ్ముడికి పరీక్ష ఫీజు కట్టాలి. నెలాఖరు కదా, చేతిలో డబ్బుల్లేవు, మిమ్మల్ని అడిగితే కాదనరని అడిగాను" పక్క సీట్లో ఉన్న ఉష వైపు ఓ క్షణం చూశాడు బాలరాజు.

నిజమే ఇంతకు ముందు రెండు మూడుసార్లు ఉషను అడిగాడు ఇలాగే. కాని, వెయ్యి రూపాయలు ఉష పర్సులో ఎప్పుడూ ఉండవు. ఆటోలకు, బస్సు ఛార్జీలకు... కాకపోతే వందో రెండొందలో.

శ్రీలేఖ పర్సు తీసి వెయ్యి రూపాయలు ఇచ్చింది, బాలరాజుకు, ఫస్టుకు ఇచ్చెయ్ బాలరాజూ హెచ్చరికగా అంటూ , అలాగే మేడం.. థాంక్స్ మేడం ఓ సెల్యూట్‌లాంటిది కొట్టి వెళ్ళాడు బాలరాజు. బాలరాజు కంపాషనేటరీ గ్రౌండ్స్‌లో అప్పాయింట్ అయ్యాడు. ఇంటికి పెద్దవాడు. తమ్ముడిని, చెల్లెల్ని చదివిస్తున్నాడు.

అంతలోకి గోపాలం వచ్చాడు. నోటిస్ పట్టుకొని శ్రీలేఖ మేడం గారూ యూనియన్ ఫండ్ మీదే బోణి అంటూ పర్సులోంచి అయిదువందలు తీసి ఇచ్చింది శ్రీలేఖ.

ఉష నోటిస్ చదివి "రేపిస్తాను గోపాలం" అంది అలాగేనమ్మా! అంటూ వెళ్ళిపోయాడు గోపాలం.

"ఉషా! ఏంటి ఆలోచిస్తున్నావ్, పద లంచ్‌టైం అయింది" అంటూ లేచింది శ్రీలేఖ. లంచ్‌బాక్సులు తీసుకొని కాంటిన్ వైపు నడిచారు ఇద్దరూ. అంతలోకి వనజ, స్వప్న వచ్చారు.

'హాయ్ శ్రీలేఖా చీర బావుందోయ్ ఏమిటి విశేషం'... అంటూ గ్రీట్ చేసింది స్వప్న. అప్పటిదాకా శ్రీలేఖ కొత్త చీర కట్టుకుందన్న విషయమే తను గమనించలేదే అనుకుంది ఉష. నిజంగానే చీర చాలా బాగుంది. ముదురు నీలం రంగు కాశ్మీర్ చీర, ఎరుపు తెలుపుల బోర్డరు అవును శ్రీలేఖ! చీర చాలా బాగుంది. ఏమిటివాళ స్పెషల్' అంది అభినందనగా చూస్తూ

'మా వారి సెలక్షన్! మొన్న సండే మా మ్యారెజ్‌డే. అందుకే ఇవాళ ఆఫీసుకు కట్టుకొచ్చాను' అన్నది శ్రీ లేఖ.

ఓ కంగ్రాట్యులేషన్... శ్రీ లేఖా! ఎవరికి చెప్పకుండా సండే రోజు చూసి సెలబ్రేట్ చేసుకుంటారా. ఇప్పుడు మాకు స్పెషల్ పార్టీ ఇవ్వాల్సిందే అన్నారు వనజ, స్వప్న.

'ఓకే, మీకేం కావాలో మీరే ఆర్డరివ్వండి' అంది శ్రీలేఖ అంగీకారంగా, రెండు రకాల స్వీట్లు, పఫ్‌లూ, కూల్‌డ్రింక్స్ తెప్పించింది. రెండొందలయింది బిల్లు. ఉషకు శ్రీలేఖను చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంటుందెప్పుడూ.

శ్రీలేఖ తనకు ముందునుండి తెలుసు. మామూలు మధ్య తరగతి కుటుంబమే. శ్రీలేఖ భర్త కరుణాకర్ కూడా మామూలు ఉద్యోగే. మరి శ్రీలేఖ అంత తేలిగ్గా డబ్బు ఎలా ఖర్చు పెట్టగలుగుతుంది. ఎప్పుడూ పర్సులో రెండువేలకు తక్కువ వుండవు. ఇలాంటి ఖర్చులన్ని ఎలాంటి ఆంక్షలు

లేకుండా స్వేచ్ఛగా పెడుతుంది. తను కూడా ఉద్యోగం చేస్తున్నా ప్రతిదీ తనకు అలా వీలవదు. ఏ ఖర్చు పెట్టాలన్నా తమ ఆలోచించు కోవాల్సిందే. తనే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అలవాటు తనకు లేదు. భర్త ఆనంద్ మంచివాడే. కాని.. కొంచెం ఆచి తూచి ఖర్చుపెట్టాలంటాడు. ఇంటి పెద్ద కొడుకుగా కుటుంబ బాధ్యతలు నేర్పిన పెద్దరికం అతనిది. అవసరమైనప్పుడు తన తమ్ముళ్ళకు, చెల్లెళ్ళకు కూడా ఇస్తుంటాడు. అయినా శ్రీలేఖ కున్నంత ఆర్థిక స్వేచ్ఛ తనకు లేనందున మనసులో ఎక్కడో అసంతృప్తి ఉషకు.

ఆర్థిక స్వేచ్ఛ ఒకరు ఇచ్చేది కాదు. మనకు మనం అనుభవించాల్సిందే అంటుంది శ్రీలేఖ. తన ఆత్మవిశ్వాసం వెనుక భర్త సహకారం ఉంది. నిజంగా ఉద్యోగాలు చేస్తున్న ఆడవాళ్ళంతా ఆర్థికస్వేచ్ఛను అనుభవిస్తున్నారా:

ఉష మనసులో కదులుతున్న ఆలోచనలను కనిపెట్టినట్లుగా పాపం ఉష అనుకుంది శ్రీలేఖ. మర్నాడు సెలవు. సూపర్ మార్కెట్‌కు వెళ్ళి పిల్లలకు పళ్ళు, స్నాక్స్, కొనుక్కొని ఇల్లు చేరింది శ్రీలేఖ.



కరుణాకర్ ఇంకా ఇంటికి రాలేదు. కరుణాకర్ మామూలు ఉద్యోగి మాత్రమే కాదు. ఫైనాన్స్ బిజినెస్, ప్రైవేటు చిట్టీలు కూడా నడుపుతాడు. ఈ రోజు తమ ఈ స్థాయి జీవితం గడుపుతున్నామంటే దానికి కరుణాకర్ తెలివి తేటలు, ప్లానింగ్, ఫైనాన్షియల్ డిసిప్లినే కారణం.అలాగని ఖర్చు పెట్టడానికి, సరదాలకు వెనుకాడడు. తనకు కూడా ఎలాంటి ఆంక్షలు పెట్టడు. సోషల్ స్టేటస్ మెయింటేన్ చెయ్యడానికి ఇలాంటివి అవసరమని తనే ప్రోత్సహిస్తాడు.

వంటింట్లో పని ముగించుకొని బయట వరండాలోకి వచ్చిన శ్రీలేఖకు రెండు మూడు రోజుల్నుండి లెటర్ బాక్స్ తీయలేదన్న సంగతి గుర్తొచ్చింది. లోపలికి వెళ్ళి తాళపు చెవి తీసి లెటర్‌బాక్స్ ఓపెన్ చేసింది. కరుణాకర్ పేరుతో రెండు ఉత్తరాలు తన పేరు మీద ఓ పెద్ద కవరు ఉన్నాయి. అటూ ఇటూ తిప్పి చూసి ఫ్రం అడ్రసు చూసింది. తీరా చూస్తే లాయరు నోటీస్... పోస్లే కరుణాకర్ వచ్చాక దీని సంగతేంటో చూడొచ్చు అనుకుని హ్యాండ్‌బ్యాగులో పెట్టింది.

కరుణాకర్ పొద్దుపోయి రావడంతో ఆ విషయమే మరిచిపోయింది.

మర్నాడు పొద్దున్నే పనిమీద వెళ్ళాడు కరుణాకర్. ఆదివారాలు మామూలు కంటే బిజీగా ఉంటాడు. చిట్టిపాటలు వసూళ్ళు మూడవుతుండగా వచ్చాడు. బయటనే భోజనం చేసి వచ్చానన్నాడు.

పోని ఫ్రూట్స్ తెస్తానుండండీ అంటూ ట్రేలో ఆపిల్స్, నైఫ్ పట్టుకొని వచ్చింది శ్రీలేఖ. కరుణాకర్ తన బ్యాగులోంచి పేపర్లు తీసి చూస్తున్నాడు. నోటీస్ కంట పడడంతో తీసి చదివాడు. అతని మోహంలో మారుతున్న రంగులు... బిగుసుకుంటున్న దవడలు.

'ఏమిటిది?' అన్నాడు కటువుగా

'అదేనండి... నా ఫ్రెండ్ వరూధిని'.. ఏదో చెప్పబోతున్న శ్రీలేఖకు అడ్డోస్తూ...

ఈ ష్యూరిటీలివ్వడం అదీ చెప్పకుండా. ఎప్పట్నుండి మొదలు పెట్టావు ఈ వ్యవహారాలు, కరుణాకర్ గొంతు మాటల స్థాయి నుండి అరుపుల స్థాయికి పెరిగింది.

'అసలీ వరూధిని ఎవరు ?' దగ్గరకొచ్చి శ్రీలేఖ మోహంలోకి గుచ్చి చూస్తూ అన్నాడు.

అదేనండి...నా స్నేహితురాలు. టీచరుగా చేస్తున్నది. వాళ్ళాయన కూడా బిజినెస్ చేస్తాడు. మనమోసారి వాళ్ళింటికి కూడా వెళ్ళాము.

అదంతా నాకు తెలియదు. ఫ్రెండయితే ఇంటికి పిలిచి భోజనంపెట్టు. అంతేగాని ఇలా ష్యూరిటీలు ఇచ్చి నా తలమీదకు తేకు. వెంటనే ఫోను చేసి డబ్బు కట్టమను. లేకపోతే పెనాల్టీలు వడ్డీలతో కలిపి నీ సాలరీలోంచి కట్ చేస్తాను.. వార్నింగ్‌లా అన్నాడు కరుణాకర్.

"తనే ఫోను చేసిందండి ఇందాకనే. వాళ్ళాయనకు ఆక్సిడెంట్ అవడంతో చిట్టి కట్టడం లేటయిందట. ఇల్లు అమ్మకానికి, పెట్టారుట. ఇవాళోరేపో అడ్వాన్సు రాగానే మొదట ఇదే కడతాను నీవేమీ కంగారుపడకు అని చెప్పిందండి.

అలాగే చెబుతారు కథలు అదంతా మనకవసరం. రేపటికల్లా కట్టాల్సిన డబ్బు అంతా కట్టమను. వాళ్ళు ఇల్లే అమ్ముకుంటారో వాళ్ళే అమ్ముకుంటారో మనకనవసరం.. విసురుగా అన్నాడు కరుణాకర్.

అదేంటండి అలా మాట్లాడతారు తను కడతానన్నదిగా, ఫ్రెండ్స్ అన్నాక ఆ మాత్రం సహాయం చెయ్యకూడదా ఏదో అనుకోని ప్రమాదం వల్ల లేటయింది తను చాలా ఖచ్చితమైన మనిషి అన్నది శ్రీలేఖ.

తెలుస్తూనే ఉంది ఎంత ఖచ్చితమైన మనిషో అయినా నన్ను అడగకుండా నాకు చెప్పకుండా నీవు ష్యూరిటీ ఇవ్వడం ఏమిటి? ఏదో అని ఊరుకున్న కొద్ది తలకెక్కుతున్నావే.

అదేంటండి నా ఫ్రెండుకు ష్యూరిటీ ఇవ్వడానికి మిమ్ముల్ని అడగాలా? ఆ మాటకొస్తే ఎన్నిసార్లు మీ ఫ్రెండ్స్‌కి నా చేత ష్యూరిటీ ఇప్పించలేదూ. ఉక్రోషంగా అన్నది శ్రీలేఖ.

అయితే.. నీవు నేను ఒకటేనా సంపాదిస్తున్నాను అంతా నా ఇష్టమే అనుకుంటున్నావేమో అదంతా ఏం కుదరదు నీ ఇష్టం వచ్చినట్లు చేయడానికి నీ పుట్టింటి సొమ్మేం రాసులు పోసి లేవిక్కడ. పుట్టింటి సొమ్మెందుకు నా సంపాదన మీద నాకు ఆ మాత్రం హక్కులేదా.. రోషంగా మాటకు మాట బదులు ఇస్తోంది శ్రీలేఖ.

ఊరుకుంటుంటే చాలా వరకు పోతున్నావే. నీ ఉద్యోగం, సంపాదన అసలు నీవే నాదానివైనప్పుడు ఇంక నీకు హక్కులేముంటాయ్. ఇలా తిక్కతిక్కగా మాట్లాడితే ఉద్యోగం ఊడబెరికించి ఇంట్లో కూర్చోబెడతాను. నోర్మూసుకొని చెప్పినట్లు చెయ్యి. ఏదీ ఆ వరూధిని నెంబరిలా ఇవ్వు నేనే మాట్లాడతాను. అయినా దాని మొగుడికి బుద్ధుండొద్దూ ఆడదాన్ని ష్యూరిటీ అడగడానికి అంటూ డైరి తీసి నెంబరు వెలికి తనే డయల్ చేశాడు.

వరూధిని భర్త ఎత్తాడు ఫోను.

చెడమడా తిట్టాడు కరుణాకర్ ఫోనులోనే. అంత కర్కశంగా మాట్లాడగలగడని మొదటిసారి తెలిసింది శ్రీలేఖకు. స్థాణువులా నిలబడిపోయింది. రెండ్రోజులదాకా భోజనం చెయ్యలేదు. ఆఫీసుకు కూడా పోలేదు మూడోనాడు కరుణాకర్ ఫోన్ చేస్తే వచ్చారు శ్రీలేఖ తల్లిదండ్రులు.

అన్ని చూసుకునే భర్త ఉండగా నీకెందుకే ఆ గొడవలు. అయినా ఆడవాళ్ళు భర్తకు తెలియకుండా ష్యూరిటీలు, జామీలు ఇవ్వొచ్చా ఏదో అల్లుడుగారు మంచివాడు కాబట్టి తన్నీతగలెయ్యడం లేదు.

అదేంటమ్మా... మీరు నన్నే అంటున్నారు అనబోతున్న శ్రీలేఖను అవును లేఖా నీకు చీరలు నగలు కొనివ్వకపోతే అనాలి. అన్నిటికన్ని చూసుకునే భర్తను బంగారం లాంటి సంసారాన్ని ఇలా నీవెంతటే నేనంతని పాడు చేసుకుంటారా ఎవరైనా అంటూ మందలించింది తల్లి.

శ్రీలేఖకు కొత్తగా జ్ఞానోదయమవుతున్న భావన. కొత్త నిజాలను వింటున్న ఫీలింగ్, తను అందరికంటె భిన్నమయిన దాన్నని, తనకు పూర్తి ఆర్థికస్వేచ్ఛ ఉందని అనుకునేది ఇన్నాళ్ళు. కాని తన స్వేచ్ఛ వెనుక పురుషాధిపత్య నీడలున్నాయని ఇప్పుడే తెలిసింది. అమ్మో మా ఆయనకు తెలిస్తే ఇంకేమయినా ఉందా అనే వనజకు మా ఆయనకు చెప్పి చూస్తానే అనే ఉషకూ తనకు తేడా ఏమిలేదు.

## దీర్ఘ కవిత

# అందని చందమామ



డా॥ కాసుల లింగారెడ్డి

(13)
అరకోటి పెట్టుబడితో
ఒంటిమీద తెల్లకోటు
మెడలో స్టెతస్కోపు
కారుచౌక భూమి
సుంకాల రాయితీలో యంత్రాలు
సబ్సిడీ మంత్ర విద్యుత్తు
వెలుస్తున్న ఇంద్రభవనాలు–
అసంబద్ధ శాస్త్ర పరీక్షలు
అనవసర శస్త్ర చికిత్సలూ–
కాసుల సంచుల కోసం
గర్భసంచుల కత్తిరింపులు–
సర్వరోగ కడుపు నొప్పి నివారణ
ఆపరేషన్ అపెండెక్స్–
అద్దం తిరిగిందన్నది ఒక సాకు
దారిలేదనేది ఒక జోకు
కడుపులు చించడం
ఖాతాలు పెంచుకోవడం
ఒక సాంకేతిక దోపిడి వ్యాపారం–
సరికొత్త అణచివేత సాధనం–
భయం సిమ్‌కార్డుని
మెదడులో ఇన్‌సర్టు చేశాక
అదే వినిపిస్తది
ఆసుపత్రి రింగ్‌టోన్‌ని
సంపూర్ణ ఆరోగ్య పరీక్షా విధానం–
ఆరోగ్య భీమా ఒక లక్కీ లాటరీ–
కండ్లల్ల ఒత్తులేసుకొని
ఖరీదైన జబ్బుల కోసం ఎదురు చూడడం
హెల్తుకార్డు మాయాబజార్‌ల వినోదక్రీడ–
లేటెస్టు రింగ్‌టోన్‌లు తప్ప
హిపోక్రటీస్ ఓత్ వినిపించదిప్పుడు–
సహానుభూతి
సామాజిక బాధ్యత
మానవ నైతికత
వాళ్ళ పాసుబుక్కుల్లో లేని పదాలు–
తద్దినమెళ్ళినంక శస్త్రచిక్సితకు పిలుపు
స్వచ్ఛంద సంస్థల మేడిపండు 'శేవ్'ల తంతు–
Health for all by 2000 Ad
ఒక అందని చందమామ.:

(14)
దేవుడి ధ్యాన మహత్తయినా
కాకమ్మ కథల తాయత్తయినా
బాబాల మంత్ర కషాయమైనా
కర్మఫలాల భారమైనా
ఊహల మంత్రాలకు
స్వస్థత చింతకాయలు రాలవు–
మధ్యయుగపు మౌఢ్యాలు
శాస్త్ర పరీక్షకు నిలవవు–
ఆసుపత్రులు
ఆధునిక మయసభలు–
స్వస్థత సెలయేరుల ఎండమావులు–
అవి దూపగొన్న గొంతుల తడుపబోవు–
అంగాంగానికి మానిటర్ల మోటార్లు బిగించుకొని
కాసులెల్లబోసి
వాళ్ళ ఖాతాలు నింపుడు
ఇంకా మన వల్ల కాదు–
బహుముఖ ఆరోగ్యదేహాన్ని
ఒకే ఒక అంగంగా కుదించి
For every ill there is a pill
ధ్యేయాన్ని ప్రకటించడం
ఇంకా సహించలేము–
కాలం చెల్లిన వాహనం మీద
రాంగ్ రూట్ రైడింగ్
ప్రజారోగ్యం రెండు కాళ్ళూ ఫ్రాక్చరైనవి–
నేషనల్ హెల్త్ పాలసీ
నాడి ఆడట్లేదు–
Hurry up… Hurry up
అత్యవసర శస్త్ర చికిత్సకు
ఆపరేషన్ థియేటర్ సిద్ధం చేయండి–
కూలుతున్న హక్కుల భావి గోడలమీద
ఉద్యమాల ఓడలు పోద్దాం–
సరికొత్త అంతరిక్ష నౌకలో
సరికోత్త వ్యోమగామి సమూహాలమై
చందమామ ఆలింగనాల్లో సేదదీరేందుకు
ఆరోగ్య జ్ఞాన సమాజాల నావిష్కరించేందుకు
పద….పద
Hurry up… Hurry up

(సమాప్తం)

# దళిత కథ ప్రతిబింబించిన ఓ జానపద కళ

**సాధారణంగా 'నేలపైన ఒక దప్పును బోర్లించి దానిపైన చిల్లర డబ్బులను వుంచుతారు. వాద్యకారుడు మరో దప్పుతో వాయిస్తే, ఆ శబ్ద కంపనానికి దప్పు మీదున్న చిల్లర డబ్బులన్నీ నేలమీద పడిపోతాయి. అలాగే నేలపై కరెన్సీ నోట్లను వేసి లయ తప్పకుండా దప్పును వాయిస్తూనే నేలపై ఉంచిన కరెన్సీ నోట్లను చేతితో ముట్టకుండా కంటి రెప్పలతో అందుకుంటారు.**



**డా॥ కొలకలూరి మధుజ్యోతి**

దళిత సాహిత్యం దళిత జీవితాన్ని ఎంతటినో ప్రోది చేసుకొని ఉంది. ఎంతో సంస్కృతి ఉంది. ఎన్నో జానపద అంశాలు ఉన్నాయి. ఎన్నో జానపద కళలూ వ్యక్తమయ్యాయి. ఆ కళలతో ముడిపడిన కష్ట సుఖాలూ ఉన్నాయి.

దప్పు దళితులది, దప్పుకు సంబంధించిన ఎన్నో కోణాలతో ముడిపడిన జీవితం దళితులది. ఆటకీ పాటకీ దప్పు, సంతోషానికి దప్పు, సంబరానికి దప్పు, పెళ్ళికీ చావుకీ దప్పు, చాటింపుకు, ఊరేగింపుకు దప్పు, పండుగకీ, జాతరకీ దప్పు. ఇన్నింటికి ఆసరా అయినా దప్పు, అన్నింటికీ అన్ని రకాలుగా పలుకుతుంది. దళితులది దప్పుతో ముడిపడిన అనేక కళలలో దళితుల ప్రావీణ్యా నైపుణ్యాలు స్పష్టంగా కనిపించాయి వీటిని అన్నివేళలా ప్రజలాదరించారు. ఇప్పుడవి లిఖిత సాహిత్యంలో ప్రతిబింబితమవు తున్నాయి.

దప్పుతో ఆధారపడిన ఒక కళ నేలపై నాణేన్ని నుదుటితో తీసుకోవటం. ఇది ఒక ప్రదర్శన కళ. ఇది ఒక వ్యక్తి నైపుణ్యాన్ని సామర్థ్యాన్ని ఓర్పును ప్రతిబింబించే కళ. ఇది ప్రదర్శన కళే అయినా చిందు భాగవతం లాగానో తోలుబొమ్మలాట లాగానో వైయుక్తికమో, వైయుక్తిక ప్రదర్శన సామర్థ్యం గల కళగానో లేదు. ఇది దప్పు వాయిద్యంతో ఆ ఊపుతో లయతో ఉద్రేకంతో ముడిపడిన ఓ ఆధారిత కళగానే ఉంది. దప్పు అనే పెద్ద కళావరణంలో ఓ ఆశ్రిత కళగా ఇది వుంది అని చెప్పవచ్చు. దప్పు వాయిద్య సమయంలో చేసే విన్యాసాలలో ఇది ఒకటి. జనాకర్షణ కలిగినది కనుక దీనిని ప్రదర్శన కళగానే పేర్కొనవచ్చు. అయితే ఇది ప్రత్యేక కళగా పరిపూర్ణం కాలేదు. కేవలం దప్పును ఆశ్రయించుకొన్న కళగా మాత్రమే నిల్చింది కళాకారుడి నైపుణ్యాన్ని చూడటం అచ్చెరువొందటమే కాదు. దప్పు వాయిద్యంతో కూడిన ఆ ప్రదర్శనకు రోమాంచితులు కాని వారుండరంటే అతిశయోక్తి కాదు.

ఆంధ్రుల జానపద విజ్ఞానంతో జానపద కళలను ఇలా విభజించాడు ఆర్వీయస్ సుందరం.

ఇది స్థూల విభజన. ఇప్పుడు చెప్పుకొంటున్న కళ సంగీత నృత్య సహిత కళ వాద్యంతో లయాత్మక అడుగుతో కూడిన ప్రదర్శన. ఇది లయాత్మకంగా దప్పు వాయిస్తూనే శరీరాన్ని కదిలిస్తూనే నేల మీద పడిన డబ్బును పైకి తీయటం, తీయగాన్నే ఈ కళాకారులు తిరిగి మళ్ళీ దప్పు మోతకు అనుగుణంగా కదులుతూనే మళ్ళీ నాణేలను అందుకోవటానికి పూనుకొంటారు. ఇది ఒక వ్యక్తి కొన్ని గంటల పాటు కొన్ని కిలోమీటర్ల మేర సాగుతూ చేసే ప్రదర్శన. వ్యక్తి అంగపుష్టి నైపుణ్యం సహనాల సమిశ్రిత ప్రదర్శన ఇది.

ఈ కళ దళిత కథలలో కనిపిస్తుంది. కళతో ముడిపడ్డ ఆనందం కష్టం కంగారు ఉద్వేగం ఉల్లాసం వ్యక్తం చేస్తున్నాయి ఈ కథలు. ఇవి మూడు కథలు, తెలంగాణా, కోస్తా, రాయలసీమ ప్రాంతాల కథలు. ప్రాంత వైవిధ్యం కళ ఏకరూపతను సామ్యాన్ని చూపుతూ రాష్ట్రమంతటా దళితులలో ప్రచారంలో ఉన్న కళా నైపుణ్యాన్ని ఈ కథలు చాటుతున్నాయి.

జాతర సమయంలో జరిగిన ప్రదర్శన ఎండ్లూరి సుధాకర్ 'రెప్పల మీన రూపాయి' కథలో వర్ణించాడు. గురయ్య డబ్బును నుదుటితో తీయడంలో దిట్ట. వందరూపాయల పచ్చనోటును దప్పుమీద పెట్టి నేలమీద పెట్టాడు. దాని చుట్టూ తిరుగుతూ దరువులేస్తూ చిందులేస్తూ ఉన్నాడు. దప్పు శబ్దానికి ఆ పచ్చనోటు దప్పు మీద నుంచి కింద నేలమీద పడింది.

సాధారణంగా 'నేలపైన ఒక దప్పును బోర్లించి దానిపైన చిల్లర డబ్బులను వుంచుతారు. వాద్యకారుడు మరో దప్పులతో వాయిస్తే, ఆ శబ్ద కంపనానికి దప్పు మీదున్న చిల్లర డబ్బులన్నీ నేలమీద పడిపోతాయి. అలాగే నేలపై కరెన్సీ నోట్లను వేసి లయ తప్పకుండా దప్పును వాయిస్తూనే నేలపై ఉంచిన కరెన్సీ నోట్లను చేతితో ముట్టకుండా కంటి రెప్పలతో అందుకుంటారు. అంటాడు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి జానపద కళారూపాలు (పు-421)లో. ఇది రెండు



విధాలు. డప్పుపై నాణేలను వేయటం, రూపాయి నోట్లను వేయటం. డప్పు కల్పించే కంపనానికి నాణెం నేలపై పడినంత త్వరగా పచ్చనోటు నేలపై పడదు. డప్పు కళాకారుడికి అది అదనపు పరీక్ష.

కొన్నిసార్లు డప్పు మీద కాకుండా నేరుగా నేలపైనే వేయడమూ ఉంటుంది.

డబ్బును నేలపై నుంచి తీసే వైనం రెండు రకాలుగా కనిపిస్తుంది. ఒకటి నుదుటితో డబ్బు తీయటం, కనురెప్పలతో డబ్బు తీయటం, మొదటి దానికి చిల్లరనాణేలు సులువు. రెండవ దానికి కాగితం సులువు. ఈ ప్రదర్శన చేసే వ్యక్తి సామర్థ్యం మీద ఆ ప్రదర్శన చూడటం వలన వచ్చే హర్షాతిరేకాలు మీద ఆధారపడి డబ్బును పెట్టడం ఉంటుందనేది సాహిత్య వస్తువును చూస్తే అర్థమయ్యే విషయం.

ఎండ్లూరి రాసిన కథలో గురమ్మ పట్ల మంచి గురే ఉంది. ఊరి ఆసామికి అందుకే వందనోటిచ్చారు. గురయ్య చేసే డప్పు మోతకి పచ్చనోటు పసరికపాములా జారుకుంటూ నేలమీద పడింది. మట్టి మీద బడ్డ పచ్చనోటుని డప్పుగొడుతూనే తలకాయొంచి నుదురుకి అంటించుకున్నడు. అట్టనే జాగర్తగ పైకి లేచి నుదురు మీన్నూంచి రెప్పలకాన్నుంచి మీసాలవరకు దెబ్బి నాలుకతో పచ్చనోటు అందుకొని మునిపంటితో కలిసిపట్టుకున్నాడు. యిదంతా దరువు ఆపకుండానే జేస్తా వుండాడు" ఇదీ, ప్రదర్శన. చేతుల ప్రమేయం లేకుండా కిందపడ్డనోటు తీసుకొన్న అద్భుత విన్యాసం గురయ్యది.

నాగప్ప గారి సుందర్‌రాజు 'నడిమింటి బోడెక్క బసవిరాలయ్యేద' (మాదిగోడు) కథలో బోడెక్క ఏడుపుతో సంబంధం లేకుండా బసవిగా చేసే ఓ కార్యాన్ని ఊరంతా సంబరంగా జరుపుకొంటున్న సందర్భంలో డప్పు వాయిద్యకారుల నైపుణ్యాలను వివరించాడు. రూపాయి బిళ్ళలు తప్పిటలో వేయించుకొని కింద నుంచి చిటికెలతో కొడుతూ ఉంటే అవి ఎగిరెగిరి పడటం వాటిని ఏరుకొని రంగన్న జేబులో వేసుకొంటుంటే, దాని చూసి రెచ్చిపోయిన గుడ్డాయప్ప రూపాయి నోటును మట్టిలో పడేసి తప్పెట కొడ్తూ కంటిరెప్పతో నోటును పైకి తీశాడు. రంగన్న ఇంకా రెచ్చిపోయి 'పావులా బిల్లలు నేలమిందేసి తప్పిడి కొట్టుకంట, ఆపకుండా తలకాయి బోర్లేసి పొండుకొని మగముని మొంట్లో అట్లా ఇట్లా పోర్లాడిచ్చి పావులా బిళ్ళని పణమింద అంటిచ్చుకుని పెయ్యికి లేసి తప్పిట్ని యెగిరెగిరి కొడుతుంటే సుట్టు ముట్టు సూసేకి ముసురుకొనిన జనుము ఈలలు యేసి క్యాకలు యేసి అరుసుకంట యెగురుతుండారు" (31) ఇది సంబరం. సంబరంలో ఇక్కడ వ్యక్తికి సామర్థ్యం.

ఈ కళ మాత్రమే వచ్చిన మరే పనిరాని గురయ్య ఎంత దయనీయంగా పోయాడో ఎండ్లూరి వివరిస్తే అసలు ఈ కళే ఎంత తప్పనిసరిగా చెయ్యాలో ఎంత అవస్థో ఎంత ప్రాణాంతకమో చాటే కథ పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన 'సావుడప్పు' (మాయిముంత) కథ. చావు డప్పుకు ముందు నిల్చి ఆడేవాడు కథలో నర్సిమ్మ. 'నా నొసలు ఎత్తుగా చెక్క లెక్క సక్కగుంటుంది. నేలమీద చిల్లర పైసలు నేనే అందుకోవాలి' అనే నర్సిమ్మాకి ఆ రోజు జ్వరం ఒళ్ళునెప్పులు, చావు డప్పు అంటే ఒళ్ళంతా హూనం హూనం. డప్పు సాగినంత మేర ఆకలి దప్పులు తీరవు. ఈ కష్టాన్ని త్వరగా ముగిద్దాం అంటే చావు ఊరేగింపు తొందరగా సాగనివ్వరు. డప్పు కొట్టే వాళ్ళలో చిన్నవాడు కావటంతో అందరి దృష్టి అతనిపైనే. ఊరి పటేల్ చావుకు ఊరేగింపు మొదలయ్యింది. పిల్లలు జి.ఆర్. అక్షర రూపంలో బిళ్ళలు పెట్టారు. 'అన్ని చారాన బిల్లలే... అందరూ గుండం గట్టిండు, నేను నడుమలకు పోయి డప్పు కొట్టుకుంట వంగి నొసటితో అద్దుకున్న చారాన మట్టిలో కూరకపోయింది. నొసటికి ఇసుకరాల్లే అంటినయి... మరోసారి వంగిన అందలేదు.... మళ్ళి వంగిన నొసలకు పట్టిన చెమటను తుడుచుకున్న కండ్లల్ల ముక్కుల దుమ్ము. మోకాళ్ళ కింద ఇసుకరాళ్లు. అయినా బిళ్ళలను ఏరి మా చిన్నాయిన కిచ్చిన" మళ్ళీ మొదలు. 'ఒక్కొక్క పైసను అందుకుంటూ లేచి నుదుటి మీద నుంచి తీసుకొని మల్లి వంగుతున్న'.

అదే చారాన బిల్లలు. 'ఒక బిళ్ళను అందుకోవడానికి నేను వంగిన నా నడుమ మీద ఇంకో బిల్లను పెట్టింద్రు.... మా చిన్నాయిన దాన్ని అందుకోపోతుంటే ఇంకో బిల్లను ఆయన ఈపు మీద పెట్టింద్రు... ఆయన వీపు మీద ఇంకో పైసకిందోన్ని కిందనే ఉన్న'. ఇదే తంతు మళ్ళీ మళ్ళీ అర్ధగంటకు పైగా ఇదే ఆట, విన్యాసం, చిల్లరంత అయి పోయిందని ఆనందించేసరికి పది రూపాయల నోటిచ్చి చిల్లర తీసుకొని మళ్ళీ మొదలు. ఇంతా చేస్తే నాలుగు ఇళ్ళన్నా దాటలేదు ఊరేగింపు రెండు మైళ్ళు దూరం ఇంకా సాగాలి. చావు డప్పుకు ఇచ్చే డబ్బు తిండికి పనికి వస్తుందని వారి ఆశ వారినెన్ని కష్టాలకు గురిచేస్తుందో చెప్తుందీ కళ. మనుషులను కాష్టంగా చేసే కళగా దోపిడికి గురిచేసే కళగా ఇక్కడ నిలుస్తుంది. ఈమూడు కథలో సుఖానికి, సంబరానికి, కష్టానికి ఈ ఆట కనిపిస్తుంది.

కళ, కళలోని విస్తృతిని ఈ కథలో చాటబడింది. కళ సంబంధమైన సుదీర్ఘత, కళలోని విభిన్న ధోరణి ఈ కథలో స్పష్ట పడింది. కళను ప్రధానంగా ప్రదర్శించే నర్సిమ్మ ఇబ్బందిని అలా ఉంచితే వస్తువు జోలికి పోకపోతే ఈ కళా కోణాలు బాగా ప్రతిష్టత మయిన కథ ఇది.

ఈ కథలో డప్పు వాయిస్తూ డబ్బు నాణేల రూపేణా కాని కాగితం రూపంలో తీయటం ఒక పని. అది నుదిటితో కాని కనురెప్పలతో కాని తీయటం తప్పనిసరి. ఈ విషయంలో ఖచ్చితమైన నిర్ణీతమైన నియమాలు లేవు కాని అది ఖచ్చితంగా మన్ను/ నేలపై నుంచి తీయటం తప్పనిసరి.

జానపద కళల ప్రయోజనం ప్రధానంగా ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, ఆశ్చర్యాన్ని కల్పించటంగానే ఉన్నా, నేడు ఎన్నో సామాజిక అవసరాలను తీర్చటానికి వాటిని వాడుకోవటం వద్దు.

'డప్పు శబ్దం, కాలు అందెల లయ తప్పకుండా అడుగు కింద ఉంచిన పైసను నాలుకతో తీసే దళిత దండోరా వీరులు మా చరిత్రలో అనునిత్యం పోరాడుతారు... పనితో పాటనీ ఆటనీ నాదాన్ని ముడివేసిన కళలు మావి. పనిచేసిన మా శరీరాలు అలసట తీరేందుకు, మా మనసులోని బరువు తగ్గేందుకు పుట్టిన కళలు" అంటారు. డా॥ కంచ ఐలయ్య (మనతత్వం, పుట 28,29) అన్ని దళితుల కళలూ ఈ మాటను బలపర్చేవే. కాని ఇప్పుడు పేర్కొంటున్న కళ ప్రతీకమైనది. ఐలయ్య మాటల్లో 'మాదిగడప్పు అన్ని కులాల పెండ్లిలో, చావుల్లో తప్పకుండా ఉంటుంది. అది పెండ్లిలో ఆనందాన్ని, అధికం చేయడాని కుంటే, చావులో దుఃఖాన్ని తగ్గించ డానికి కుంటుంది. (మాదిగ ఆర్థిక సాంఘిక తత్వం పు 20) అంటాడు. ఈ డప్పు విన్యాసాలు ప్రయోజనం ఇంత మాత్రమే కాదు. కష్టానికీ, సుఖానికి పలికే పంచుకొనే దళిత ఔదార్యం సంస్కృతి మరచిపోరాని కోణం. ఒకరి కోసం ఒకరం అనే అతి ప్రాథమిక మానవీయ మౌలిక సూత్రాన్ని చాటే అపురూపమైన కళ ఇది.

కథ

# సైనైడ్



సిమెంటు బజారు రద్దీగా ఉంది. అసలే ఇరుకు బజారు. ఉదయం 9 గంటల ప్రాంతం. బడి పిల్లలను తీసుకుపోతున్న ఆటోలు. మోటార్ సైకిళ్ళు. వాహనాల వరద. కాలి నడకన పోయేటోళ్ళు చేతులు దగ్గరకు ముడుసుకుని ప్రాణం బిగబట్టి నడుస్తుండ్రు. ఏ మాత్రం అజాగర్తగున్నా ఏ ఆటోనో, స్కూటరో గుద్దుడు ఖాయం.

**ఎలిశెట్టి శంకర్**

షణ్ముఖ స్కూటర్ నడుపుతుండు. స్కూటర్ తనను మోసుకుపోతుందా, తనే స్కూటర్‌ను నెట్టుతున్నడా అన్నంత మెల్లగా... ఓ కాలు కింద పెట్టి నడుపుతున్నడు. సిమెంటు బజారంటేనే అంత రద్దీగుంటదని పట్టణ వాసులకే కాదు చుట్టుపక్కల ఊర్లల్ల నుంచి వచ్చే వారికీ తెలుసు.

సిమెంటు బజారున కంసలోల్ల  బజారని కూడా అంటరు. అన్నీ బంగారం దుకాణాలే. బంగారం పనిచేసే వాళ్ల షాపులు, రెడీమేడ్ నగల షోరూంలు.

ఏ షాపుకూ ముందు బోర్డుండదు. గిరాకీ వచ్చేది సేట్ల ముఖం చూసి, నమ్మకంతోని. షాపుల ముందర బోర్డులు పెడితే దొంగలకు అడ్రస్ రాసిచ్చినట్టే అంటరు ఆ బజారులో ఏ దుకాణదారుడిని అడిగినా. షణ్ముఖ పది షాపులు దాటడానికి పావుగంట పట్టింది. అంతరద్దీ. అంత మెల్లగా నడుపుతుండు స్కూటరును.

తన షాపు ముందు అరుగులు కనిపించినయ్. నాలుగడుగులు వేస్తే.. ఈ పద్మవ్యూహం నుంచి బయటపడత అనుకుండు.

షాపు ఎదురుగా.. పక్కకు.. బాగా అంచుకు స్కూటరాపిండు షణ్ముఖ. రోజూ పెట్టే అలవాటు. అంతకు మించి ఒక ఇంచు స్కూటరు షాపు దిక్కు కదిలినా నోరు తెరిసి ఉన్న మోరీలో పడటం ఖాయం. స్కూటర్ తాళమేసి డిక్కీలో నుంచి బ్యాగు తీసిండు. అందులో నుంచి షాపు తాళాల గుత్తి అందుకుండు.

ఎదురుగా అప్పటికే వచ్చినిలబడ్డ పిలగాండ్లు. ఒక పిలగాడు పది పన్నెండేండ్లు ఉంటండు. పేరు ఆశోక్ పని నేర్చుకుంటుండు. కాస్త పెద్ద పిలగాడు రామాచారి. నాలుగేండ్లుగా పనిచేస్తుండు. చాలావరకు పనివచ్చు. తాళాల గుత్తి రామాచారికిచ్చిండు షణ్ముఖ. అప్పటికే కొన్ని షాపులు తీసిండ్రు. ఎదురుగా ఉన్న షోరూం తెరువలేదు. వాళ్ళు కాస్త ఆలస్యంగనే తీస్తరు.

రామాచారి తాళం తీసిండు. చెక్క తలుపులు పక్కలకు మలిసిండు. పాతకాలం నాటి తలుపులు. రంగు వెలిసిపోయి ఉన్నయ్. తలుపు వెనుక మూలకున్న పొరక అందుకుండు రామాచారి. హడావిడిగా ఊడ్సటం మొదలు పెట్టిండు. ఆశోక్ కుంపటిలో బొగ్గులు సరిచేయడం బూడిద ఎత్తడం చేస్తుండు. ఏ షాపు అయినా ఇంతే. యజమాని వచ్చిన తరువాతనే తాళం తీయడం. వేరే దుకాణాలైతే తాళం చేతులిస్తే పిల్లలు తీసి శుభ్రం చేస్తరు. కాని బంగారం షాపుకదా. నమ్మకాలుండవు. ఎవరి జాగర్తలో వాళ్లుండాలె గదా అంటరు. ఊడ్సడం అయిన తర్వాత ఫ్యాను వేసిండు రామాచారి.

షణ్ముఖ బయట నిలబడి అంతా గమనిస్తూనే ఉండు. తలుపు సాటుకు చెప్పులు విడిచిండు. షాపులో ఓ మూలకున్న దేవుని పటాల దగ్గరకు పోయి ఊదీ కడ్డీలు ముట్టిచ్చిండు. దండం పెట్టిండు. పటాల ముందున్న కుంకుమ తీసుకుని నుదుట బొట్టు పెట్టుకుండు.

తను రోజూ కూసునే చిన్న స్టూలు మీద కూసుండు. నుదుట బొట్టు, నూనె పెట్టి మంచిగ అణగదువ్విన జుట్టు. ఇస్త్రీ మడత నలగని బట్టలు... నున్నగగీసుకున్న గడ్డం... కడిగిన ముత్యమోలిగుండు.

ఎడమచేతి వైపునున్న చిన్న సొరుగు తాళం తీసి తెరిసిండు. తన బ్యాగులో తెచ్చుకున్న పొట్లాలు అందులో సదిరిండు. రోజూ షాపు బంద్ చేసే టప్పుడు వెండి, బంగారం రవ్వంత కూడా ఉంచకుండా ఇంటికి తీసుకుపోతడు షణ్ముఖ.

బంగారు షాపులో బంగారం పెట్టి తాళమేసి పోతమా. ఒకవేళ పెట్టిపోతే పొద్దున్నే తాళం కప్ప ఉంటదా అంటారు. దొంగల భయం మరి. ఒక వెండి ముద్దను తీసి రామాచారికి అందించాడు షణ్ముఖ.

'రామాచారీ దీన్ని తీగపట్టు. ఇయ్యాల అయిపోవాలె. ఇప్పటికే... నా పట్టా గొలుసులు, నా పట్టా గొలుసులని ఆమె ఒకటే తిరిగిపోతున్నది' అన్నడు నాలుగు దినాల సంది తిరిగిపోయే ఆడ మనిషని తల్సుకొని. కుంపటి ముట్టించే పనిలో మునిగిపోయిండు అశోక్.

షణ్ముఖ ఆ రోజు చెయ్యాల్సిన పనులును యాది చేసుకుండు. వెండి బంగారం పొట్లాలను చూసుకుంటుండు. 'సున్నితపు పని. కూసోని కూసోని నడుములు పోతయ్. చూసీ చూసీ కండ్లు పోతయ్. కుంపటి ఆరదు. లేసే బూడిద. పొద్దస్తమానం సుత్తి కొడితే బువ్వమందం ఎల్లడం కనాకష్టం. అదే పనిచేసే పిల్లలకైతే చెమట కార్చుడు తప్ప ఒరిగేదేముంది.'



ఎటూ దిక్కులేక చేస్తుండ్రు పిల్లలు. ఆ యింత ఆకలికి సావలేరుగా. అయినా ఈ పనిమీద అందరికీ అప నమ్మకమే. ఎంత తెలిసిన వాళ్లైనా సరే... సగం నమ్మకం సగం అపనమ్మకం.

' నమ్మి ఇస్తున్న షణ్ముఖా. తేడా ఒస్తే నీదే బాధ్యత' అంటారు.

నిజాయితీగా చేసినా సరే... కంసలి పనంటేనే అంత. ఈసంల మాసం దొబ్బకుంట అంటారు' అని మొకం మీద అనెటోళ్ళు ఉన్నరు.

అన్నింటికి నవ్వుతడు షణ్ముఖ. బంగారం పని అంటేనే అట్లుంటది మరి.

పొట్లాలు సరిచూసుకుంటున్న షణ్ముఖ తలెత్తి చూసిండు. షాపు బయట ఇద్దరు ముగ్గురు ఆడోళ్లు. వాళ్ళను ఎప్పుడూ చూస్తనే ఉంటడు. మోరీలు శుభ్రం చేసేటోల్లు. మున్సిపాలిటోల్లు కాదు. బంగారం, వెండి రవ్వ కోసం మోరీలు కడుగుతరు. ఏం దొరకుతదో ఏమోగని పొద్దటిపూట వచ్చి ఓపిక ఉన్నంతసేపు మోరీలు కడిగిపోతరు.

అప్పటికే కాస్త రద్దీ తగ్గింది. వాహనాలు పలుచబడ్డయి. నడిచిపోయేటోల్లు కాస్త ధైర్యంగా పోతుండ్రు. ఆ బజారుకు కొత్త మొకం వచ్చిందంటే సాలు. ప్రతి షాపులో నుంచి పశానత్తు చేస్తనే ఉంటరు.

ఆ వొచ్చింది దొంగా దొరా అనేది అట్ల చూసి ఇట్ల గుర్తు పడతరు.

షణ్ముఖ ఆ రోజు చేయాల్సిన పని ముందలేసుకుండు. తలవంచి పనిలో లీనమైండు.

మోటారు సైకిల్ ఆగినప్పుడు. తల ఎత్తి చూసిండు. బలంగా ఉన్న మనిషి మోటర్ సైకిల్ స్టాండ్ వేసిండు. ఎగా దిగా చూసుకుంట లోపలికొచ్చిండు.

'షణ్ముఖ షాపేనా ఇది' గొంతులో కరుకుదనం.

షణ్ముఖ అనుమానంగా చూసిండు. ఎవరై ఉంటరు. పనిమీద ఒచ్చినోడైతేకాదు. అడిగే తీరు వేరుగా ఉంది. పోలీసు మనిషైతే కాదుగా!

మనిషి చూడడానికి అట్లనే ఉండు. తను అంతగా గుర్తించలేకపోతుండు.

'అవునండీ' షణ్ముఖ మామూలుగా అన్నడు. ఎవరైతేంది ఒకటేగా అన్నట్టుగా.

'నువ్వేనా షణ్ముఖ'.

షణ్ముఖ అవునన్నట్లుగా తల ఊపిండు.

'వన్‌టౌన్ స్టేషన్ నుంచి వొచ్చిన. ఎస్ఐగారు రమ్మన్నారు.'

కానిస్టేబులని అర్థమైంది షణ్ముఖకు.

మరీ గొంతు మీద కూసున్నట్టుగా అంటుండేది. మనసులో చిరాకు పడ్డడు షణ్ముఖ.

'ఎందుకండీ' కడుపులో భయమైతున్నా మొకం మీదికి నవ్వు తెచ్చుకునే ప్రయత్నం చేసిండు షణ్ముఖ.

'అయ్యన్నీ చెపితే తప్ప రావా ఏంది? ముందు నడువ్'' చిటపటలాడిండు కానిస్టేబుల్.

షణ్ముఖకు భయంగా ఉంది. సిమెంటు బజారుకు పోలీసంటేనే ఏదో గండం అని అర్థం. దొంగతనాలు, విచారణలు... పెద్ద తలనొప్పి. ఏం మెడకు సుట్టకోబోతుందో తలుచుకుంటెనే షణ్ముఖ వొల్లు వొనికింది. అయినా తప్పేటట్టుగా లేదు. అయినా ఓ మాట అందామని

'ఇప్పుడే వచ్చిన. ఎక్కడి వస్తువులు అక్కడే ఉన్నయ్. సదిరేసి వస్త పొరాదురి' అన్నడు ధైర్యం తెచ్చుకుని. ఉన్న ఫలంగా అంటే ఒంటరిగా పోవాలె. తరువాత అయితే తన సంఘం నాయకుడిని తీసుకునిపోవచ్చనేది షణ్ముఖ ఆలోచన.

'అవన్నీ చెప్పొద్దు. మర్యాదగా నడువ్' కానిస్టేబుల్ నిప్పులమీద ఉన్నట్టు మాట్లాడిండు.

ఇంక తప్పదన్నట్టుగా వస్తువులు సదిరిండు. సొరుగుల పెట్టి తాళమేసిండు షణ్ముఖ.

కాని స్టేబుల్‌తో పాటు బైటికి నడిచిండు.

అప్పటికి చుట్టుపక్కల షాపులోల్లకు అర్థమైనట్టుంది. తన దిక్కే చూస్తుండ్రు

– – –

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్.

కాని స్టేబుల్ గర్వంగా స్టేషన్లకు నడిసిండు.

షణ్ముఖ తటపటాయించిండు. స్టేషన్ల కాలు పెట్టాలంటెనే ఉరికంబ మెక్కెటోనికి చెమటలు పట్టినట్టుగా పడుతున్నయ్.

కానిస్టేబుల్ వెనుకకు మళ్ళి 'నడువ్ నిలబడ్డవేంది' అన్నడు.

ఆ గొంతులో మరింత కరుకుదనం గుండెకు గుచ్చుకుంది షణ్ముఖకు.

'వీడేనా రాత్రి ఎస్సైగారు చెప్పిన చారి' సెంట్రీ అడిగిండు కానిస్టేబుల్‌ను.

' ఆ ఆ వీడే షాపుల కూసుంటె పట్టుకొచ్చిన' కానిస్టేబుల్ భాష కూడా మారిపోయింది.

'నడవరా నడువ్ లోపలికి' సెంట్రీ మెడ బట్టి నూకినంత పనిచేసిండు.

షణ్ముఖ నిలువెల్లా వొనికి పోతుండు. లోపలికి రెండడుగులు వేసిండు. స్టేషన్ కానిస్టేబుళ్లంత తననే చూస్తుండ్రు. షణ్ముఖకు కుంగిపోతున్నట్లుగా అనిపించింది. అంతా అగమ్యగోచరంగా ఉంది. లోపల ఓ గోడ వారకు నిలబడబోయిండు షణ్ముఖ.

సెంట్రిరపరప వొచ్చి 'ఏం పెండ్లి కొచ్చినావుర. పో... పొయ్యి ఆడ కుసో' గద్దించిండు.

సెంట్రీ చూపించిన వైపు చూసిండు. అంతా దుమ్ము... దుమ్ము. మూలకు పాను, గుట్కాలు ఊసిన మరకలు. గుప్పుమంటున్న గచ్చు వాసన.

ఎదురుగా రెండు లాకెప్ గదులు. అందులో ఇద్దరు ముగ్గురు మనుషులు తనవైపే చూస్తుంద్రు.

షణ్ముఖకు మెదడు మొద్దుబారి పోయింది. ఏం జరిగింది. తనను ఎందుకు తీసుకొచ్చింద్రు. ఏం జరగబోతుంది. తల మీద సుత్తితో కొట్టినట్లుగా ఉంది.

'రేయ్ చారీ ఆమూలకు కూసో' సెంట్రీ గద్దింపు.

చేసింది లేక లాకప్పుల పక్కన మూలకు కూసుండు షణ్ముఖ. తల తిరుగుతున్నది. వాంతి కొచ్చినట్లుగా ఉంది. ఒళ్లంత వొణకు... భయం.. బెదురు...

– – –

మధ్యాహ్నం ఒంటి గంటకు స్వర్ణకారుల సంఘం నాయకుడు మల్లయాచారి స్టేషన్‌కొచ్చిండు. కనపడ్డ కానిస్టేబుల్‌నల్లా పలకరించిండు. ఆయనకు కొద్దిపాటి పరిచయాలు. ఏవో పనుల మీద స్టేషన్‌కొచ్చే మనిషాయె.

'ఎస్సై గారు లేరండి' సెంట్రీని అడిగిండు మల్లయాచారి.

'పనిమీద బయటికి పోయిండు. ఇంగ ఇప్పుడేమొస్తడు. సాయంత్రమే వొస్తడు' సెంట్రీ చెప్పిండు. మల్లా సెంట్రీనే అడిగిండు.

'ఏందీ షణ్ముఖచారి కోసమా... మావోళ్లు పొద్దున పట్టుకొచ్చింద్రంటగదా' షిఫ్టు సిస్టంలో ఇంకో కానిస్టేబుల్ సెంట్రీ డ్యూటీ చేస్తుండు.

పొద్దున డ్యూటీ చేసిన కానిస్టేబుల్ వివరాలు చెప్పి పోయిండు. "ఆ ... ఆ.." అన్నడు మల్లయాచారి. షణ్ముఖ కోసమే వచ్చినట్లుగా అన్నడు.



' ఇంతకు ఏంది కత' మల్లయాచారి అడిగిండు సెంట్రీని.

'ఇక ఏముంటయ్, ఆ లాకప్పుల ఉన్నడు చూడు.. వాడే, మూడు రోజులాయే... ఒక్కొక్కరి పేరు చెబుతుండు. మరి మీవోని పేరు చెప్పిండేమో' సెంట్రీ పోలీసు గొంతుతో చెప్పిండు.

మల్లయాచారి ఒక్క నిమిషం ఆలోచించినట్లు చేసి 'మా వోంతోని రొండు మాటలు మాట్లాడ్త' అని షణ్ముఖ ఉన్న దిక్కు కదిలిండు.
మల్లయాచారిని చూసే సరికి షణ్ముఖకు దుఃఖం తన్నుకొచ్చింది. ప్రాణం లేచి వొచ్చినట్లుగా అయ్యింది. లేచి దగ్గరకొచ్చిండు.

మల్లయాచారి షణ్ముఖ భుజం మీద చెయ్యి వేసిండు. ధైర్యం చెప్పినట్లుగా 'భయపడకు నేను మాట్లాడ్తగా' మల్లయాచారి అభయమిస్తున్నట్లుగా అన్నడు.

షణ్ముఖకు కండ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినయ్.

ఒక్క పూటకే సగమైండు మనిషి. మొకంలో దిగులు... భయం..
"నేను పనిమీద ఊరికి పోయుంటి. ఇంతకు ముందే వచ్చిన. రాంగనే తెలిసింది. షాపుకాడ పిలగాడు రామాచారి చెప్పిండు. వాన్ని కూడ రమ్మన్న'. మల్లయాచారి ఆలస్యానికి సంజాయిషీ ఇచ్చినట్లు చెప్పిండు. షణ్ముఖ మాట పడిపోయినట్లుగా నిలబడ్డడు.

'ఏమన్న ఉందా' మల్లయాచారి ఆరా తీసినట్లుగా అడిగిండు.

'ఏం లేదు. పొద్దున తీసుకొచ్చింద్రు. మాట ముచ్చట లేదు'.

షణ్ముఖ గొంతులో భయం.

'ఏ.. ఎవడ్రా' సెంట్రీ గొంతు ఖంగుమన్నది.

ఆ కేకకు బయటకు చూసిండు మల్లయాచారి.

బయటకు షణ్ముఖ షాపులో పనిచేసే పిలగాడు రామాచారి, చేతుల్లో పొట్లం. బహుశా షణ్ముఖ తినడానికి ఏమైనా తెచ్చినట్టుంది.
'ఆ ఆ మావాడే. తింటందుకు తెచ్చినట్లుంది.' మల్లయాచారి సెంట్రీతో అన్నడు.'

సెంట్రీ పక్కకు తప్పుకోగానే రామాచారి లోపలికొచ్చిండు.

'ఏంటిదిరా పిలగా' మల్లయాచారి పొట్లం దిక్కు చూసుకుంట అడిగిండు.

'అన్నం' అని షణ్ముఖ చేతికందించిండు.

షణ్ముఖ ఇబ్బంది పడ్డడు. ఆకలైతున్నా తినలేడు.

'ఆ వద్దు' అన్నడు.

'తిను, అటు బయట కూసొని తిందువు పా' మల్లయాచారి స్టేషన్ వెనుక దర్వాజగుండ నడిసిండు.

స్టేషన్ బయట చెట్లు. చెట్టు కింద మంచినీళ్ళ కుండ.

బలవంతంగా పొట్లం విప్పిండు షణ్ముఖ. నాలుగు ముద్దలు మింగి చెయ్యి కడుక్కుండు.

చెట్టు కింద ఉన్నంతసేపు మల్లయాచారి 'యాదికి తెచ్చుకో' అన్నడు.

షణ్ముక గట్టిగా చెప్పిండు. 'నాకేం తెల్వదు. నిజం చెబుతున్న. నేను అసువంటి వాటి జోలికిపోను.' మల్లయాచారికి అర్థమైంది. ఏదో జరిగింది. షణ్ముఖకు తెల్వకుంటనే జరిగింది. అది కాస్త బయటపడ్డది. పట్టుకొచ్చింద్రు.

పోలీసోల్లు వాల్లపని వాళ్ళు చేస్తరు అనుకుండు నిర్లిప్తంగా.

మల్లయాచారి లోపలకొచ్చి సెంట్రీకి చెప్పిండు.

'పిల్లగాడు భయపడుతుండు. మెత్తటోడు కాస్త చూసుకోరి. ఎస్సైగారొచ్చే యాళ్ళకు వస్త'. ఆ మాట చెప్పి మల్లయాచారి బైటికి పోతుంటె షణ్ముఖకు ధైర్యం పోయినట్టుగా అయింది. ఒంటరితనం... కటికోడి ముందు మేకపిల్లోలిగ...

– – –

సాయంత్రం ఏడు గంటలు.

స్టేషన్లో లైట్లు వెలుగుతున్నయ్.

మల్లయాచారి వచ్చి గంటయ్యింది.

ఎస్సై మోటర్ సైకిల్ ఆగిన చప్పుడు.

సెంట్రీ సెల్యూట్ కొట్టిండు.

సింహాసనం మీద రాజు కూచున్నట్టుగా...నిటారుగా నడుస్తూ వచ్చి కుర్సిల కూసుండు ఎస్సై. అప్పటికే కానిస్టేబుల్ స్టేషన్ సమాచారంతో సిద్ధంగా ఉండు. రెండు ముక్కలల్ల ఎస్సైకి చెప్పిండు. కానిస్టేబుల్ ఎస్సై గదిల నుంచి వెల్లగానే మల్లయాచారి లోపలికి పోయిండు.

పలకరింపుగా నవ్విండు ఎస్సై.

'బాగున్నరా... చాలా రోజులాయె' అన్నడు.

'మీ దయవల్ల' అనుకుంట మల్లయాచారి ఎదురుగా కుర్చీలో కూసుండు.

'ఏందీ సంగతి' ఎస్సై డైరెక్టుగా విషయంలోకి వచ్చిండు.

మల్లయాచారి షణ్ముఖ విషయం చెప్పిండు.

ఎస్సై పోలీసు నవ్వు నవ్విండు. ఆ నవ్వులో నిర్లక్ష్యం. గర్వం.

'మీ వోడు దొంగ బంగారం కొన్నడు' అన్నడు పొడి పొడిగా.

'వాడె అట్లాంటోడు కాదండీ, చాలా భయస్తుడు' మల్లయాచారి షణ్ముఖ గురించి అన్నడు.

'అందరూ దొరలే, దొరికితేనే దొంగలు' ఎస్సై కుర్చీలో వెనుకకు జారగిలబడి కాళ్ళు బార్లా సాపి అన్నడు'.

'ఏ ఎవ్రరా అక్కడ'

ఎస్సై గొంతుకు ఓ కానిస్టేబుల్ సార్ అనుకుంట గదిలోకి వచ్చిండు.

'వాన్ని, ఆ షణ్ముఖ గాన్ని తీస్కరా' అన్నడు.

రెండు నిముషాల్లో ఎస్సై ముందు షణ్ముఖ. భయంగా చేతులు కట్టుకుని నిలబడ్డడు.

ఎస్సై విలాసంగా కాళ్ళూపుకుంట 'ఏందిరా సంగతి, ఎంత దొంగ బంగారం కొన్నవ్' సూటిగా షణ్ముఖను అడిగిండు.

షణ్ముఖ గుండెల్లో రాయి పడ్డట్టయ్యింది.

'నాకే పాపం తెల్వదు'.

షణ్ముఖ కన్నీల్లు కారుతుంటే అన్నడు.

'అబద్దాలు చెప్పినా దాగవు. నువ్వు ఎవని దగ్గర కొన్నవో... ఎంతకు కొన్నవో అంతా నాకు తెలుసు.' ఎస్సై గొంతు కఠినంగా ఉంది.



షణ్ముఖకు ఏం మాట్లాడాలో తోయక దిక్కులు చూసిండు.

'సరే నువ్వు బయట నిలబడు' అన్నడు

షణ్ముఖ గదిల నుంచి బయటకొచ్చిండు.

మల్లయాచారి.ఎస్సై టేబుల్ మీదికి వొంగి 'జర కనిపెట్టురి, వాడు మెత్తటోడు' అన్నడు.

ఎస్సై పులి నవ్వినట్టుగా నవ్విండు.

' నెలకింద పది తులాల బంగారం కొన్నడు. దొంగలు దొరికిండ్రు. మా కస్టడీలోనే ఉండ్రు. నిజం తేలాలెగా' అన్నడు.

మల్లయాచారి నచ్చజెప్పే ప్రయత్నం చేసిండు.

ఎస్సై ససేమిరా అన్నడు.

మాట్లాడి రేపు పంపిస్తలే అన్నడు.

మల్లయాచారి ఉసూరుమంటు బయటికొచ్చిండు.

\- - -

నాలుగు రోజుల పాటు మల్లయాచారి స్టేషన్ చుట్టు తిరిగిండు. స్థానిక నాయకులను వెంట తీసుకొచ్చుకుండు. అయినా ఎస్సై అదే మొండి పట్టుదల.

ఈ నాలుగు మాపులు షణ్ముఖ నరకం చూసిండు. చివరికి కొన్నట్లుగా ఒప్పుకుండు. అయితే ఒక తులం. సంగతేందంటే నెలకింద తెలిసిన వ్యక్తి వచ్చిండు. తను ఇబ్బందుల్లో ఉన్నానని, భార్య మెడమీది గొలుసు అమ్మదలుచుకున్నానని చెప్పిండు. షణ్ముఖ కొన్నడు. పాతది కొనడం వల్ల పావలో బేడో మిగులుతుందని ఆశ. అది అందరు చేసేదే. ఆ అమ్మిన వ్యక్తి దొంగట. పోలీసులకు దొరికిండు. విచారణలో షణ్ముఖ పేరు చెప్పిండు.

ఎస్ఐ పది తులాల బంగారం రికవరీ కావాలన్నడు.

మల్లయాచారికి పోలీసు పద్ధతులు తెలుసు. ఎస్ఐని ముందుగా సంతృప్తి పరిచిండు. బలవంతం మీద నాలుగు తులాల బంగారం రికవరీ చేయడానికి ఒప్పుకుండు.

దానికి షణ్ముఖ తల ఊపిండు. బతికితే సాలు బలుసాకు తినొచ్చు అనుకుండు. మెడ మీద కత్తిపెట్టి నాలుగు తులాల బంగారం రికవరీ చేసిండ్రు పోలీసులు.

కేసు, కోర్టు అనే మాట లేదు...

ఒళ్లు, ఇళ్లు హూణమై ప్రాణంతో బయటపడ్డడు షణ్ముఖ

\- - -

నెల్లాల్ల పాటు మనిషి కాలేదు షణ్ముఖ

ఒళ్ళునొప్పులు... అవమానం... జీర్ణం చేసుకోలేకపోతుండు. అప్పుతెచ్చి రికవరీ సొమ్ము కట్టిండు. అప్పు దిగులు మరింత.. తండ్రి సంపాయించిన ఇల్లు అమ్మి అప్పు తీర్చుదామని మొండి ధైర్యం చేసుకుండు.

మళ్ళీ షాపుకు పోతుండు.

\- - -

సరిగ్గా నెలకు....

మల్లా షాపుకు పోలీసులొచ్చిండ్రు.

టూ టౌన్ వాళ్ళట.

మళ్లీ మొదలయినయ్ షణ్ముఖ కష్టాలు.

అదే దొంగ...

టూ టౌనోళ్ళకు దొరికిండు.

అదే పద్ధతి...

అదే రికవరీ...

\- - -

షణ్ముఖ అప్పులు తీర్చడానికి షాపు అమ్ముకుండు. ఇల్లు అమ్ముకుండు.

పాత బస్తిలో ఓ సందుల... ఓ అర్ర అద్దెకు తీసుకుండు.

పెండ్లం పిల్లలు బతికాలిగా. ఇంటి దగ్గర్నే పని చేస్తుండు. ఓనాడు సందులు గొందులు వెతుకుతూ పోలీసులొచ్చిండ్రు.

షణ్ముఖ పనిచేస్తున్నడు.

రావడం రావడంతోనే 'ఒరే చారీ' అని కేక.

షణ్ముఖ పై ప్రాణాలు పైనే పోయినయ్.

ఇంకా తన దగ్గరేముంది? షాపు పోయింది. ఇల్లు పోయింది. గొందిలో ప్రాణం ఉంది.

భార్య, ఇద్దరు పిల్లలుండ్రు.

ఇట్ల కూడ బతకనీయరా?

'రేయ్ చారీ' ఎస్సైగారు రమ్మంటుండ్రు.

షణ్ముఖ పోలీసుల దిక్కు చూసిండు.

వన్‌టౌన్... టూటౌన్.. కాదు.

'రూరల్ ఎస్సై రమ్మంటుండ్రు...నడువ్' కానిస్టేబుల్ గద్దింపు.

షణ్ముఖకు బతుకు చీకటిగా అనిపించింది.

ఏం చేయాలె.

ఇంటి ముంగల పోలీసులు...

మేకను మింగడానికున్న తోడేలోలిగ.

షణ్ముఖకు బతుకు భారంగా అనిపించింది. ఇక ఈ భూమి మీద బతకలేననిపించింది.

'రేయ్ నిన్నేలే' కానిస్టేబుల్ గొంతులో పెరుగుతున్న కరుకుదనం.

షణ్ముఖకు తనమీద తనకే అసహ్యమేసింది. తన బతుకు మీద తనకే రోత పుట్టింది. అంతా చీకటిగా అనిపించింది.

' ఏయ్ ఏందిరా ఎన్నిసార్లు పిలవాలె' కానిస్టేబుల్ గదిలోకి అడుగేసిండు.

అయిపోయింది... అంతా అయిపోయింది...

ఎదురుగా కానిస్టేబుల్...

పక్కన చిన్న డబ్బా...

దానిలో ఓ పొట్లం...

పొట్లంలో సైనైడ్...

ఌం

# కవితలు

## ఏం చేస్తావో?!



**చాగంటి తులసి**

తల్లీ
నువ్వు నా ఇంట
అడుగుపెట్టావ్
ఇహ ఈ ఇల్లు
నాది కాదు
నీది!

ఈ కాలపు
పిల్లవి
అమ్మో! నీకు
తెలియనిది
ఏదీ లేదని
నీకు నీ మీద
చెప్పలేనంత
నమ్మకం!!

అయినా
నాది
బతుకుసారం
నీది
పుస్తక జ్ఞానం!
నా కొడుకు
చెయ్యి పట్టుకుని
ఇంకో
రంగు రంగుల
కలల్లోనే ఉన్నావ్
నేలని
నీకాళ్లు ఆనటం లేదు
నా బెంగంతా
అదే!!

వాడు
నా కడుపు పంటే
కడుపులో ఉన్న
తొమ్మిది నెలలూ
పూర్తిగా
నావాడే!!
కనడం వరకే
నేను
కన్నతల్లిని

కళ్లు తెరిచి
లోకం చూశాడు
తన తండ్రికి
కొనసాగింపు
అయ్యాడు!!

వాడు
మగ మూసలో
రూపు పోసుకుంటూ
ఉంటే
ఏం చెయ్యలేని
మూగసాక్షిని
నేను!!

తల్లీ
తొలినాటి
రంగురంగులు
కలల రోజులు
తొందరగా దొర్లుకుపోయి
వాడు
వాడి తండ్రి రూపంలో
నీ ఎదటికి వస్తాడు!
నువ్వు
నా రూపంలో
వాడి అదిలింపులకి
అదికారానికి
అహంకారానికి
అణిగిమణిగి
తలఒగ్గుతానో
ఏం చేస్తావో!!

## ఎవరు చెప్మా




**మాల్యశ్రీ**

తనకి తానే ఉరివేసుకునే వాడు
తనికి తానే
మరణశిక్ష విధించుకునేవాడు

మనమానాన్ని గాచి
మానమర్యాదని నిలిపి
వస్త్రదానం చేసేవాడు
అస్తిత్వం రూపు మాపు కొంటున్నాడు

అప్పులతో
ఆకలితో
అవమానాలకి గురయ్యేవాడు
ఆత్మహత్యలకి ఎరయ్యేవాడు
ఎవరు చెప్మావాడు
ఎవరికీ గుర్తురానివాడు

ఎవరికీ దేనికీ పట్టనివాడు
ఎన్నికలకు మాత్రమే జ్ఞాపకం వచ్చేవాడు
ఎవరు చెప్మావాడు!
చీనీ చీనాంబరాలు నేసినవాడు
అగ్గిపెట్టెలో ఆరుగజాల చీరని అమర్చినవాడు
అపరశిల్పి
ఎవరు చెప్మావాడు!
గతమెంతో ఘనకీర్తి కలిగినవాడు
చేతిలో ఇంద్ర ధనస్సులున్నవాడు

పడుగు పేకల్లో ప్రాణం పోసేవాడు
పట్టెడన్నానికి నోచుకోనివాడు
పై గుడ్డకు కూడా మొహం వాచినవాడు
మగ్గం మీద నుగ్గు నుగ్గవుతున్నవాడు
అగ్గిలేకుండగనే బుగ్గవుతున్నవాడు
ఎవరుచెప్మా ఎవరు చెప్మా!
దళారులు అతని కడ్డం వస్తారు
పారి శ్రామికులు అతనికి పాడెకడతారు
చేమగ్గానికి ఒకనాడు యజమాని
ఇప్పుడు ఫ్యాక్టరీ మరమగ్గానికి రోజు కూలీ...

నాయకుల నయవంచన
ప్రపంచీకరణ పెను ప్రళయం
అతని అస్తిత్వానికి చరమాంకం
అతని అకాల మరణానికి ఆహ్వానం
ఎవరు చెప్మా అతను!

## నాడూ - నేడు

**శిల్పా జగదీష్**

విజ్ఞానం అంటే
మతపు రాతిగోడల మధ్య
మూఢుడు పాతిన
పూజితరాయి కాదురా!

విజ్ఞానాన్ని దహించి వేస్తే
ధగ్ధమైపోయే భౌతిక పదార్థం
అంతకంటే కాదని
తెలుసుకోరా వెర్రి సన్యాసి!

మీ భాషలోనే చెప్పాలంటే
విజ్ఞానాన్ని
అగ్ని దహింపజాలదు
నీరు తడుపజాలదు

గాలి ఆర్పివేయనూ వీలుకానిది
విజ్ఞానం విశ్వజనీనం అని తెలుసుకో

ఆనాడు జ్ఞానమందిరంలోనే
గాంధీని ఫాసిస్టు తుపాకితో
కాల్చి చంపితే ఏమైంది?
శాంతి ప్రవచనాలు
ప్రపంచాన్ని ఆలోచింపచేసాయి

ఇప్పుడు విజ్ఞాన మందిరంలో
కమ్యూనిస్టు గాంధీ పటంను
మీ మత ఛాందసవాదులు
కాల్చి కూల్చేస్తే అంతమైపోతుందా?

విజ్ఞానం విశ్వాన్ని చైతన్యపరిచే
కరదీపికని తెలుసుకోవటం
మీ మతం మత్తు మెదళ్ళకు
ఏనాటికీ తెలియదుగాక తెలియదు

**(సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై
ఫాసిస్టులు జరిపిన దాడిని ఖండిస్తూ...)**

విశ్లేషణ

# శివసాగర్ సాహితీ సాక్షాత్కారం

**భార్య భర్త రెండు భిన్న ప్రాణులైనప్పటికి విడివిడిగా బతకలేనంత పరస్పర ఆకర్షణశక్తి వారిని ఒకటి చేస్తోంది. పని – పాట రెండు వేరు వేరు పనులై నప్పటికి భార్య –భర్తల మధ్యనున్న అవినాభావ సంబంధం లాంటిదే. వీటి మధ్య కూడా వుంది. భార్య లేకుంటే భర్త ఎలా తపించిపోతాడో అలాగే పాట లేకుండా పని కూడా నీరసించిపోతుంది. భార్య భర్తల ఐక్యతలో మాధుర్యం ఎలా శిఖరాగ్ర స్థాయిని పొందుతుందో అలాగే పని – పాట ఏకోత్పన్నతలో కూడా ఆ శిఖరాగ్రస్థాయి మాధుర్యం అనివార్యంగా కలుగుతోంది**




## ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న

'నరుడో భాస్కరుడా' అనే ప్రసిద్ధమైన పాట ద్వారా విప్లవ భావాల్ని బాగా వ్యాపింపచేసిన కవి. కె.జి. సత్యమూర్తి. ఇతనికి శివుడు, శివసాగర్ అనే పేరు కూడా వున్నాయి. శివసాగర్ అనే పేరుతో జానపద బాణిలో అనేక పాటలు రాశాడు. ఇతనికి జానపద బాణిల పాటల్లో ఒక విశిష్ణత వుంది. ఏక కాలంలో పండిత పామరుల్ని మెప్పించ గల శక్తి వీటికి వుంది. జానపద గేయాల్లో కన్పించే భాషా సారథ్యంతో పాటు ఇతర సాహిత్యాల్లో కన్పించే భావ పరిణతి వుంది. స్వయంగా పాణిగ్రాహిలా విప్లవ పోరాటాల్లో పాల్గొన్నాడు. 'నా చెల్లి చెంద్రమ్మా' అనే ఇతని కథా గేయం కరుణ రసంతో నిండి ఆదరణ పొందింది. ఎన్నో రకాలుగా శివసాగర్ విప్లవ కవులకు మార్గదర్శకుడు.

'గువ్వలతో చెలిమి చేసి
కొండచిలవతో పోరి
నీ నెత్తురు ధారలతో
రహదారులు పోసినావు"

ఇది శివసాగర్ మార్గం, కవిగా నక్సల్బరీ శ్రీకాకుళ విప్లవోద్యమాల ముద్దుబిడ్డ శివసాగర్. ఈమార్గంలో తీరిక లేకుండా పోరాడాలని శివసాగర్ ఆవేదన. పోరాటం చేసి, ఫలితం సాధించిన ఉద్యమకారుడు సత్యమూర్తి.

'పొద్దస్తమానం
పనిపాటల్లో పడి
కన్నెత్తయినా చూడటం లేదని
అలిగి
కవిత కన్నవారింటికి
వెళ్ళిపోయింది'

ఇది శివసాగర్ అంతరంగం. విప్లవ కార్యాచరణలో నిరంతర నిర్విరామ కృషి చేయాలన్న విప్లవ కారుల అంతరంగానికి శివసాగర్ ఇక్కడ ప్రతినిధిగా నిలబడుతున్నాడు. ఇక్కడ కవితను శివసాగర్ భార్యగా భావించడంలో భార్యాభర్తల ఐక్యత పనిపాటల్లో కూడా వుందని ప్రతిపాదించాడు. భార్య భర్త రెండు భిన్న ప్రాణులైనప్పటికి విడివిడిగా బతకలేనంత పరస్పర ఆకర్షణశక్తి వారిని ఒకటి చేస్తోంది. పని – పాట రెండు వేరు వేరు పనులై నప్పటికి భార్య –భర్తల మధ్యనున్న అవినాభావ సంబంధం లాంటిదే. వీటి మధ్య కూడా వుంది. భార్య లేకుంటే భర్త ఎలా తపించిపోతాడో అలాగే పాట లేకుండా పని కూడా నీరసించిపోతుంది. భార్య భర్తల ఐక్యతలో మాధుర్యం ఎలా శిఖరాగ్ర స్థాయిని పొందుతుందో అలాగే పని – పాట ఏకోత్పన్నతలో కూడా ఆ శిఖరాగ్రస్థాయి మాధుర్యం అనివార్యంగా కలుగుతోంది. అందుకే శివసాగర్ కవితను భార్యగా భావించాడన్నమాట.

### చెల్లీ చెంద్రమ్మ

శివసాగర్‌కు విప్లవంలో స్త్రీల పాత్రను గూర్చి స్పష్టమైన అవగాహన వుందనటానికి 'అమ్మ' పాత్రతో పాటు చెల్లి 'చెంద్రమ్మ' కూడా ఒక మంచి నిదర్శనం.

'నా చెల్లీ! చెంద్రమ్మా' గేయం ఈనాటికి గ్రామాల్లోని భూస్వాముల కాముక దృష్టికి భోగలాలసతకు వ్యతిరేకంగా స్త్రీ ఎలా పోరాడాలో చెప్పే గేయం. ఆ చెంద్రమ్మ రేపల్లె చెంద్రమ్మ. అల్లే పూవులాంటి చిన్నది. మొగిలి పూవులాంటి మరిది మొగిలన్న ఆమె ప్రియుడు. వాళ్లు చూడ చక్కని జోడు. మొగిలన్న కాసిరెడ్డి రాకాసి కోరలకు బలైపోయాడు. చెంద్రీ చేయిలోన చేయివేసి వొడిలోన తలవుంచి తనువు చాలించాడు. చంద్రమ్మ శోఖం ఏరులై, వరదలై, సంద్రమ్మై ఆకసం తాకింది. ఆమె బ్రతుకు వల్ల కాడయింది. వగచి వగచి పగబట్టి లేచింది. చిటపట చినుకుల్లో, కందిరిగ మధ్యలోవున్న చంద్రిని చూసి పసల కొట్టం వద్ద 'మసలు' కొందామని కాసిరెడ్డి దాపుకొచ్చాడు. చెంద్రమ్మ వగలమారి దొరనుకత్తితో కుత్తుకలో పొత్తి కడుపులో గుచ్చింది. ఊరికి పులిని, దోపిడీకి దొరను కత్తికి సొరకాయ చేసింది. కారిన రక్తాన్ని నుదుట బొట్టు పెట్టుకొంది. చీమ చిటుకునగ చీకటిలో కలసిపోయింది. జాలరి జంగయ్య సాయంతో తెప్పమీద ఏరుదాటి అడవిలో అన్నల చేరింది తెల్లారింది. ఆ రోజు ఆ పల్లె 'నవ్వుతోంది.'

చెల్లి 'చెంద్రమ్మ' విప్లవకారిణికి ప్రతీక. జాలారి జంగయ్య విప్లవోద్యమానికి సానుభూతి చూపే మధ్య తరగతి వర్గానికి ప్రతీక. గురజాడ పూర్ణమ్మ కథకు, చెల్లీ చెంద్రమ్మకు పోలిక వుంది. పరిణతి విప్లవం వల్ల వచ్చిం'దని శివసాగరే స్వయంగా పూర్ణమ్మ కథ స్వభావాన్ని చెప్పుకొన్నాడు. పూర్ణమ్మ కథకూ చెల్లే చెంద్రమ్మకు మధ్య వున్న భేదం పూర్ణమ్మ 'ఆత్మత్యాగం' చేసి సమస్యను గాలికి వదిలేస్తే, చెందమ్రమ్మ భూస్వామిని చంపి సమస్యకు పరిష్కారాన్ని చూపించింది. ఇదే శివసాగర్ చెప్పిన విప్లవం వల్ల వచ్చిన పరిణతి.

### మలి కదలిక

శివసాగర్ కవితలో విప్లవోద్యమం సంపూర్ణంగా ప్రతిఫలించి విప్లవ కవితకు అనంత విస్తృతిని సాధించింది. విప్లవోద్యమ

పోరాటంలో సంభవించిన 'మలి కదిలిక' ఒక పోరాట వీరుడైన, శివసాగర్ భావోద్వేగంలో ప్రసరించింది. ఈ 'మలి కదలిక' కు నక్సల్బరీ శ్రీకాకుళ ఉద్యమాలు నేపథ్యంగా వ్యవహరించాయి.

తమ మీద జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కోవాలని ప్రజలు అనుకున్నప్పుడు అది తప్పనిసరిగ వర్గ పోరాటానికి దారి తీస్తుంది. వర్గపోరాటం ప్రజల పాలిటి బతుకు యుద్ధం అవుతుంది. ఈ బతుకు యుద్ధంలో ప్రజలు ఎప్పుడో ఒకప్పుడు సుబ్బారావు పాణిగ్రాహి అన్నట్లుగా చావో రేవో తేల్చుకోవలసి వుంటుంది. నేలతల్లి చెరను విడిపించడం కోసం శివసాగర్ రాసిన ఈ కింద పాట ఎంతగానో పోరాటోత్తేజాన్ని కల్గిస్తుంది.

"విప్పపూల చెట్ల సిగన – దాచిన విల్లంబులన్ని
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
లొహర్ జ్వాల దారిలోన – దాచిన విల్లమ్ములన్ని
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
బుగతగాడి నెత్తురుతో – తళతళలాడే కత్తులు!
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
తులసి కొండ లోయల్లో
– దాచిన బందూకులన్ని
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
గార్లరేగులు దారిలోన – గుంజుకున్న బల్ రైఫిల్
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
రూపాయి కొండలోన
– కోసిన సిపాయి పీక
నీకిస్తా తమ్ముడా – నీకిస్తా తమ్ముడా!
ఆవిరి కొండల కోనల – పారిన వీరుల రక్తం
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
చీకటి కొండల కన్నుల
– దాగిన వెన్నెల వెలుగులు
నీ కిస్తా తమ్ముడా! నీ కిస్తా తమ్ముడా!
బుదారి సింగి కొండల్లో
– పూచిన పూలన్ని ఏరి
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
బొడ్డపాడు పోతుగడ్డ
– గరుడ భద్ర మెరుపు దాడి
నీ కిస్తా తమ్ముడా ! నీ కిస్తా తమ్ముడా!
కైలాసం కళ్ళ వెలుగు
– వెంపటాపు చురుకు చూపు
నీ కిస్తా తమ్ముడా! నీ కిస్తా తమ్ముడా!
పాణిగ్రాహి కత్తిపాట – మల్లిక పసిపాప నవ్వు
నీ కిస్తా తమ్ముడా! నీ కిస్తా తమ్ముడా!
పేద ప్రజల ఆరాటం
– పేద ప్రజల పోరాటం
నీకిస్తా తమ్ముడా! నీకిస్తా తమ్ముడా!
విద్రోహుల మట్టుబెట్టి – రైఫిళ్లను చేతబట్టి
ఎర్రసేన నిర్మించగ – ఎర్ర ప్రాంత మేర్పరచగ
అన్నలతో చేయి కలిపి
– నేలతల్లి చెరను విడిపించగ
రావాలోయ్ తమ్ముడా
– జాగేలోయ్ తమ్ముడా!'

ఈ పాటను పాడేటప్పుడు అది శ్రోతల మీద ఎంతో ప్రభావాన్ని వేస్తుంది. ముఖ్యంగా పోరాటంతో ఎంతో కొంత పరిచయం, సానుభూతి వున్నవారి విషయం చెప్పవలసిన పనిలేదు. ఎందుకంటే ఈ పాట కొత్తవారికి చైతన్యాన్ని కలిగించడం మాత్రమే కాకుండా, పాతవారికి పోరాట అనుబంధాన్ని ఏర్పరుస్తుంది. పోరాట ప్రాంతాల పేర్లు, పోరాట సంఘటనలు, పోరాట వీరుల సంస్కరణ ఈ పాటలో వుండడమే దానికి కారణం. శివసాగర్ పాటలన్నీ దాదాపు విలక్షణమైన శైలిలో వుంటూ ఎంతో ఆవేశ పూరితంగా వుంటాయి. ఇది అటువంటి విలక్షణమైన పాట.

అత్యవసర పరిస్థితిని విధించ దానికి ముందు 1974 లో దేశవ్యాప్తంగా జరిగిన రైల్వే కార్మికుల సమ్మె చాలా ముఖ్యమైంది. ప్రభుత్వాన్ని చాలా క్లిష్టమయిన స్థితిలో వుంచి, దేశంలోని విప్లవ పోరాట శక్తులకు అది మంచి ఉత్తేజాన్ని కల్గించింది. ఆ సమయంలో రైల్వే సమ్మె మీదనే కాకుండా ఆ సమ్మెను బలపరుస్తున్న వారి మీద కూడా తీవ్రమైన నిర్బంధకాండను ప్రయోగించి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని ప్రభుత్వం ప్రయత్నించింది. ఆ సమ్మెను బలపరుస్తూ, సమ్మె పరిస్థితిని తెలియజేస్తూ శివసాగర్ ఈ కింది కవితను రాశారు.

'రెడ్ సిగ్నల్–
ప్రభుత్వం చక్రాలు కదలవు
ఇంజన్‌లో డూమ్ జాయింట్
ప్రమాదాన్ని సూచిస్తోంది
ప్రభుత్వ దమనకాండ ఎక్స్‌ప్రెస్‌కు
లైన్ క్లియరెన్స్ లేదు
అణగారిన కార్మిక శక్తి
అగ్ని పర్వతంలా బద్దలవుతోంది.

–––

కార్మిక నక్షత్రం
మళ్లీ దేశం ఆకాశం మీద
సగర్వంగా ప్రకాశిస్తోంది.
నగరంలో పారిన కార్మిక రక్తం
పల్లె దిక్కుగా ప్రవహిస్తోంది
దేశమంతా పెనుతుఫానుగా విస్తోన్న
కార్మికుల బిగి పిడికిళ్లలో
ఎర్రని చైతన్యం కనిపిస్తోంది
దేశం గుండెల్లో విప్లవ ఘడియలు మోగిస్తోంది

–––

అద్భుతంగా వుంది పరిస్థితి
అడివిలోని అగ్నికి ఆజ్యం పోస్తున్న నగరాలు
తిరుగబడ్డ కొడవళ్లతో
చేతులు కలిపేందుకు సన్నద్ధమవుతోన్న సమ్మెలు'

ఇక్కడ రెండు అంశాల్ని మనం గమనించాలి. విప్లవోద్యమం కార్మికుల సమ్మెను పూర్తిగా బలపరచడం అందులో ఒకటి. ఒక్క కార్మికుల సమ్మెను మాత్రమే కాకుండా ప్రజల్లోని ఏ వర్గం చేసే సమ్మెయినా విప్లవోద్యమం సాధారణంగా బలపరుస్తుంది. దోపిడీ వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తూ, దాన్ని కాపాడే ప్రభుత్వాన్ని బలహీన పరచడానికి ఇలాంటి సమ్మె పోరాటాలు, ఆందోళనోద్యమాలు జరుగుతాయి.

## ఆకాశంలో సగం

శివసాగర్ 'కీచక వధ' కవితలో ప్రకృతిని విప్లవకరంగా దర్శించడం జరిగింది.

'ఆకాశంలో సగం నీవు
అనంత కోటి నక్షత్రాల్లో
సగం నీవు సగం నేను
తూర్పు పవన సంగీతంలో
రాగం నీవు తానం నేను
మనిద్దరం కలిసి
ఉద్యమిస్తే ఉప్పెన
మనిద్దరం కలిసి
విప్లవిస్తే విజయం
ఆకాశంలో సగం నీవు'

విప్లవోద్యమంలో స్త్రీ భాగస్వామ్యాన్ని గురించి ఈ కవిత రాయబడింది. మనది పురుషస్వామ్య దోపిడి వ్యవస్థ కావడం వల్ల అన్ని విషయాల్లోనూ స్త్రీ పురుషుని చేత అణచివేయబడుతున్నది. పురుషుడు ఒకవైపు తాను సంకెళ్ళలో వుంటూ మరోవైపు స్త్రీని అదనంగా పురుష స్వామ్యమనే సంకెళ్లలో వుంచుతున్నాడు. అందువల్ల స్త్రీ ఒకవైపు పురుషునితో కలిసి దోపిడి వ్యవస్థను అంతమొందించడానికి విప్లవ పోరాటంలో

పాల్గొంటూనే మరోవైపు పురుషస్వామ్యం నుంచి తనకు తాను విముక్తి చేసుకోవడానికి పురుషునితో కూడా పోరాటం చేయవలసిన అదనపు భారాన్ని కలిగి వుంది. పురుష స్వామ్యం నిరాఘాటంగా కొనసాగడానికి కూడ దోపిడీ వ్యవస్థయే కారణం. కాబట్టి దోపిడి వ్యవస్థ పోకుండా పురుష స్వామ్యం కూడ పోదు. అందువల్ల విప్లవ పోరాటంలో స్త్రీ భాగస్వామ్యం తప్పనిసరిగా అవసరమైంది. స్త్రీ భాగస్వామ్యం లేకుండా విప్లవం జయప్రదం కాదు. ప్రపంచంలోనే సగభాగమైన స్త్రీ అందుకు తగినట్టుగా విప్లవ పోరాటంలో పాల్గొనాలి అని నొక్కి వక్కాణించాడు. సత్యమూర్తి.

ఒక కుట్రకేసు సందర్భంగా శివసాగర్ ఇచ్చిన కవితా వాఙ్మూలం ఇలా వుంది.

'న్యాయమూర్తులంగారూ!
భూమిని చాపచుట్టగా చుట్టి
చంకన బెట్టుకున్న రాక్షస భూస్వామ్యం కుట్ర
నా దేశాన్ని విదేశాలకు తెగనమ్మే
దళారితనం కుట్ర
కోసిగిన కుష్టు పాదాల పద్య
స్నేహ ఒప్పందం కుట్ర
నిక్సన్ ఓడలు తెచ్చే
ఆహారంలో కుట్ర
భారత స్వాహా తంత్రం కుట్ర
బ్యాలెట్ బాక్స్ కుట్ర
'గరీబ్ హటావో' కుట్ర
ఇందిరమ్మ మందహాసం కుట్ర
సూర్యుణ్ణి ఉరితీసేందుకు పొంచి వున్న
అన్యాయ శాస్త్రం అరమోడ్పు కన్నుల్లోని
అహంభావం కుట్ర
న్యాయ మూర్తులంగారూ
శ్రీకాకుళ సూర్యోదయం కుట్రకాదు
గెరిల్లా సూర్యుడు కుట్రదారుడు కాదు
చీకట్లను చీల్చడం కదా సూర్యోదయం
వేడి వెలుతురూ ప్రజలకు పంచడం కదా
సూర్యోదయం.'

ప్రజలందరికి న్యాయం జరగాలని కోరుతూ విప్లవ పోరాటంలో పాల్గొన్న వారి మీద కుట్రకేసులు మోపి శిక్షించడానికి అనువుగా వున్న న్యాయస్థానాలు, చట్టాలు రాజ్యాంగ పాలకవర్గ ప్రయోజనాల్ని మాత్రమే రక్షిస్తున్నాయి. అసలు మన రాజ్యాంగమే పాలక వర్గాలు కుట్ర ఫలితంగా రాయబడింది. ఈ రాజ్యం రాజ్యాంగ యంత్రం పరిపాలన, చట్టాలు – మొత్తంగా వ్యవస్థ అంతా – ఈ దేశం లోని ప్రజల మీద పాలకవర్గాలు జరిపిన పెద్ద కుట్ర. ఈ కుట్రను తెగటార్చివేయమని మన సమాజంలోని ఒక వైరుధ్యాన్ని చాలా చక్కగా ఈ కవితా భాగం చూపుతుంది.

శివసాగర్‌లో కన్పించే ప్రతీకల్లో రెండు ప్రధాన ధర్మాలు వున్నాయి. 1. జానపద వాస్తవికత. 2. విప్లవ చైతన్యం. విప్లవకవిత్వం ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి విప్లవోన్ముఖుల్ని చేయడానికి జానపదీకరణం పొందాలి. విప్లవాన్ని గ్రామీణ వాతావరణంలో సూటిగా స్పష్టంగా చెప్పిన గేయం 'కొక్కొరొకో'–

'కొక్కొరొకో అని కోడి కూసింది.
మబ్బులన్నీ దాటి మన అన్న సూరీడు
మారేడు కొండల్లో మాటుకాశాడు,
చీకట్ల దొరలను చీల్చి వేస్తున్నాడు,
కొక్కొరొకో అని కోడి కూసింది,

'నిదురబోయే సీమ కదలబారింది!
ఈనిన వరిచేను పాలు బోసింది
పాలుబోసిన చేను ఆర్రువంచింది:
అర్రువంచిన చేను కోత కొచ్చింది
కోత కొచ్చిన చేను కోత కోరింది:
కక్కు కొట్టాలిరా కొడవళ్ళకు – ఇంక
పదను పెట్టాలిరా – కొడవళ్ళకు
కొక్కొరొకో అని కోడి కూసింది
నిదురపోయే సీమ కదలబారింది
ఏతమెత్తని వాడః ఏరు కట్టినవాడః
నారు పోసినవాడః నీరు పోసిన వాడః
దుక్కి దున్నివాడః మొక్క నాటిన వాడః
కలుపు తీసినవాడః కలత మోసిన వాడః
కోతకొచ్చిన చేను కోత కోరింది
కోత కాలము నిన్ను కోరి పిలిచింది
కక్కు కొట్టండిరాః కొడవళ్ళకూ – ఇంక
పదును పెట్టండిరాః కొడవళ్ళకూ
కొక్కొరొకో అని కోడికూసింది
తూర్పు కొండంత జేవురించిందిః
నీలాటి రేవంత నిగ్గుదేరిందిః
పాతాళ గంగమ్మ పెల్లుబికి పొంగిందిః
కోతకొచ్చిన చేను కోత కోరిందిః
కోత కాలమే నిన్ను కోరి పిలిచింది.

ఈ గేయంలో కర్తవ్య నిర్దేశం ఒదిగిపోయింది. గ్రామీణ ప్రకృతి – కవిత్వం విప్లవానికి వినియోగించు కోబడ్డాయి. ఈ గేయాన్ని భావకవిత్వం పై వచ్చిన విప్లవంగా మనం చెప్పవచ్చు.

కొక్కొరొకో అనే కోడికూత ఉషోదయంలో విన్పించగానే గ్రామీణ ప్రజలు వారి వారి పనులకు సన్నద్ధమవుతారు. ఈ సంకేతాన్ని ఇది విప్లవాలు యుగమని చెప్ప డానికి విప్లవ శంఖారావంగా వుపయోగించు కోబడింది. అందుకే ఆ సంకేతంతో 'నిదుర బోయే సీమ కదలబారింది.

'విప్లవ ఆశావహదృష్టి' / రివల్యూషనరీ ఆప్టిమిజమ్‌తో విప్లవకారులు సామాజిక పరిస్థితి. విప్లవానికి అనుకూలంగా వుందని తలుస్తారు. అది పాలుపోసి, కోతకొచ్చి, ఆర్రువంచిన వరిచేనులా ప్రతీకరింపబడింది.

ఈ గేయంలో సామగ్రి అంతా గ్రామీణ ప్రకృతి అది గ్రామీణ ప్రజల రైతాంగ పోరాటాన్ని గూర్చి చెప్పడానికి అనుగుణంగా ప్రతిఫలించింది. ఆ రైతాంగం ఎవరు? ఏతమెత్తి, ఏరుకట్టి, నారుపోసి, దుక్కిదున్ని, మొక్కనాటి, కలుపుతీసిన శ్రమజీవులు. వాళ్ళు తమ ఇంటికి పంటలు గాదు 'కలతల మోసుక' పోతున్నారు. అందుకే 'కలత మోసినవాడా' అని ఆ శ్రామికున్ని ప్రతీకరించడం ఈ దోపిడీ తీవ్రత సహించలేని స్థితిలో శ్రామికుడు విప్లవిస్తాడు. అంటే దోపిడీయే ఆ దోపిడిని అంతం చేయడానికి కోరి పిలుస్తుంది. ఇక్కడ ఈ విధంగా ప్రతీకరించబడింది.

'కోత కొచ్చిన చేను కోరింది
కోత కాలము నిన్ను కోరి పిలిచింది'

ఈ 'కోడికూత' తోనే 'తూరుపు కొండంతా' జేవురించింది. 'నీలాంటి రేపంత' నిగ్గుదేరింది. తూరుపు కొండ జేవురించడం పోరాట చైతన్యానికి చిహ్నం. శ్రీకాకుళం కొండలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తూర్పున వున్నాయి. ఆ కొండల్లో గిరిజన రైతాంగం జరిపిన ఉద్యమం సూర్యోదయం చైతన్యానికి చిహ్నం. అందుకే శ్రీకాకుళోద్యమాన్ని 'తూర్పు కొండంత జేవురించిందని' ప్రతీకరించడం, ఆ చైతన్యంలో 'నీలాటి రేవు' మిగిలిన ప్రాంతం నిగ్గుదేరింది. ఆ చైతన్యంతోనే 'పాతాళ గంగమ్మ' – విప్లవం పెల్లుబికి పొంగిందని 'విప్లవ ఆశావహదృష్టి' కవితా రూపం పొందింది.

శివసాగర్ కమ్యూనిస్టు అవగాహనను కళాత్మకంగా ప్రతిఫలించిన ప్రతీకలు శాస్త్రీయమైన పోరాటానుభవం చేత పరిపూర్ణత పొందిన కవితా స్పందనకు గీటురాళ్ళుగా నిలుస్తున్నాయి.

'కడలి కడుపు మీటినవాడాః
కెరటాలపై లేచిన వాడాః'

ఇక్కడ కడలి ప్రజలకు ప్రతీక. వారి 'కడుపు మీటినవాడు' లెనిన్. ఆ ప్రజల విప్లవ చైతన్యం కెరటాలు. ఆ 'కెరటాలపై లేచినవాడు'

లెనిన్. అంటే ప్రజల అగ్రభాగాన నిలిచాడని అర్థం. 'అలలు' అనే కవితలో ఈ ప్రతీకల – భావాన్ని శివసాగర్ స్పష్టంగా చెప్పాడు.

'ఉరికంబం మీద అలలు
కటకటాల వెనుక అలలు
కన్నీళ్ళలో అలలుః అలలుః
కారడవిలో అలలుః అలలుః
కడలి జనంః అలలు దళంః
అలలు కడలి ప్రాణ ప్రదంః'

'అలలు' అంటే విప్లవ వీరులని, 'కడలి' అంటే ప్రజలని ఇక్కడ స్పష్టం చేయబడింది. దోపిడీ సమాజంలో ప్రజల జీవితం 'ప్రాణ రహితం' విప్లవకారులు దానికి ప్రాణం పోయడానికే విప్లవిస్తున్నారు. అందుకే 'అలలు కడలి ప్రాణప్రదం' అని శివసాగర్ చెప్పడం. 'ఎంతో ఆధునికమైన ఎక్స్‌ప్రెషన్‌కు ఈ గీతం మొత్తం ఒక అద్భుతమైన ఉదాహరణ'గా చెప్తూ వరవరరావుగారు 'అలలు ఎంతో సున్నితమైన, హృదయాంత రాళాల్ని మీటే భావన'గా పేర్కొన్నారు.

శివసాగర్ 'నేను' సంకేతం ఆధారంగా విప్లవవీరుడిని ప్రతీకరించడంలో అభివ్యక్తి, సామాగ్రి, శాస్త్ర పరిభాషకు, జన వ్యవవహారంలోని భావాలకు, పోరాట ప్రాంతాల పేర్లకు ప్రాణం పోశాడు.

'నేను నేను కాదు
నేను అదో లోకానికి పోతున్న
సమాజ విమానాన్ని హైజాక్ చేసినవాణ్ణి
ఖడ్గాన్ని మీటి ప్రపంచ జన సంగీతాన్ని సృష్టించినవాణ్ణి
చరిత్ర, చెక్కిలి ముద్దిడిన వాణ్ణి
నేను పొత్తిళ్ళలోని ప్రజా సైన్యాన్ని
నేను నక్సల్‌బరీనిః నేను ముషాహరినిః
నేను శ్రీకాకుళాన్నిః

శ్రీకాకుళం జిల్లా కొండ ప్రాంతాల్లో బూర్జువా వ్యవస్థకు వ్యతిరేకంగా గిరిజనులు చేసిన భౌతిక సంఘర్షణే శ్రీకాకుళం ఉద్యమం. ఈ భౌతిక పునాది నుంచి పుట్టిన 'శ్రీకాకుళం' ఈనాడు కేవలం ఒక భౌగోళిక ప్రాంతం కాదు. అది నూతన సమాజం కోసం అణచబడ్డ ప్రజానీకం చేస్తున్న పోరాటాలకి ఉత్తేజానిచ్చే ఒక ప్రతీక. ఈ విషయం శివసాగర్ కూడా గుర్తించాడు. అందుకే శ్రీకాకుళంతో పాటు నగ్జల్బరీ ముషాహర్ పోరాట ప్రాంతాల్ని విప్లవానికి ప్రతీకలుగా నిలబెట్టాడు.

శివసాగర్‌కు వున్న పరిశీలనాశక్తి, అవగాహన చాలా లోతయినవి. దోపిడి దొరల పులి స్వభావాన్ని ఇలా ప్రతీకరించాడు.

'నీ రక్తం గ్లాసులతో
తాగి తేన్పు దొరలుండగ'

మనిషయినవాడు మనిషి రక్తం తాగలేడు. తాగిన అరిగించుకోలేడు. కాని దోపిడి దారులు పీడితుల రక్తం తాగ తేన్పుతూ వున్నారు. అలాగే దోపిడి వ్యవస్థ విష స్వభావాన్ని ఇలా చెప్పాడు.

కష్టజీవిదారుల్లో
నాల్గు తలల విషపునాగు'

సామాజిక జీవనం సక్రమంగా నడవడానికి సామాజిక వ్యవస్థ నాలుగు వర్ణాలుగా విభజింపబడి వుంది. అవి. బ్రాహ్మణ, 2. క్షత్రియ, 3. వైశ్య, 4. శూద్రవర్ణాలు అయితే ఇవి సమాజంలో ప్రజల్ని 'ఉన్నత', 'హీన' వర్ణాలుగా విభజింప బడ్డాయి. అంతేగాకుండా 'హీన' వర్ణాల ప్రజల్ని 'ఉన్నత' వర్ణాలు దోచుకోడానికి అనువుగా సమాజంలో మార్మికతను ప్రవేశ పెట్టాయి. దోచుకోడానికి అనువైన ఈ సంప్రదాయాన్ని 'నాలుగు తలల విషపునాగు' అని చెప్పడంలో ఆ సంప్రదాయ వ్యతిరేక దోపిడిని అంతం చేయాలన్న తపన ఈ విధంగా వ్యక్తమైంది.

'తెగించు పోరాటంలో
వధించు, పెనుసర్పం'

ఇక్కడ కర్తవ్య నిర్దేశం, విప్లవానికి ఒదిగిపోయిన కవితా హృదయం కన్పిస్తుంది.

విప్లవ కవులు చందమామను సామగ్రిగా స్వీకరించి కవితలు రాయడానికి జంకుతారు కాని శివసాగర్ 'చందమామ'ను కార్మికునికి ప్రతీకగా నిలబెట్టి భవిష్యత్తులో కార్మికుని సుఖమయ జీవితంలోకి తొంగిచూశాడు.

'ఫ్యాక్టరీలో చందమామ
మర చక్రం తిప్పును'

అలాగే రైతు జీవితాన్ని కూడా దర్శిస్తాడు శివసాగర్.

'సూర్యుని అరచేత పట్టి
రైతు దుక్కి దున్నును'

రేపటి 'రాజు'గా శివసాగర్ కార్మికుడికి పట్టం కట్టాడు.

'మహితాత్ముడు కార్మికుడే
నక్షత్ర కిరీటధారి'

ఈ విప్లవాల యుగంలో భారతదేశం కూడా విప్లవిస్తోందని శివసాగర్ ఇలా అంటాడు.

'రుతుగతికి పులకించి
గంగ కూడా వొంగెను'

'మార్క్సిజం' మిగిలిన తాత్విక ధోరణుల మాదిరిగా ఆచరణ లోపించింది కాదు. దీనికి ఆచరణ గీటురాయి – ఆ గీటురాయి వెలిగించిన గీతాలు శివసాగర్‌వి. అందుకే ఇలా అన్నాడు.

'మార్క్సిజం టార్చిలోన
సెల్స్‌మాట మరువకు'

మార్క్సిజాన్ని ఆచరణలో పెట్టడమే 'ఏటికి ఎదురీదువాళ్ళమురా' అని చెప్పడం.

ఒక సంఘటనను కవితా మయం చేయటంలో శివసాగర్ వాస్తవిక దృష్టికి చెరబండ రాజుపై రాసిన గేయ భాగం నిదర్శనం. చెరబండరాజు మెదడు రోగంతో చనిపోయిన సంఘటనను శివసాగర్ ఈ విధంగా రాశాడు.

అంపశయ్యపై మేనువాల్చి
తన కపాలంలోని రక్తంలో
కంకాళాన్ని ముంచి
జన హృదయంపై
చెరబండరాజు
రాస్తున్న
చరమగీత సౌందర్యాన్ని
నా మునివేళ్ళతో తాకాలని
వృథా ప్రయత్నం చేస్తున్నాను'

చెరబండ రాజు విప్లవ స్పృహ మీద శివసాగర్‌కి వున్న గౌరవం అపారం. అదే తోటి విప్లవకారుల్లో జ్వలనాగ్ని సదృశ్యంగా వైష్ణవగీతాన్ని సృష్టించేది. పై గేయంలో ఆసుపత్రి 'అంపశయ్య'గా, చెర అనారోగ్యానికి కారణమైన 'పోరాటపాట'ను కపాలంలోని రక్తంలో ముంచిన కంకాళంగా'ను శివసాగర్ ప్రతీకరించాడు.

ఈ విధంగా శివసాగర్ విప్లవ భావుకత ఎక్కువగా వుంది. ఈ ప్రతీకలు విప్లవ కవితా ప్రయోజనాల్ని సాధించాయి.

అంచేతనే చేకూరి రామారావుగారు శివసాగర్ గూర్చి ఇలా అన్నారు.

"విప్లవ సాహిత్యంలోనే కాదు మొత్తం తెలుగు సాహిత్యంలో కూడా శ్రీశ్రీ తర్వాత గుర్తించ దగిన బహుముఖ ప్రతిభావంతుడు శివసాగర్". ఇది నూటికి నూరుపాళ్లు నిజం.

☞

# కవితలు

## కవితత్వం



**ఖాదర్‌షరీఫ్**

ప్రతి మనిషికి ఒక జీవితం ఉంది
దాని చుట్టూరా వలయాకారంగా
చుట్టుకున్న ఉన్న కవిత్వం ఉంది
బొటనవేలూ చూపుడు వేలూ
ఎవరి చేతిలో బాగా సహకరిస్తుందో
ఎవడయితే కలాన్ని తన చేతితో
కదలనివ్వకుండా బిగించగలడో
వాడు కవిత్వం రాస్తాడు
నేను రాత్రి ఆలోచనల
సాగర మథనంలో ఉంటాను
జీవించమని ప్రభోదించే కవిత్వం
నా ముందు వెల్తురు నిస్తూ ఉంది
ఆలోచనా మథనం జరిగినప్పుడల్లా
ఆవేశం ఆనకట్టలు తెంచుకున్నప్పుడల్లా
అక్షరం కవిత్వంలా రూపాంతరం
చెందుతుంది.
జీవితం ఒక గొప్ప ఎడారి..
అంతా ఇసక

కవిత్వానికి మల్లే అన్నీ అక్షరాలే
జీవితం ఒక గొప్ప ఎడారి... అంతా ఇసుక
నదయినా సముద్రమయినా అంతా ఒక్కటే...
ఇసకే కదా రెండింటి తీరము
రెండూ ప్రేమికుల పాన్పే కదా
సముద్రం లేదా నదికేసి తీక్షణంగా చూడు
నింగికెగసి నీటిలో పడుతున్న అలను నేను
తీరానికి నురగలా వచ్చిన నిన్నటి కలను నేను
నా ముందున్న సముద్రం ప్రతి ఉదయం
సూర్యుణ్ణి వాంతి చేస్కుంటుంది
బహుశా అది ప్రసవ వేదన
కూడా కావచ్చునేమో

కొంతమంది జీవించరు
జీవిస్తున్నామనే పేరుతో మాత్రమే ఉంటారు
జీవితానికున్న నిర్వచనం మొగ్గను నలిపి
చిక్కటి భావం సువాసనని చక్కగా పీల్చడం
జీవితంలో కవిత్వాన్ని
కత్తిరించిపెట్టడం కాదు
జీవితం మీద కోపమెందుకు
బ్రతకునేర్చిన తనంతో రాజీపడ్డం ఎందుకు
బ్రతుకు సంకలనానికి
మనం కేవలం ముందుమాటలయే
ప్రకటించిన సువార్తను విన్నట్టు విని
"యూదా"లా మారటం ఎందుకు
కవిత్వం నీ మీద కృప చూపిస్తుంది ఇంకా
రా... ....
తిమిరం నుంచి బయటికొచ్చి
జీవితాన్ని అనుభవించు.

## కవీంద్రుడు

**హిందీ మూలం : డా॥ ఘనశ్యామ్ శర్మా**

**తెలుగు అనువాదం : డా॥ విప్లవ్ దత్ శుక్లా**

నాగేటి సాల్లల
నాగలితో నడవాలని
రైతు
అక్షరాల వరుసల్లో
కలమై కదలాలని
కవి
మట్టి వివేకం
తెలిసినా
అమోమయ స్థితిలోని
రైతుకు
ఆశల ఆకాశం
కూలుతుందనే భయం
అందుకే
గట్టుమీద నిలబడి
ఆకాశాన్ని అర్థిస్తూ...

ఇటు కవీంద్రుడు
కొత్తగా కొన్న
ఆకాశ హర్మ్యంతో
ఇరువై నాలుగు గంటల పాటు
నిరంతర జల విద్యుత్తులలో
సౌఖ్యంగా ఉంటూ....
కవికి నౌకరుగా
ఓ "పాత" రైతు-

బంజరైన వ్యవసాయాన్ని
శిథిలమైన పల్లె సంగతుల్ని విన్నవిస్తూ-
వింటున్న కవి
కవితల్ని అల్లేస్తూ-
పుస్తకాలుగా మార్చేస్తూ-
అవార్డులు అందు "కొంటూ" -
కవి కవిత్వం
దేశ పరిస్థితికి అద్దం-
అదే ప్రభుత్వ దస్తావేజుగా సిద్ధం-
రైతుకు చేస్తున్న
ఉపకారమని "అంతరార్థం" -
ప్రభుత్వానిది శునకానందం!
ఆలోచిస్తే......
కవి సౌభాగ్యమా!!
లేదా
ఈ దేశ - రైతు దౌర్భాగ్యమా?

### పోలవరపు కోటేశ్వరావు మృతి



ప్రముఖ సాహితీవేత్త, రచయిత, పోలవరపు కోటేశ్వరరావు (79) విజయవాడలో ఆదివారం (2.3.08) నాడు మృతి చెందారు. ఆయన కొద్ది కాలంగా ఉపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన కృష్ణాజిల్లా దివిసీమలోని శ్రీకాకుళం శివారు వీరమాచినేనివారిపాలెంలో 1929 జూలై 26న జన్మించారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో గోడలపై రాతలతో ప్రారంభించిన జాతీయోద్యమ స్ఫూర్తిని ఆయన కడవరకు కొనసాగించారు. విద్యార్థి దశలోనే ఆయనలో సాహితీ భావనలకు అంకురార్పణ జరిగింది. ఆయన 100కు పైగా పుస్తకాలు రాశారు. కథ, కథానిక, నాటిక, నాటకం, యుక్షగానం, బుర్రకథ, నృత్యం, తదితర ప్రక్రియల్లో రచనలు చేశారు. ఆయన రాసిన కృష్ణా తరంగాలు, కాకుళయ్య కథలు, మా ఊరి మనుషులు, లచ్చుమయ్య కథలు, నాటి గాథలు-నేటి కథలు, రెడ్డిరాజుల ప్రాభవం-శ్రీనాథుని వైభవం, మనము-మన నృత్య రీతులు వంటివి ప్రాచుర్యం పొందాయి. సంగీత నృత్య సాహిత్య రంగాలలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన పోలవరపు కోటేశ్వర రావు కృషి ఆదర్శనీయం. అంతేగాక రంగస్థల కళాకారులను ప్రోత్సహించారు. విజయవాడ అర్డర్ ఆర్ట్స్ ఆకాడమీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

నివేదిక

# జంట నగరాలను జల్లెడ పట్టిన కవులు

**దినకర్**



గ్రేటర్ హైదరాబాద్‌గా అవతారం ఎత్తిన జంటనగరాలలో సామాన్యుడి జీవన చిత్రాన్ని ఆవిష్కరించాలనే తలంపుతో సాహితీ స్రవంతి హైదరాబాద్ మార్చి 15న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవి సమ్మేళనం నిర్వహించింది. హైటెక్ సిటీలు, పబ్బులు, క్లబ్‌లు, హైపర్ మార్కెట్‌లు, అంతర్జాతీయ విమానాశ్రయాలు, విశాలమైన రోడ్లు, హైమాస్ట్ వెలుగులు, నెక్లెస్‌రోడ్‌లు, డిజెల మ్యాజిక్‌లను చూపించి ఇదే అభివృద్ధి అంటున్నారు పాలకులు. ఆ వెలుగుజిలుగుల నీడల్లో అణగారిపోతున్న సామాన్యుల బాధల గాథలను ఈ సమ్మేళనంలో పాల్గొన్న కవులందరూ బలంగా వినిపించారు.

'గ్రేటర్ మఱ్రి' శీర్షికన తన కవితలో వూసల రజనీ గంగాధర్ ఏమంటున్నాడో చూడండి.

"అవును – ఈ మహావృక్షం గ్రేటర్ మఱ్రి./మరే మొక్కను మొలవనీయకుండా,/ ఈ వటవృక్షం నీడలో బడుగుజీవులు – క్రీనీడలో టక్కరి నక్కలు/రాత్రి పగలు – కాకులు, గ్రద్దలు, గబ్బిలాలు, రాబందులు/ విషాన్ని జిమ్మే కాలసర్పాలకు – ఇది ఆశ్రయం/దూరపు కొండలు నునుపు" –/ 'బడుగుజీవులకు – అడుగునేల లేదు' అంటూ సామాన్యుడి బ్రతుకు ఘోషను ఈ నగర నేర సంస్కృతిని కళ్ళకు కట్టించారు.

'హల్లో – హైదరాబాద్'అంటు నగరాన్ని పలకరించిన ఆశ్లేష జి.సుబ్బారావు నగర జీవనం డొల్లతనాన్ని ఎండగట్టాడు. నగరంలో మధ్యతరగతి తన శక్తికి మించి హైక్లాస్ జీవితాన్ని గడపడానికి ప్రయత్నించి ప్రతిరోజు భంగపడటాన్ని ఆయన వర్ణించారు.

"డబ్బులు పోయినా సరే/ఐమాక్స్ థియేటర్‌లోనే సినిమాచూడాల్సిందే,/అప్పుల పాలయినా సరే!/అపోలో ఆసుపత్రిలోనే వైద్యం చేసుకోవాల్సిందే!..../ఇందిరమ్మ ఇల్లుకే దిక్కులేదు గానీ/ఇండిపెండెంటు ఇల్లు కావాలంటే ఎలా స్వామి;/భూమి కొంటె వెంటనే ఇల్లు కట్టు!/లేకుంటే భూ కబ్జా తప్పదు! ఇది వొట్టు"/అంటూ నగరంలో సామాన్యుడి గొణుగుడు వినిపించాడు.

'(అ)భాగ్యనగరం'లో బ్రతుకును శ్రీమతి సోమంచి ఉషారాణి గారు ఎలా చూపించారో చూడండి. "స్థలాల ధరలు నింగిలో, ఇళ్ళ నిర్మాణాలు చుక్కల్లో /అద్దెలు అందనంత ఎత్తులో, ఛిద్రమైన బస్తీ బతుకులు" "దప్పికతో ఎండిన గొంతుకలకు/నీళ్ళు కూడా ఊరికేపోయదు ఈ నగరం/ ఆక్సిజన్‌ను కూడా కొనుక్కోమంటుంది ఉద్యానవనం/ నిలువనీడకోసం జానెడు జాగా ఇవ్వదు/ తిండి ఊసెత్తితే చాలు లాఠీలకు పనిచెబుతుంది/" అని ఈ నగరంపై 'జనాగ్రహాన్ని' వ్యక్తం చేసాడు సత్యభాస్కర్.

"జీవితాన్ని మార్చలేని జీతాలతో/ జీవన్మరణ జీవనం సాగించే జంటలు/... అడ్డామీద కూలీల్లా! అక్షరాస్యుల్ని కూడా నిలిపే/ నగర చౌరస్తాలన్నీ వేదనల రాస్తాలే/ ..... రెండో సిలికాన్ వ్యాలీ కాకున్నా/ రెండో సోమాలియా కానివ్వకండి"అని తంగిరాల చక్రవర్తి తన కవిత "రేపటి నగారా"లో అన్నాడు.

ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలు ఎంత విసిగిపోయారో తన కవిత "ట్రాఫిక్ జాం"లో కవి శ్రీ పెద్దూరి వెంకటదాసుగారు వివరించారు. "కైలాసాన్ని కదిలిస్తా/ పాతాళాన్ని పెకలిస్తా/ ఎవరెస్టు శిఖరాన్ని ఎత్తి పడేస్తా/.. అని అంటూ" "అనుకున్న టైంకు నేను దేన్ని అందుకోలేను, చెప్పిన టైంకు వస్తానని మాటివ్వలేను!" 'నా ఉనికింకా తెలియదా' 'నేను హైదరాబాద్ వాసిని' అని వ్యంగ్యంగా అన్నారు కవి.

సీనియర్ కవి అపరాజిత "నగర జీవితం" ఎంత దుర్భరంగా మారిందో తన కవితలో ఇలా చెప్పారు.

"కరెన్సీ కట్టల చుట్టూ/ కపట ప్రేమల పరిమళాలు/ నగరమో కాంక్రీట్ జంగిల్/ నయా వంచనలూ, నిత్య మోసాలు/ .. పెరుగుతున్న సంకుచితాలు/ అసత్య జీవన యానమే/ నేటి నగర నాగరికతల వైనం. "ప్రముఖ కవి, సాహితీవేత్త యస్వీ కృష్ణ "గ్రేటర్ హైదరాబాద్" గురించి ఏమంటున్నారో చూడండి.

"ట్రాఫిక్ పసిఫిక్‌లో ఈదలేని నగటు జీవి/ దరిద్రం చట్రం దాటని బడుగుజీవి/.. కష్టలూ, కార్పణ్యాలతో రక్తం

వోడే వీధులు/ అన్నమో రామచంద్రా.. అని వినిపించే ఆక్రందనలూ/ ప్రతిచోటా దిగజారే మానవీయతా ప్రమాణం!"

ఈ 'భాగ్యనగరం' గుట్టును విప్పి చెప్పిన ఆలువాల సురేష్

"కళ తప్పిన చార్మినార్/ చుట్టూ జనం చూసి విసుక్కుంటోంది/ మక్కామసీదు ప్రక్కగా/ భయపడుతోంది/ నగరం నడి బొడ్డులో వున్న / బుద్ధుడు ముక్కు మూసుకుంటున్నాడు/ వాసన భరించలేక/.. అని వర్ణిస్తూ " ఉంటావా నేస్తం/ పారిపోతావా..; / నీ ఇష్టం/ నేనయితే నిజం చెబుతున్నా అని అంటాడు.

'గ్రేటర్ హైదరాబాద్' కవితలో కవయిత్రి శ్రీమతి రాధికా గణేశ్ ఇలా అంటున్నారు. 'అభాగ్యుల ఆశాసౌధాలు కూల్చే/ భూకబ్జాలు, తగాదాలు/ నీరు దొరకని గాలి ఆడని/ మురికి వాడల దీనగాథలు/..' అని వర్ణించారు.

"రాచపుండు మత రాజకీయాల పట్టులో/ రాజకీయ మాఫియాల పాలనలో/ అసలైన ప్రజాస్వామ్యం ఎక్కడ;/ సామాన్యుల ధన మాన ప్రాణాలకు రక్షణెక్కడ!" అని ప్రశ్నించారు "తళుకు బెళుకుల మహానగర్" కవితలో అరిబండి.

శ్రీమతి ఎం. కళ్యాణి గారు. గ్రేటర్ హైదరాబాద్ పదఘట్టనల క్రింద నలిగిపోతున్న పల్లె జీవితాల పట్ల ఆవేదనను "పల్లెలు దేశానికి వెన్నెముకన్న/ మహాత్ముడి నోటికి తాళం వేసి/ దేశం వెన్నెముక విరిచి తల మాత్రం/ వుంటే చాలనే ఈ అనారోగ్య ఆలోచన/ ఎటు దారితీస్తుందో/" అని తన 'మన మహానగరం' కవితలో వ్యక్తం చేసారు.

చింతాడ కూర్మారావు గారి కవితలోని చమక్కులు అందర్నీ అలరించాయి. మచ్చుకు

'అంగడిలో పాచి ఫుడ్డు/ దాన్ని వేడిచేస్తే ఫాస్టు ఫుడ్డు/ అది అరిగితే వెరీగుడ్డు/ లేకుంటే హాస్పిటల్ బెడ్డు' అని అంటూ ఫాస్ట్ ఫుడ్ సంస్కృతిని గేలిచేసారు.

వీరప్రసాద్ తన "పగిలిన రంగుల చిత్రపటం" కవితలో నగరపు స్వభావాన్ని కవిత్వీకరిస్తూ "పల్లె పునాదులను పెకిలించి వేసే/ మర్రివృక్షం మహానగరం/ నీడనిస్తున్నట్లు నటిస్తుంటుంది/మరుగుజ్జు మనుషులను తయారుచేస్తుంది" అని వ్యక్తీకరిస్తారు.

ఈ విధంగా జంటనగరాలలో సామాన్యులు ఎదుర్కొనే అన్ని సమస్యలను వివిధ కోణాల్లో తమ కవితల్లో వ్యక్తీకరిస్తూ కవులు తెలిపిన నిరసన అందర్నీ ఆలోచింపజేసింది. ఈ సమావేశంలో కవితా పఠనం మధ్య ప్రముఖులు డా॥ ద్వా.నా.శాస్త్రి, తెలకపల్లి రవి, మోత్కూరి నరహరిలు సాహితీ స్రవంతి కృషిని అభినందిస్తూ సందేశాల నిచ్చారు. యాబది మందికి పైగా పాల్గొన్న ఈ కవి సమ్మేళనంలో సహారా, మౌనశ్రీ మల్లిక్, నరేష్, సోమశేఖర్‌ల వంటి యువ కవులతో పాటు జి.యాదగిరిరావు, తంగిరాల సత్యనారాయణ, డా॥ నాగినేని భాస్కర్‌రావు, శ్రీమతి కె.రాజ్యలక్ష్మి, శ్రీమతి ఉమా రామగోపాల్, శ్రీమతి కె.ప్రసన్న లక్ష్మి, ప్రభాత్ కుమార్, మహేందర్, శిల్పా జగదీష్, బి. వెంకట సుబ్బయ్య, కె.విజయనరసింహారావు, పొత్తూరి సుబ్బారావు, గురజాడ అప్పారావు, పి.భాస్కరరావు శ్రీమతి గురజాడ విజయశ్రీ, వీరప్రసాద్, ఎమ్. కృష్ణ మూర్తి, గిన్ని ఆనందరావు, పి. సత్యం, జి.యస్. రామకృష్ణ, పి.వెంకన్న, బొ.పా.ర., పొన్న అంజయ్య, ఎన్. నరసింహా రావు, టి.రాజలింగం, జి.రామ గోపాల్, ఇ.మల్లయ్య, జుగాష్ విలి, డా॥ఘనశ్యామ్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి సత్యభాస్కర్, కన్వీనర్ సాహితీ స్రవంతి హైదరాబాద్ అధ్యక్షత వహించగా, తంగిరాల చక్రవర్తి కవి సమ్మేళనం నిర్వహించారు. జి.యాదగిరి రావు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు కో-కన్వీనర్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.

---

# రిక్తహస్తాలు

## దోర్నాదుల సుబ్బమ్మ



గుండె దుఃఖాన్ని దోచుకోవడానికే పుట్టినట్లు
కలల్ని దోచుకునే బ్రతుకుతాయి కనురెప్పలు
కన్నీళ్ళని దాచుకోవడం భరించలేనపుడు
దేహసముద్రం ప్రవాహ గర్జనకే సిద్ధపడ్తుంది
బతుకులన్నీ యతలే
బాధలన్నీ జీవిత భయానక దృశ్యాలే.
పెదవుల మధ్య నల్గిన పాలిండ్లు సాక్షిగా
పడకగదులన్నీ చెరసాలలే
యుద్ధం – అనివార్యమయిన చోట కూడా
ఆయుధం లేని రిక్తహస్తాలతో నిలబడినప్పుడు
పోగొట్టుకోవాల్సింది జీవితాన్నే...
దుఃఖ తీరం వెంబడి ఎంత నడిచినా సరే...
బాధల చిహ్నాలు ఏరుకోవాల్సింది తప్పించి
ఓదార్చటం చేతనయిన హృదయాలు ఎదురుపడవు.
చిగురించడం మర్చిపోయాక చెట్టుకూడా
ఉనికిని కోల్పోయినట్లు జీవితం కూడా అంతే
స్వేచ్ఛగా ఎగరడానికి
మనిషేం విహంగం కాదుగదా
రెక్కలు మొల్చినాక బంధాల్ని బాంధవ్యాల్ని తెంచుకుని
స్వేచ్ఛగా సముద్ర అలల నుంచి ఆకాశం మీద ఎగరడానికి
మనిషికీ మనిషికీ నడుమ
మమతల వంతెనలు నిర్మించుకుని
దానిమీదే బతుకు బండిని నెట్టుకుంటూ
దారులు మూసుకుపోయిన దైన్యంతో
నిరాశల జెండాని భుజానికెత్తుకుని నడుస్తున్నాం.
గొంతెత్తి జన ప్రవాహంలో కల్సినా
మా గొంతుకల్నే కాదు శబ్దాన్ని కూడా జయించే
పురుష మృగాల గాండ్రింపుల మధ్య అపజయాన్ని
తిరిగి వచ్చి ఉత్తరానికి మల్లే
మళ్ళా స్వీకరించక తప్పలేదు...
చెప్పలేం...
మహిళా దినమని
మగ సూర్యుడు ఉదయించడమే మానేస్తాడేమో

## పరిశీలన

# పుస్తకాలూ - ముందుమాటలు

**సాధారణంగా పెద్దలు అనుభవజ్ఞులే ముందు మాటలు రాస్తారు గనక రచన రచయిత నేపథ్యాన్ని పాఠకులకు పరిచయం చేయడం వల్ల పుస్తకం పట్ల ఆదరణ పెరుగుతుంది. శ్రీశ్రీ లఘు టిప్పణి, దాశరథి కవి హృదయం లేకపోతే ఆరుద్ర త్వమేవాహం మరీ దుర్గ్రాహ్యమై వుండేది.**



**తెలకపల్లి రవి**

**ముందుమాటలు అవసరమా?**

కొన్ని రకాల ముందుమాటలు మనకు దండగమారివిగా కనిపించవచ్చు గాని అంతమాత్రాన ఆ పద్ధతినే తప్పు పట్టడం పురిటి నీళ్లతో పాటు బిడ్డను కూడా పారేసుకోవడమే అవుతుంది. రచనా ప్రక్రియలో ముందుమాటలకు ఒక స్థానం వుంది.

**వాటి ప్రయోజనం ఏమిటి?**

రచయిత కొత్తవారైతే పరిచయం చేయ దానికి, లేక పుస్తకంలోని విషయాన్ని ఆవిష్కరించడానికి అవసరమవుతాయి. కొత్త రచయిత లేదా కొత్త అంశం ప్రాథమికంగా ఆమోద యోగ్యత సంతరించుకోవడానికి బాగా ఉపయోగ పడతాయి. ముందు మాటలు రాసిన వారి పేర్లు కూడా ప్రచారానికి ఉపయోగ పడతాయి. ఎకనామిక్ హిట్‌మ్యాన్ రాసిన రచయిత జాన్ పెర్కిన్స్ తర్వాత 'ఏ గేమ్ యాజ్ ఓల్డ్ యాజ్ ఎంపైర్'కు ముందుమాట రాస్తే దాన్ని అట్టమీద ప్రకటించారు. అల్కెమిస్ట్‌తో ప్రసిద్ధుడైన పాల్ కోయిలో సన్యాసి కథకు ముందుమాట రాస్తే దాన్నీ అట్టమీద వేశారు.

**ఇప్పుడు ముందుమాటలు ఎలా వుంటున్నాయి?**

ఎక్కువ భాగం పేలవంగా వుంటున్నాయి. ఏ కొద్ది మంది సీనియర్లనో మినహాయిస్తే ఎక్కువ మంది పొగడ్తలతో సరిపెడుతున్నారు. శ్రుతిమించిన వ్యక్తిగత విషయాలతో నిండి వుంటున్నాయి. సాహిత్యం ఒక పీఆర్ వ్యవహారంగా మారిపోయి ఒక చిన్న పుస్తకానికి అరడజను ముందుమాటలు (ఫోటోలతో సహా) వుంటున్న సందర్భాలున్నాయి. ఔత్సాహికులను ప్రోత్సహించే పేరిట కొందరు పెద్దలే వెతికి వెతికి నాలుగు ముక్కలు పట్టుకుని గొప్పగా చిత్రించడం చూస్తున్నాం. నాలుగు మంచి మాటలు రాస్తే పోయే దానికి అసందర్భమైన పోలికలతో అతిశయోక్తి పొగడ్తలతో వెగటు పుట్టిస్తున్నారు. ఈ కారణంగానే పెద్దవారి స్టాంపు వేయించుకోవడం కోసం ఎడతెగని నిరీక్షణలో కొందరు రచయితలు కవులు నెలల తరబడి పుస్తక ప్రచురణ ఆపుకోవలసి వచ్చిన ఉదాహరణలు కూడా వున్నాయి. అలాగే అడగడమే తరువాయి బాధ్యతగా భావించి ఎవరినైనా ప్రోత్సహించే పెద్దలూ వున్నారు. పేర్లు ఉదహరించదలచలేదు గాని ముందు మాటలు రాసేవారికి, రాయించుకునే వారికి కూడా కొన్ని ప్రమాణాలుండాలి. అతి ప్రసిద్ధుడైన ఒక రచయిత అతి అమాయకుడైన ఒక చిన్న కుర్ర వ్యాపారి రాసిన పదిహేను పాటలకు ముందు మాట రాసి అచ్చు వేసుకోమని పంపించిన విపరీతమైన ఉదాహరణ కూడా నాకు తెలుసు. నిజానికి ఆయన సంతకం తప్ప అక్కడ రాసిందేమీ లేదు. మరీ ముఖ్యంగా చిన్న పట్టణాలు మండల కేంద్రాలలోనైతే అసలు రచనే అపరిపక్వంగా వుంటే అంతకంటే అపరిపక్వ మైన అభినందన సందేశాలతో నింపేయడం జరుగుతుంటుంది. దాతలు అత్యంత గౌరవనీయులే గాని వారి సకుటుంబ చిత్రాలు, కథనాలు అవసరమా? ఇలాటి వాటిని సరి చేసేందుకు సాహితీ మిత్రులు పెద్దలు తగు సూచనలు చేయవలసి వుంటుంది. ఎందుకంటే ఇవన్నీ రచనా ప్రక్రియ స్థాయి తగ్గించే ధోరణులే.

**ముందుమాటలు పుస్తకానికి ఏమేరకు తోడ్పడతాయి?**

సాధారణంగా పెద్దలు అనుభవజ్ఞులే ముందు మాటలు రాస్తారు గనక రచన రచయిత నేపథ్యాన్ని పాఠకులకు పరిచయం చేయడం వల్ల పుస్తకం పట్ల ఆదరణ పెరుగుతుంది. శ్రీశ్రీ లఘు టిప్పణి, దాశరథి కవి హృదయం లేకపోతే ఆరుద్ర త్వమేవాహం మరీ దుర్గ్రాహ్యమై వుండేది. అలాగే అంపశయ్య నవీన్ కథా సంపుటానికి చలసాని ప్రసాదరావు చైతన్య స్రవంతి శిల్పం గురించి రాసిన ముందు మాట కూడా. (గజ్జెల) మల్లారెడ్డి గేయాలు పుస్తకానికి శ్రీశ్రీ రాసిన ముందుమాట ఆ సరికొత్త వికట కవిత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియజేసింది. రంగనాయకమ్మ రచయిత్రికి నార్ల రాసిన పరిచయం వంటిది ఆ నవలనే కాక నవలా ప్రక్రియకు విశ్లేషణ ఇచ్చింది. నామ్ చామ్‌స్కీ, హెర్మన్‌ల రచన అనువాదం మీడియా మాయాజాలం అనువదిస్తూ నేను భారతీయ మీడియా దృశ్యం గురించి ముందు మాటలో రాసి జతచేశాను. ఇదో పద్ధతి.

ఇంతకు ముందు చెప్పినట్టు కొత్త రచయితలకు, కొత్త విషయాలకు ప్రక్రియలకు ముందుమాటలు అవసర మవుతుంటాయి. రచయిత స్థిరపడిన తర్వాత అంతగా వుండదు. ఉదాహరణకు ఆరుద్రనే మళ్లీ తీసుకుంటే ఆయన సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాల తొలి ముద్రణలో ఒకోదానికి ఒక ప్రముఖుడితో ముందుమాట రాయించారు. తర్వాత దాన్ని ప్రజాశక్తి బుక్ హౌస్ రెండవ ముద్రణ వేసేప్పుడు వారందరి పేర్ల జాబితా ఇచ్చి సరిపెట్టారు. ప్రసిద్ధమైన చలం యోగ్యతా పత్రాన్ని శ్రీశ్రీ మహాప్రస్థానం లండన్‌నుంచి వెలువడిన తన చేతి రాత ముద్రణలో తీసేశారు. పైగా చలం దాన్ని రాయడానికి వెనక కథను కూడా వెల్లడించారు. చెప్పాలంటే ఇలాటివి చాలా వున్నాయి. రంగనాయకమ్మ తన పుస్తకాలను తనే పునరంచనా వేసుకుని కొత్త పీఠికలు జత చేశారు. నా వరకు నేను చిన్నవీ పెద్దవీ, స్వంత రచనలూ అనువాదాలూ కలిపి యాభై పుస్తకాల వరకూ ప్రచురించి వుంటాను. ఇందులో ముందు మాటలు రాయించు కున్నవి చాలా తక్కువ. మౌలికంగా చరిత్రకారుణ్ని కాదు గనక నా వెయ్యేళ్ల చరిత్ర పుస్తకానికి చరిత్ర ప్రొఫెసర్ అట్లూరి

మురళితో ముందుమాట రాయించుకున్నాను.

**మీకు నచ్చిన కొన్ని ముందుమాటలు!**

ఇందులో చాలా వాటిని పైనే పేర్కొన్నాను. ముఖ్యంగా అందరూ చెప్పే యోగ్యతా పత్రం సరే సరి.. కాళీపట్నం కథలకు రావిశాస్త్రి ముందుమాట కూడా బాగా గుర్తుండి పోయింది. నా తొలి కథా సంపుటి అభద్రకు కేతు విశ్వనాథరెడ్డి రాసిన ముందుమాట నాకు చాలా నచ్చడమే కాదు, నా కథలను నేను అర్థం చేసుకోవడానికి దోహదపడింది. కాస్ట్రో జీవిత కథలకు మార్క్వెజ్ రాసిన ముందుమాటలు, నార్మన్ బెతూన్ రక్తాశ్రువులు పుస్తకానికి ముందుమాటలా ప్రచురించిన మావో వాక్యాలు, కాళోజీ నా గొడవ సంపుటాల్లో ఒకదానికి సుప్రసన్న రాసిన ముందుమాటలు కూడా చిన్నప్పుడు చదివింది అలాగే గుర్తుండి పోయింది. శ్రీశ్రీ, కొకు, వంటివారు కొన్ని గొప్ప ముందుమాటలు రాశారు. మహా సంకల్పం కవితా సంకలానికి సంపాదకుల్లో ఒకరైన నండూరి రామమోహనరావు రాసిన ముందుమాట తెలుగు కవిత్వంపై విశ్లేషణకు ఒక గీటురాయిగా వుంటుంది. ఇలా నిరంతరం గుర్తుండి పోయిన ముందుమాటలు చాలా వున్నాయి.

**ముందుమాటలు ఎలా ఉండాలి?**

రచనకు రచయితకు న్యాయం చేస్తూ సందర్భశుద్ధితో మరీ దీర్ఘం కాకుండా పాఠకుల పరిధిని పెంచి పుస్తకంలోని విషయానికి మరింత విలువ పెంచేదిగా వుండాలి. సొంత ఘనతలు, కొరతలు చెప్పుకోవడానికి లేదా అర్థ రహితమైన ప్రశంసలకు తావుండకూడదు. రాగద్వేషాలకు అతీతంగా వుండాలి. మరెవరి మీదనో దండెత్తడానికి అది వేదిక కాకూడదు. బాపురెడ్డి గేయ సంపుటానికి ముందుమాటలో బోయి భీమన్న ఘంటసాల పుట్టి సంగీతాన్ని శ్రీశ్రీ పుట్టి సాహిత్యాన్ని నాశనం చేశారని రాశారు! చివరి దశలో దాన్ని సవరించుకుంటున్నా నంటూ శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదు అని మరో పుస్తకం వదిలారు.

**ముందుమాటలు నిర్మొహమాటంగా వుంటున్నాయా?**

ఒక పుస్తకానికి ముందుమాట రాసేందుకు ఒప్పుకోవడం అంటేనే సానుకూలత. నిజంగా నిశిత విమర్శలు చేయదలచు కుంటే తర్వాత అందుకు నిరాకరించి తర్వాత సమీక్షలు రాసుకోవచ్చు. అంతేగాని అసలు ముందు మాటలు రాసేందుకు ఒప్పుకోవడంలోనే ఒక విధమైన మొహమాటం వుంటుంది. నా వరకు నేను చాలా చాలా తక్కువగానే ఆ పని చేస్తుంటాను. అంటే ఏదో మొహమాటం లేదా అనివార్యత లేదా అభిమానం ప్రభావం వుండకుండా పోదు. ఒక పుస్తకం ముందుమాట నిర్మొహమాట వ్యాఖ్యలకు సరైన సందర్భం కాదు. ఆ మాటకొస్తే పుస్తకావిష్కరణ సభల్లో కూడా అదే పనిగా దాన్ని తూర్పార పట్టడం నాకు అనుచితంగా కన్పిస్తుంది. అలా అనుకుంటే అసలు ఆ సభకే రాకుండా వుండొచ్చు. రచనను రచయితను గురించి నాలుగు మంచి మాటలు చెప్పడానికే ఇవి.

**స్వంతంగా రాసుకుంటే?**

రచయిత పాఠకులకు పరిచయం అయ్యాక నిక్షేపంగా రాసుకోవచ్చు. అయితే అది నమ్రతగా వుండాలి. తన మార్గాన్ని తాను క్లుప్తంగా చెప్పుకోవచ్చు. ఆత్మస్తుతి అపహాస్యానికే దారి తీస్తుంది. దురదృష్ట వశాత్తూ చాలా మంది రచయితల్లో ఈ లౌక్యం కనిపిస్తుంది.... ఒక విపరీతమైన ఉదాహరణ చెప్పాలంటే బాగా పేరున్న ఒక వచన కవి తన పుస్తకాలకు తానే మారుపేరుతో ముందుమాట రాసుకుని ఆకాశాని కెత్తుకున్న కథ వుంది.ఆయనకు ఇప్పుడు వయసై పోయింది గనక వదిలేయ డమే మంచిది...

**('సూర్య' పత్రిక ప్రశ్నలకు సమాధానాలు సంపూర్ణంగా)**

---



# చివరి గీతం

## బెల్లం ప్రభాకర్

అన్నయ్య
మనకు ఆస్తుల్లేవు
అంతస్తుల్లేవు
మనకున్నది దళిత వాడలో
మనం చెప్పుకున్న మంచి కబుర్లు
నవ్వుకున్న సందర్భాలను
హఠాత్తుగా ఎలా తీసుకెళ్ళావో
అర్థం కాని సందర్భంగా వుంది
అన్నయ్య
ఈ సృష్టిలో మరణం పిచ్చోడిచేతిలో
రాయిలాంటిది
ఎంతటి నియంతనైనా
ఎప్పుడొకసారి అదుపు ఆజ్ఞలలో
వుంచవచ్చునేమో కాని
ఎవర్ని వదిలిపెట్టని
మరణమనే మహమ్మారికి
అర్థాంతరంగా ఎలా చిక్కావు?

ముఖానికి మాస్కులు ధరించిన
మనుషుల మధ్య మనుగడ చేయలేక
మౌనంగా వెళ్లిపోయావా?

అనుమానాలు, అపనమ్మకాలతో
మానవ సంబంధాలను నెరపలేక
ఈ భూమ్మీద నుంచి
కనుమరుగు అయ్యావా?
చెప్పు అన్నయ్య!
ఈ ప్రపంచ నాటక రంగంలో
ప్రతి రోజూ నటించలేక
చెప్పకుండా నిష్క్రమించావా?

తారుమారు చేసేసిన
గెలుపుకోసం ఆడే సయ్యాటనచ్చక
జీవితపు ప్రయాణాన్ని
మరోచోటికి తరలించినావా?
ఏమైనా
ఏ కారణం చేతనో పుట్టి
జనన మరణాలు
మానవాళికి
సుఖ దుఃఖాలను పంచుతున్నాయి
అర్థం కాని అకాల మరణానికి
ఇక్కడ ఏ కొలబద్దలు లేవు
దానిలో రాజీ పడ్డ
అరమరికల్లేని మన రక్తస్వేద బంధానికి
మరణం చివరి గీతం కాబోదు.

**(హఠాత్తుగా ఈ లోకాన్ని వీడిన మా అన్నయ్య కొరకు)**

# కవితలు



## శపించకు ఆయేషా!

**డా॥ దిలావర్**

నా బిడ్డా! ఆయేషా!
పేగుబంధం విలువ తెలియని
నా కొడుకులు పుట్టి
ఈ లోకానికి అమ్మలు లేకుండా చేస్తున్న
కీచక పర్వం – నేటి సందర్భం
బాత్‌రూంలో నగ్నంగా పడి వున్నది
నీ మృతదేహం కాదమ్మా!
నడి బజారులో గుడ్డలు విప్పుకొని
సిగ్గులేకుండా నుంచున్నది
మా జీవచ్ఛవాలే
మిన్నాగులు తిరిగే మొగలి పొదల్ని,
కామరోగులకు ఎక్కించేందుకు
ఆదరక్తాన్ని సరఫరా చేసే
బ్లడ్ బ్యాంకుల్ని
పవిత్ర గురుకులాలని భ్రమించి
హాస్టళ్ళ నోట్లో తలదూర్చడం
ప్రమాదం కాదా?
ఏ జెండాల రంగుల హంగులూ లేకుండా
కేవలం మనిషితనాన్ని మాత్రమే
నమ్ముకున్నందుకు
ఆనవాళ్ళ రంగూ, రుచీ, వాసనా తెలియకుండా
తెల్లగుడ్డ కప్పేశారు.
న్యాయ దేవతను మరోసారి
చావగొట్టి, కళ్ళు మూసేశారు.
మొన్న ప్రసన్న లక్ష్మి, నిన్న శ్రీలక్ష్మి
ఇవ్వాళ నీవంతు....
ఇంకా ఇంకా ఎంతమంది
ఈ మృత్యు తోరణంలో
ప్రాణ పత్రాలను గుదిగుచ్చుకోవాల్సి వుందో...
అప్పుడే శపించకు ఆయేషా!
మనిషితనం గొంతులో
పుడిసెడు జీవగంజి పోయడానికి
పుణ్యమూర్తులను ప్రసవించే
అమృత మాతృమూర్తుల కోసం
నా అక్షరాలు దివిటీలై వెదుకుతున్నాయి
ఈ లోకాన్ని అప్పుడే శపించకు ఆయేషా!




## మరో బాల్యాన్ని ఆహ్వానిద్దాం

**కొట్టి రామారావు**

జీవితం క్షీరసాగర మథనం
నిరంతర పోరాటం
మంచీ చెడుల మహాసంగ్రామం!

కాలం వేళ్ళ సందుల్లోంచి
జారిపోతున్న పాదరసం
మనిషి జీవితం!
వెలుగు చీకట్ల సమ్మేళనం!
సద్బుద్ధికీ సంకుచిత భావాలకూ
నిరంతర సంఘర్షణ
దీనినుండే మానవత ఉద్భవించాలి!

కెరటం మన ఆదర్శం కావాలి
ఉవ్వెత్తున ఎగసిపడుతున్నందుకు కాదు
క్రిందపడినా పైకి లేస్తున్నందుకు!
గతమంతా ఘనం కాకపోయినా
మరకలకన్నా మెరుపులే కొల్లలు!

ఎంతలో గడిచిపోయిందీ అరవైయేళ్ళకాలం!
స్నేహానికి షష్టిపూర్తి సంవత్సరంలోనైనా
మనం కలుసుకొనే ఈ శుభదినం
ఎన్నెన్నో జ్ఞాపకాల సుమహారం!

పలకా బలపం, అక్షరాలు దిద్దటం
నేల బెంచీలపై కూర్చోవడం
ఇదే మొదటి తరగతి కార్యక్రమం!
మా రెండో క్లాసు మాష్టారు
నిలువుబొట్టు పెట్టుకుని పండులా వచ్చేవారు
అందర్నీ – బాలురతో సహా
బొట్టు పెట్టుకోమనేవారు,
"రేపు బొట్టు పెట్టుకునిరానివారికి పేడ రాస్తాను"!
అంతే! ఆయన ఆజ్ఞ అమలయ్యేది!
ఇన్నేళ్లు గడిచినా ఆ అలవాటు నాకు పోలేదు
బొట్టు పెట్టుకునే ప్రతిసారీ ప్రతిరోజూ
ఆ మాష్టారే గుర్తొకొస్తూంటారీ నాటికి!
మా హెడ్మాష్టరు నాకు గురువులే కాదు
నాజీవితాన్ని మలుపు తిప్పిన మహా మనిషి
ఉన్నంతలో ఉన్నత చదువుకు మళ్ళించిన ఋషి!
వారి ఋణం తీర్చుకోలేనిది
చంద్రునికో నూలు పోగులా
నా 'బ్రతుకు పుస్తకం' వారికే అంకితం!
విద్యనే కాదు ప్రాణదానమూ చేస్తాడు
ఉపాధ్యాయుడు, పాఠంలో ప్రాణముంది
ఈ కోవకు చెందినవారు ఆనాటి గురువులు!

అరవైయేళ్ల క్రితం కలిసి నడిచిన మనం
జీవన సంధ్యలో తిరిగి కలిసిన ఈ క్షణం
మళ్లీ మళ్లీ రావాలనీ
మన స్కూలు, ఆటస్థలం, దేవాలయం,
మంచినీళ్ళరేవూ మనల్ని పిలుస్తున్నయ్!
ఆత్మీయతారాగాలతో ఆహ్వానిస్తున్నయ్!!
ఈ విశాల సుందర భవనంలో వెలసిన
ఈ ఉన్నత పాఠశాల
నన్ను పులకరింపజేస్తున్నది!
అప్పుడీ చదువు కోసం
చెట్లూ చేమలూ, గట్లూ పుట్టలూ దాటి
ఎండుతూ తడుస్తూ వెళ్ళేవాళ్లం!
ఒకటి రెండూ నోట్స్ పుస్తకాలు
రాసుకోవడానికి కలం, సిరాబుడ్డీ,
తింటానికి సివెండి క్యారేజీలో కాస్త అన్నం
ఇదే మా సరంజామా!
నిక్కర్ చొక్కా ఒక్కటే జత!
అమ్మ రాత్రి ఉతికినవే ప్రొద్దుట వేసుకోవడం
చెప్పుల్లేని కాళ్లకు ముళ్లు
గుచ్చుకున్న రోజులెన్నో!
ఈ ఉన్నత పాఠశాలా ప్రాంగణంలో
క్రొత్తతరం గురువుల పాఠాలు విని
మీ తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చండి!

ప్రియ మిత్రులారా!
మనం మళ్లీ మళ్లీ కలుద్దాం
వయస్సు శరీరానికే, మనస్సుకు కాదు
పరస్పరాభినందనల పరిమళాల
ప్రాణ వాయువు నింపుకుని
మరో బాల్యాన్ని ఆహ్వానిద్దాం!

**(ఆకాశవాణి, విజయవాడ వారి సౌజన్యంతో)**

కథ

# బరువు బతుకులు



**"డయివోరు గొరూ!... ఆపండాపండి!... అల్లా మా బొట్టి పారొత్తంది!...ఒక్క సిటం ఆపండి!" ఆపండి బావ్!"**

**పార్వతమ్మ గట్టిగా కేకేసినట్టుగా అంది. గేరును కదిపి బస్సు తీయబోయిన డ్రైవరు ఆ ప్రయత్నాన్ని కాస్త మానుకుని... ఒంగి కిటికిలోనుంచి బయటకు చూశాడు.**

## పాలకొల్లు రామలింగస్వామి

**దూ**రంగా.. నెత్తిమీద మూడు మానిల కూరగాయల బరువుతో... చీకటి తెరల మధ్య పరుగులాంటి నడకతో రమణమ్మ!

"మీరంతా.. ఊరుకు ముందొచ్చి బస్సెక్కిస్తే...ఈ అమ్మేటింత లేటు...!? మసాబుగా ఉందని తొంగుండిపోయింది గావల!"

ఆమె వైపు చూస్తూ అన్నాడు డ్రైవరు అసహనంగా!

"అలాగనకండి బావ్!... ఒక్కోపాలి అంతే!... ఎవులికయినా ఆలస్యమవుతాది!" డ్రైవరు సమీపంలో కూర్చుని ఉన్న సోముల జవాబిస్తున్నట్టుగా అన్నాడు.

రొప్పుతూ బస్సు చేరుకుంది రమణమ్మ. బాగా చేసి మానిలను ఒకదాని తర్వాత ఒకటి జాగ్రత్తగా బస్సులోపల పెట్టాడు సోములు. ఒంటికి పట్టిన చెమటను చీరచెంగుతో తుడుచుకుంటూ బస్సెక్కి పార్వతమ్మ ప్రక్కన కూర్చుంది. బస్సు బయల్దేరింది.

"ఔన్ రవణా!... నానుగాని సూడపోతే... కసింతలో బస్సు తప్పిపోదువు... బారెడు పొద్దెక్కినంతవరకూ... ఇంటికాడ ఏటి సెత్తన్నావే సెప్మీ!"

కొంచెం కసిరినట్టుగానే రమణమ్మను అడిగింది పార్వతమ్మ.

"ఏటి సెప్పమంతవ్ పిన్నీ!... అదేటి సంకటమోగానీ... తిన్నదరగడం లేదు... రేతిరి రెండు వొంతులయ్యాయి... అరగనేదు... ఆ తర్వాత సేన్సేపు నిద్దరపట్టనేదు.. ఏదో ఇలాగ రెప్పపడీ... కేవొచ్చి.. సూస్సెరికి తెల్లగయిపోయింది. ఎంతేలపోయిందిరా బగమంతుడా అనుకుని గబీల్న పారొచ్చేసరికి... ఇదిగో ఇంతటమయింది!" నిట్టూరుస్తూ తన బాధనంతా వెళగక్కింది రమణమ్మ.

"ఓసి!.. అంతోటి జరిగిందా!.. నన్నోపాలి నేపలేకపోయావా.!?... వద్దునుగదా!" సానుభూతిగా అంది రమణమ్మ. ఆమె ఇల్లు రమణమ్మ ఇంటిదగ్గరే! "నేదు పిన్ని!.. మీరంతా గందిక పడతారని నానే అమ్మను లేపొద్దన్నాను!" అంది రమణమ్మ. "అమ్మ తల్లికి.. అంగట్లోన గటాలుపేర్సినట్టుగ.. తట్టలన్ని వరసగా పేర్చిస్తే... టిక్కెట్లెలా కొట్టాలి.!? ... తియ్యండి... తియ్యండి!"

వెనుక నుంచి టిక్కెట్లిచ్చుకుంటూ వస్తోన్న కండక్టరు ఎవరిమీదనో ఎగిరిపోతున్నాడు. “అలాగేని బావ్!... కోప్మమయిపోకు!... ఆమ్మీ!... ఆట్నీ కసింత వొసలించి దారొదిలిమీ” మాటలలోనే కాదు... కూరాకుల కులానికి కూడా పెద్దరికం వహిస్తోన్న సోములు శాంతంగా అన్నాడు.

బస్సులో జనం కన్న... లగేజియే ఎక్కువుగా ఉంది. కూర్చునే సీట్లపైన.. క్రిందన...పైన.. ఆఖరుకి కూర్చున్న వారి ఒడుల్లో సైతం.. మానిలతో తాజాగా ఉన్న కూరగాయలు... వాటన్నింటినీ పార్వతీపురం తీసుకువెళ్లి టోకుగా అమ్ముకోవడం.. వారి దినచర్యలో మొట్టమొదట చేసేపని!

పోయినేడాది గరుగుబిల్లిలోని కూరాకల్లందరూ... మూకుమ్మడిగా మినిస్టర్ అయిన కొత్తల్లో మేరంగి రాజుగార్ని కలసేరు. తమ వృత్తి ద్వార పండించే కూరగాయలను టౌనుకు తీసుకువెళ్లి అమ్ముకోవడానికి గాను... ఉదయాన్నే తమకొక బస్సు ట్రిప్పు వేయాలని... తమగోసనంతా చెప్పుకున్నారు. రాజుగారూ వరమిచ్చారు. వారి ఆశనెరవేరింది.



అప్పట్నుంచి గరుగుబిల్లికి ప్రతిరోజూ రాత్రివెళ్ళే ‘నైట్‌హాల్ట్’ బస్సుకాస్త... కోడికూసే జాముకి బయల్దేరే ‘కూరాకల్ల’ బస్సయ్యింది. బస్సు గొట్టివలస దాటింది...

దాన్లోని ఒకే ఒక బల్బు గుడ్డిగా వెలుగుతోంది...

“అవునమ్మా!... నీ ఒక్కదాని గురించే బస్సాపీసినాం.. పావుగంట లేటయ్యింది. కాబట్టి నువ్వే అందరికంటే కూరలు ఎక్కువవివ్వాలి... తెల్సిందా!?”

టిక్కెట్లను రమణమ్మ చేతిలో పెడుతూ గట్టిగా అన్నాడు కండక్టరు.

“అదేటి బావ్!?... అలాగంతవ్!.. నలుగురితో పాటు నానూ... నా ఒక్కదానికే ఎక్కువ ఇమ్మని అడగడం నీకు దరమ్మా... సెప్మీ!”

టిక్కెట్‌కు సరిపడ్డా చిల్లరనందిస్తూ అంది రమణమ్మ. ఆమె మాటలను కండక్టరు పట్టించుకోలేదు సరికదా ‘టికెట్.. టికెట్’ అంటూ ముందుకు వెళ్లిపోయాడు.

కండక్టర్ తన సీట్లో కూర్చున్నాక కర్రల సంచీనొకదాన్ని సోములకు అందించాడతను. సోములు మెల్లగా తనపని తాను కానిచ్చాడు. ఉదయం పూట ఈ సర్వీసుకు వచ్చే డ్రైవరు, కండక్టరుకు, కూరాకల్లంతా నాలుగు రకాల కూరలు విధిగా ఇవ్వాలి. ఉచితంగా కాదు.. డబ్బులకే!

దానికని వాళ్లు ఎంతో కొంత ముట్టజెప్తుతారు. అలాగని తక్కువిచ్చేరని వీళ్లు నిందించకూడదు. అలాగే టైమయ్యిందని వాళ్లు కూడా బస్సు వేగిరం తీయడానికి లేదు. అందరూ వచ్చేరని బస్సులో ఉన్నవారు చెప్పినంతవరకూ తీయకూడదు. అది వారి మధ్య కుదిరిన ఒప్పందం. ఇప్పటి వరకూ నిరాటకంగానే అమలవుతోంది.

బస్సు పాత బస్టాండ్ మీదుగా ప్రయాణించి నెహ్రూ మార్కెట్‌దగ్గరకు వచ్చి మెల్లగా ఆగింది. కూరాకల్లందరూ లగేజిని పట్టుకుంటూ బిలబిలమని దిగేరు. అప్పటికే కొంతమంది వ్యాపారస్థులు అక్కడికి చేరుకున్నారు. చెరువుదగ్గర చేపల కోసం ఎదురుచూసేకొంగల్లా!

అప్పటికే చుట్టుప్రక్కల గ్రామాలైన కళ్లికోట, దుగ్గి, గుణానుపురం, బాలగుడబ, నర్సిపురం, కిష్టపల్లి గ్రామాల్లోని కూరాకల్లందరూ తాము పండించిన కూరగాయలను మోసుకుని కాలినడకన చేరిపోయారు. వ్యాపారస్థుల్లో బేరసారాలు సాగిస్తున్నారు.

బస్సునుంచి లగేజిని కిందకు దించడానికి రమణమ్మకు సోములు మరల సాయం చేశాడు. సేకరించిన కూరలను సంచిలో నింపి దాన్ని కండక్టరుకు అందించాడు. బదులుగా అతనిచ్చిన పదిరూపాయల్ని అందుకుంటూ – “డబ్బులుసేనా.. తక్కవసేస్నాడు కండక్టరు బావు... ఎలా సద్దుకోవాలి.. ఏటో!?” తనలో తాను గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు సోములు.

“నేస్తమా.!!.. నీరసంగా ఉన్నావేటి.!?.. ఒంట్లోను బాగోలేదేటి!?” ఎదురుగా వచ్చిన సూరమ్మ, రమణమ్మను ఆప్యాయంగా పలకరించింది.

అక్కడక్కడా కూరగాయలను చవగ్గాకొని హోల్‌సేల్‌గా ధరలను బిగించి అమ్మే వ్యాపారస్థులలో ఆమెకక్కడ పోటీయేలేరు.

“ఇవ్వుడా..!?... వారం రోజుల్నించి దివాలుగుంది. మరో గచ్చింతరం నేక వొచ్చాను. ఏటి సేత్తాను.. రెక్కలాడల గదా.!?” అంది రమణమ్మ.

“మందులవీ వాడతన్నావా.!?.. నేప్పొతే సెప్పు.!?.. మొగమాటమొద్దు. రామారావు డాట్టరు దగ్గరికి తీసుకెల్తాను!”

కూరలనే కాదు, మనుషులను కూడా మాటలతో, బుట్టలో వేయడంలో సూరమ్మ మంచి నేర్పరి.. అందుకే అలవాటుగ అది.

“నేదు సూరమ్మ... నీ దగ్గర నా బొంకేటి.!?.. తగ్గిందినే!. మరేటి గాభర నేదు!” ఆ మాత్రం అభిమానానికే పొంగిపోయింది రమణమ్మ. ఆమెపై ప్రేమను మరింత ఒలకబోసింది సూరమ్మ.

“ఈ నీరసంతోటి టవునెందుకు రావాల.!? .. ఇంటికాడ ఉండిపోలేప్పొన్నావా!?... సర్నేగాని ఈటి రేటేంతో సెప్పినావు గాదు.!?” అడిగింది సూరమ్మ. రేటు – చెప్పింది రమణమ్మ. బేరం మొదలైంది. ఇద్దరికీ అంగీకారమైన రేటు కుదిరింది.

బీరకాయలు, వంకాయలు నూనెలు మానెలు ఒక్కొక్కటి నూట ఇరవై రూపాయలు, చిక్కుడుకాయలు డబ్బైరూపాయలు చొప్పున మొత్తం మూడొందల పదిరూపాయలయ్యింది. సూరమ్మ జాలిలోనుంచి డబ్బులు తీసి మూడొందలు రమణమ్మ చేతిలో పెట్టింది.

“నేస్తం!.. లెక్కేసినట్టు జాలిలో కరాకండీగా మూడొందలే ఉన్నాయి... పది తక్కువ!.. సరిపోద్దా.!?.. పోనీ ఎవర్నయినా చేబదులు అడుగుదామంటే ... తెల్లారేసరికి ఎవరిస్తారు!?.. అదీగాక అతేగానింకా బద్దీ కూడా తియ్యనేదు... ఏటి సెద్దుము రమణమ్మ!”

అటూ ఇటూ చూస్తూ బాధపడుతున్నట్టుగా నటించింది సూరమ్మ.

“పోన్లే నేస్తం!... పదేగదా!. ఉన్‌నీ!.. నాడబ్బుట్టుకొని నువ్వారొదిలి పారిపోతావాయేటి..!?.. ఆ బయ్యం నీగ్గాని నాకు నేదు.”

మూడొందలను జాలిలో పెట్టుకుని విషయాన్ని తేల్చేసింది రమణమ్మ.

"రవణమ్మా!.. పదమీ!.. టిసెప్తాను!.. తాగుదువు గాని. అసలే నీర్సంగున్నావు." అంటూ టీ దుకాణం దగ్గరికి లాక్కెల్లి టీ చెప్పి వెళ్లిపోయింది సూరమ్మ!

టీ త్రాగేసి అక్కడ్నుంచి మార్కెట్ దాటి ముందుకు వెళ్లింది రమణమ్మ. గురుగుబిల్ల నాయురాలమ్మ ఊరగాయ పెట్టడానికికని పెద్ద సైజు నిమ్మకాయలను వందకొని తెమ్మని రమణమ్మకు డబ్బిచ్చింది. ఇప్పుడదే పనిలో ఉందామె.

నిమ్మకాయలను కొని పాత బస్టాండ్ వేపు అడుగువేసింది. బయల్దేరడానికి సిద్ధంగా ఉన్న ఆటో వెనక్కి ఎక్కి కూర్చుంది మానిలను ఒళ్లో పెట్టుకుని! "తల్లి ముగ్గురిమీ.. పొద్దలా కస్టపడితే వచ్చింది మూడొందల రూపాయలు!.. కొట్టిన మందుకీ, పడ్డ కట్టానికీ, ఇతనాలు మదుపుకీ డబ్బు తీస్సినా... రోజుకు పదిరూపాయలైనా కూలీ కిట్టనేదు.. ఏంబతుకు..ఏటో.!?.. ఈపనొగ్గేసి మంటిపనికెలిపోయిన బాగున్ను!.. పదో.. పరకో మిగుల్ను!.. అయినా ఇయన్నీ ఇంకెన్నాల్లే!



... ఆ పాదాలమ్మ తల్లి దరమాన భాస్కర్రావుకి మేస్ట్రు ఉజ్జోగివెుచ్చిత్తే... అంతేసేనా!... నాకీ పరాకులుండవు!.. ఆయిగా కాలుమీద కాలేసి దర్జిగా కూకొని ఉండొచ్చు!"

పరిగెడుతోన్న ఆటోలో కూర్చుని ఉన్న రమణమ్మ తన మనసులో ఆశగా అనుకుంటూ.. ఏవేవో కలలు కంటోంది!

---

"బాస్కర్రావేడి.!?.. అలికిరి నేడు!"

టౌను నుంచి అప్పుడే వచ్చిన రమణమ్మ తన తల్లి తవిటమ్మ పెట్టిన పులిహోర తింటూ అంది. ఒకరింట్లో పని మనిషిగా పనిచేస్తోన్న తవిటమ్మకు అలవాటు ప్రకారం తనకు వచ్చిన తాయిలాన్ని తినమని కూతురుకు పెట్టింది.

"ఇయ్యాల్దాక ఇక్కడే ఉండోడు!.. ఇప్పుడే.. అలా ఈదిలోకెల్లా డమ్మీ!" ముడతలు పడిన దేహంతో దాదాపు ఎముకల గూడులా ఉన్న తవిటమ్మ అంది.

తినడం పూర్తి చేసిన రమణమ్మ తలకు నూనె రాసుకుని దువ్వుకుని కొప్పుముడేసుకుంది. వాన వొలిపిరికి జారిన బురదతో ఇంటిలో గోడలు వెలిసిపోయి బోసిగా కనిపిస్తుంటే.. చెదిరిన గడ్డితో ఇంటిపైన చిల్లులు.. ప్రకాశవంతంగా వెలుగును విరజిమ్ముతున్నాయి.

ముక్కున బేసర్లు.. చెవికి కానపర్సులు.. నుదుటిన రూపాయ కాసంతా ఎర్రని బొట్టు.. కళ్లకు నల్లని కాటుక.. కట్టుకున్న ఎర్రకోకతో...నల్లరాతి శిల్పానికి మందారపూలతో అలంకరించినట్లుగా ఆ వెలుతురులో నిండుగా కనిపిస్తోంది నలభయ్యేళ్లు పైబడ్డ రమణమ్మ!

బిందె.. చేద పట్టుకుని బయటకు వెళ్ళడానికి తయారవుతోన్న రమణమ్మను చూసి "అమ్మీ!.. ఇంటిల బియ్యం నిండుకున్నాయి.. ఇప్పడగ్ని జెయ్యడానికి కూడా నేవు... ఏటి సేద్దుము!?" మెల్లగా అంది తవిటమ్మ.

"రెండు కారుడుల మీద ఒట్టుకొచ్చిన కోటాబియ్యం కూడా అయిపోయాయేటి? సందేహంగా అడిగింది రమణమ్మ. ఔనన్నట్టు తలాడించింది తవిటమ్మ.

"సరిపే.!.. కూరలు పండించినోల్లకి కూడు కరువంటే ఇదే గావాల.!?.. అలాగుంది మన తిత్తవ!.. ఇదా!.. ఈ వందొట్టుకెల్లి మిల్లి దగ్గర పదికేజిల బియ్యమొట్టుకునిరా!.. ఎంతయితే అంత!..రేటేక్కువని తినడం మానిలేముగందా!" జాలిలోనుంచి డబ్బులు తీసన్తా తల్లికందించింది రమణమ్మ!

"ఆఁ.. సెప్పడం మరిసిపోన్ను!.. ఆ నిమ్మకాయల కవరు కూడా సత్తెమ్మకిచ్చి!.. పన్లోపడి మర్సిపోకు.. నానలగా వంగనారుకు నీల్లెటట్టడానికెల్తాను.. నువ్వీలోగా నీలుపెరిగీయమ్మా!"

వంగొని.. ఇంటిలోనుంచి బయటకు వచ్చి రేవడివైపు దారితీస్తూ అంది రమణమ్మ.!

---

ఒకచేత్తోగోనె సంచి.. మరొకచేత్తో నిమ్మకాయల ముచ్చి కవరూనూ, వందరూపాయలు పట్టుకుని సత్తెమ్మ నాయురాలు ఇంటికి నడుచుకుంటూ వెళ్లింది తవిటమ్మ.

ముందు సంచినీ, ఆ తర్వాత వందనూ ఆమెకిచ్చి బియ్యం కావాలని అడిగింది. సత్తెమ్మ నాయురాలు మౌనంగా విన్నదే గాని ఏం చెప్పలేదు.

"ఓయ్!.. అప్పలసోమి.. నిన్నే!.. ఇలాగ రావోయ్ ఓసారి!" ఇంటి మందు నుంచి వెళుతూ కనిపిస్తోన్న అప్పలస్వామిని పిలిచింది.

అతను వచ్చి ఎదురుగా నిల్చున్నాడు. ఏంటమ్మా అన్నట్టుగా.. తల గోక్కుంటూ! "మిల్లులో బియ్యమట ఉన్నాయా!?.. తవిటమ్మకు పది కేజిలు కావాలట!" అడిగింది నాయురాలు.. అతను ఆమె మిల్లులో డ్రైవరు..

"సూసిసెప్పాల..!? ఉన్నాయో లేవో!?.. గడిసేపాగమను!" నిర్లిప్తంగా అన్నాడు అప్పలస్వామి.

"అయితే.. నువ్వెల్లి ఈ అంకేంలో బియ్యమేసి వొట్టుకొచ్చీ!.. అంతవరకు తవిటమ్మ ఇక్కడే ఉంటుంది!"

అప్పలస్వామికి పని పురమాయించి, తవిటమ్మా వేపు తిరిగింది నాయిరాలు. "తవిటమ్మా!.. కసిన్ని మినువులున్నాయి. అప్పలస్వామి వచ్చీలోగా. గప్పున ఇసిరిద్దువు గాని..పదమీ!.. గడపలోకి రమ్మీ!"

లోపలకు దారితీస్తూ అంది నాయురాలు.

చేసేది లేక ఆవెను అనుసరించింది తవిటమ్మ. తిరగలిముందు కూర్చొని రోలు తిప్పబోతున్నంత వరకూ నాయిరాలు చెప్పిన 'కసిన్ని' కాస్త 'ఇద్దుం' గింజలన్న సంగతి ఆమెకు తెలియలేదు.

"తవిటమ్మా!.. నీమనవడు బాస్కర్రావు ఊర్లోనున్నాడా..!?"

ఎదురుగా కూర్చుంటూ నాయిరాలమ్మ అడిగింది.

"ఆడూల్లో ఉండక... ఎటెల్తాడమ్మా...! ఉజ్జోగమో... సజ్జోగమా!? తిరగలి తిప్పుతూనే అంది తవిటమ్మ.

"గరివిడి నుంచి తిరపతి పెందిల పోనుసేసాడు. ఆడికెప్పుడూ బాస్కర్రావు గురించి ఆలోసనే!.. నానేస్తం ఎలా వున్నాడో.. ఏటి సెత్తాన్నాడోనని!? ఆడు మాతర్తం ఏటి సేత్తాడు.. లోలోపల కుమిలిపోవడం తప్పు!" అంది నాయురాలు.

తిరుపతి ఆమె మనవడు... టీచరుగా గత మూడేళ్ళ నుంచి

గరివిడి మండలంలో ఉద్యోగం చేస్తున్నాడు.

తిరపతి బావు... ఎలాగున్నాడమ్మా?... బాగున్నాడా?... అడిగింది తవిటమ్మ.

"ఆ బాగున్నాడు... భాస్కర్రావునోసారి తిరపతి కాడికి ఎల్లమనకూడదా...? ఆడిక్కూడా దీవి తీరిపోద్ది!"

నాయురాలు మాటలకు ఏమి అనలేకపోయింది తవిటమ్మ.

"అమ్మమ్మ!... ఎవరిని బావ దగ్గరికి వెళ్ళమంటున్నావు?

టీ తెచ్చి తవిటమ్మకిస్తూ అంది నాయురాలు మనవరాలు.

"భాస్కర్రావని.. ఈ తవిటమ్మ మనవడే...! మేస్ట్రు ట్రయినింగు మన తిరపతితోనే అయ్యాడు. కానీ ఏట్లాభం...!?

ఉజ్జోగం రానేదు!? చెప్పింది నాయురాలు.

"ఏం.. మొన్న రిక్రూట్‌మెంట్‌లో పోస్టింగ్ రానేదా!?"

నేదమ్మా! ఇద్దరూ ఒకేమారు పరీచ్చలు రాసారు. బావకొచ్చింది. కాని ఈడికి మాత్తరం రానేదు" చెప్పింది నాయురాలు.

"అలా.. ఎందుకు జరిగింది!?"

''అవునమ్మా!.. నాకు తెలీకడుగుతున్నా!... ఈల్లకి ఎన్ని ఎక్కువ మార్కులొచ్చినా ఉజ్జోగాలు రావడం సేనా.. కష్టం వట.. నిజ్జివేనా!?"

విస్మయంగా అడిగింది నాయరాలు.

"ఏం.. ఎందుకని.!?" మనవరాలికి అర్థం కాలేదు.

"ఎంత సదివినా.. మాకులపోలికి రిజరువేషన్ నేదటమ్మీ!..
అదేటి సిత్రమో నాకద్దం కాదు!"

తిరగలి తిప్పుతూనే అంది తవిటమ్మ.

'ఏం కురాకులకీ రిజర్వేషను లేదా.!?"

"అవునమ్మా!.. నేనీ ఇంటికి కోడలుగా వచ్చిందగ్గర్నుంచి సూత్తను!.. ఈల కులంలో బతికి బాగుపడ్డోడు కాని.. సదివి ఉజ్జోగం చేసినోడు గాని ఇప్పటికి నా కంటపడనేదు.. ఏటంతే.. రిజరువేషన్ నేదంతన్నారు. ఇంతకీ రిజర్వేషన్ అంతే.. ఏటమ్మీ!?"

మనవరాలు వేపు చూస్తూ ఆసక్తిగా అడిగింది నాయురాలు.

రిజర్వేషన్ వాటి పూర్వంపరాలు గురించి అంతా వివరించి చెప్పింది మనవరాలు. నాయురాలమ్మకు అప్పుడు అర్థమైంది. ఇవేవి తనకు అర్థం కాని విషయాలుగా తవిటమ్మ భావించిందో.. ఏమోగాని తన పని తాను మౌనంగా చేసుకుపోతోంది.

"ఏది ఏమయినా.. ఈ విషయంలో కూరాకులకి జరిగింది అన్నేయమనమ్మా! పాపం భాస్కర్రావు...ఆడికి ఐదేళ్లంతాయి గావాల.. రమణమ్మనొగ్గేసి ఇంకొకాడమనిషితో పెనిమిటి ఎల్లిపోయింతర్వాత... రెక్కలు ముక్కలు సేస్కోని కందను కొందను జేసింది... ఆడు సిన్నప్పట్నుంచి తెలివయినోడే!.. బొబ్బిలి గురుకుల పాఠశాలకే ఫట్టు మారుకులతోటి పాసయ్యాడు. మనోవర్తి క్రింద మొగుడు ద్వారా వొచ్చిన మడి సెక్కంతా ఆడి సదువుకే, ఆర్పేసింది!... మేస్ట్రు ట్రయినింగు కూడా అయ్యాడు కాని లాభమేటి.!?.. ఇప్పటికి రెండుసార్లు ఒకటి అరా మారుకులతో ఉజ్జోగం రానేదు.. కాని అవే మారుకులొచ్చిన మన తిరపతికి ఉజ్జోగవెలిపొచ్చింది'' భాస్కరరావు పరిస్థితినంతా పూసగుచ్చినట్టుగా... వివరించింది నాయురాలు. "పాపం.. భాస్కరరావు.. బాడ్‌లక్!" సానుభూతి ప్రకటిస్తూ అంది మనవరాలు.

ఇంతలో అప్పలస్వామి బియ్యం మూట పట్టుకుని వచ్చి గడపలో దించాడు. తవిటమ్మ పని కూడా పూర్తయ్యింది. లేచి నిలబడింది. "అమ్మా!.. నా పించను సంగతి ఆఫీసరుగోరికి సెప్పమని నాయుడుబావుకి గుర్తు సెయ్యమీ.. మర్సిపోకు తల్లి.. తల్లీ!"

నాయురాలను బ్రతిమాలి.. బియ్యం మూటతో అక్కడ్నుంచి వెళ్ళిపోయింది తవిటమ్మ.

---

డిసెంబరు నెల...

చలి ఎక్కువగా వుంది..

రమణమ్మకు అజీర్తి ఎక్కువైంది. తిన్నది వంట బట్టక పోతుండటంతో... మనిషి క్రమేపీ చిక్కిపోయింది. తెలుగు మందులు వాడింది. గుణం కనిపించలేదు. ఇంగ్లీషు మందులు వాడింది. తాత్కాలికంగా నయమనిపించిందే కాని పూర్తిగా తగ్గలేదు.

డబ్బులు చూసుకుని విశాఖపట్టణంలోని పెద్ద ఆసుపత్రిలో పెద్ద డాక్టరుకు చూపించుకుంటే మంచిదని అనుభవజ్ఞుల సలహా మేరకు.. తప్పనిసరిగా వెళ్ళిరావాలని నిర్ణయించుకుంది రమణమ్మ. వృత్తి వ్యాపకంగా.. ఏ రోజయితే కూరగాయలను కోసి ఇంట్లో ఉంచిందో.. అదే రోజు రాత్రి.. వాంతులతో పాటు విరోచినాలు కూడా రమణమ్మకు పట్టుకున్నాయి. బాగా నీరసించిపోయింది.



భాస్కరరావు ద్వారా పరిస్థితినంతా తెలుసుకున్న సంచివైద్యుడొకడు వచ్చి ఆమెకు ఇంజక్షన్లు చేసి సెలైన్ బాటిల్ పెట్టాడు. తెల్లవార్లూ బాటిల్లు ఎక్కడంతో కొంచెం తేరుకుంది.

ఇరుగూ పొరుగూ.. వీధిలోని జనమంతా వచ్చి రమణమ్మ మంచం చుట్టూ చేరారు. సోములు వచ్చి ఆమెకు ధైర్యం చెప్పాడు. భాస్కరరావు రాత్రంతా కునికిపాట్లు పడుతూ విచారంగా తల్లి మంచానికి ఎదురుగా కూర్చొని ఉన్నాడు.

తెల్లవారు ఐదుగంటలు....

కొడుకు భాస్కరరావునలా చూసేసరికి రమణమ్మ గుండె ద్రవించిపోయింది! "నాయినా... భాస్కర్రావూ!.. నెగురా.. నెగుమి!.. ఎలా జరగవొలిసింది! అలాగ జరుగుతాది.. దాని గురించి బెంగేల.!?.. నువ్ సదుకున్నోడివి! తెలివైనోడివి... నిబ్బరంగ ఉండాల.. పట్నంల అమ్మడానికని ఇంటిల కూరలు తెచ్చిపెట్టి ఉంచినాను.. నానా లేగ లేకపోతన్ను.. నీకా సెప్పడానికి నోరు రాకుంటుంది.. అయినా తప్పదం నేదు... కూర లొట్టకుని సోములు మాత్రతో బయలెల్లు.. మాత్రే సూసుకుంతాడంతా!.. నీకిది సిన్నతనమే.. కాదన్ను!..

...కాని తప్పదురా!.. నీకు ఉజ్జోగం రావడం నా కళ్లతోటి సూత్తానో లేదో..!? కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా దీనంగా అర్థించింది రమణమ్మ. భాస్కరరావుకు అంతా అర్థమైంది. లేచి ముఖం కడుక్కున్నాడు. నాలుగు మానిలతో నిండిన కూరగాయలను.. అటూ ఇటూ కావిడికెత్తాడు.

దూరం నుంచి బస్సు హారన్ కొడుతోంది.. అందరినీ తొందరగా రమ్మన్నట్టుగా! "అల్లుడో.!.. తొందరగపదరా!.. బస్సు తీసెత్తాడు!"

బరువుతో ముందు నడుస్తున్న సోములు తొందరచేశాడు.

"...ఈ పనేదో.. నేను కాలేజిలో చేరకుండా ముందే చేసి ఉన్నా బావుణ్ణు!.. నాయిన ఇచ్చిన మడిసెక్కయినా మిగిలి ఉండేది!.. ఇప్పుడు అమ్మ వైద్యానికి పనికొచ్చేది!" భుజాన కావిడి బరువుతో... గబాగబా నడుస్తూ మనసులో బాధగా... అనుకున్నాడు భాస్కరరావు. అప్పటికింకా చుట్టూ చీకటి ఆవరించి ఉంది. అతని బతుకులోలాగే!

☺

## వారసత్వం

# అంతరించిపోతున్న జానపద కళా సంపద

**గ్రామీణ జానపదుల విశ్వాసాల నుండి, నిష్కల్మష నిర్మల హృదయ క్షేత్రాల నుండి మొగ్గ తొడిగినవే ఈ జానపదకళలు. వీటికి మన వెలుగు– తెలుగు నేల పుట్టిల్లు – పరదేశీ సామ్రాజ్యవాద విషసంస్కృతి, డిస్కో, థెక్, క్లబ్, పబ్, డిష్ యాంటిన్నా, నెట్ విలయంలో మనం – మన కళా సంపద చిక్కుకొన్న సంధికాలంలో ఉన్నాం.**



**తంగిరాల చక్రవర్తి**

**జా**తిని ప్రభావితం చేసే అనేక జానపద సాహిత్యం ప్రజా కళారూపాలు ఈనాడు కనుమరుగై పోతున్నాయి. ప్రపంచీకరణ పీడన పల్లె సీమల్ని ధ్వంసం చేసిన క్రమంలోనే జానపదకళా సంపదను మార్కెట్ సంస్కృతి కబళించింది. సర్వనాశనం చేస్తోంది.

ఆంధ్రదేశపు పల్లెలలో ఆనాదిగా వస్తున్న కళారూపాలలో ఎన్నో ఈనాడు మనం పుస్తకాల్లో మాత్రమే చూడగల్గుతున్నాం. పల్లె ప్రజలకు అందుబాటులో వున్న రమణీయ కళారూపాలెన్నో ఉన్నాయి. క్రౌంచపక్షికున్న హృదయం కవులలో, కళాకారుల్లో ఉండి తీరాలి. స్వేచ్ఛా, పారదర్శకత ఉండాలి. ప్రాంతాల రీత్యా పరిశీలించిన వివిధ జానపద కళారూపాలెన్నో మనం తెల్సుకోవచ్చు. సాధన శూరులు (కరీంనగర్) పగటి వేషాలు (రాజమండ్రి) ఉరుములు (అనంతపురం) రుంజా (తూ.గోదావరి), కత్తిసాము, కర్రసాము (విజయనగరం) తోటపటం కథ (వరంగల్) కాటిపాపలు (నల్గొండ), థింసా (విశాఖమన్యం) విలువిద్య (నర్సరాపుపేట) ఏడు మెట్ల కిన్నెర (మహబూబ్‌నగర్ జిల్లా) యింకా ఎల్లమ్మకథ, యక్షగానం, పాములాట, గంగిరెద్దులాట, ఒగ్గుడోలు నృత్యం, వీరనాట్యాలు, కర్రసాము, చిందుభాగవతం, గొరవయ్యలు, తొలు బొమ్మలాట, కడ్డీ వాయిద్యం, మరకాళ్ళు, కత్తుల నృత్యం, సాముగారడీలు, కీలు గుర్రాలు, జడకోలాటం, హరికథ, బుర్రకథ, బాలసంతువారు, ఒగ్గుకథ, చెక్క భజనలు, ధూలా (పీర్లపండుగల్లో), కోలాటం, పేరిణి శివ తాండవం, పిచ్చుకుంట్లవాళ్ళకథ, మందహెచ్చులు (సంచారజాతులు), బవనీలు, లేక బైండ్లవారు, (శైవులు) సుగాలీ (లంబాడీ) నృత్యం, కొమ్ముబూర, శేవగారడి (ఉత్తరాంధ్ర) బుట్ట బొమ్మలు, నాదస్వరం, జముకుల కథలు, గొల్ల కలాపం (కూచిపూడి భాగవతులు) గరగల నృత్యం, పండరిభజనలు, కిన్నెరకథ, డప్పుల నృత్యం, రుంజవాయిద్యం, ఉరుముల నృత్యం, గోసంగి, తూర్పుభాగవతం, మంత్రగాడు (పగటివేష ప్రక్రియ), కవ్వాలి (పాటనృత్యం) జాలరినృత్యం, పద్యనాటకం, రేలనృత్యం, జోడుమద్దెల, అందెల నృత్యం, గుసాడీ నృత్యం (గోండులు చేసే నృత్యం) శారదకథ (వరంగల్), మర్ఫియా డోలుకొయ్యలు, పటం కథలు, చుట్టు కాముడు, (బతుకమ్మను పోలి వుంటాయి), తప్పెటగుళ్ళు, పులి వేషాలు, థింసానృత్యం, కొమ్మదాసరి, నగరా, బేతాళనృత్యం, కూచిపూడి భాగవతం, గొల్లసుద్దులు, (పల్లెసుద్దులు), అసాధికథ (రాయలసీమ) చిడతల రామాయణం, లాంటి దాదాపు 766కి పైగా జానపద కళలు మన ఆంధ్రప్రదేశ్ మంతటా జాతిని, జాతీయతను మేల్కొలిపేవే. జానపదకళారూపాలు ఆంధ్రప్రదేశ్‌లో పేరు ప్రఖ్యాతులు, పొందినంత కీర్తి, ప్రఖ్యాతి దేశంలోని మరే ఇతర రాష్ట్రాల్లోని జానపదకళలకు పోటీ కాకున్నా, ప్రజల్ని ఎంతో జాగృతం చేసాయి. ప్రజా జీవనంలో భాగమైన జానపద కళలు.. ఆధునిక జీవన శైలి, డిష్ యాంటిన్నా, నెట్ విష సంస్కృతి వలన ... తమ ఉనికినే కోల్పోతున్నాయి.

ఈ కళల ద్వారా ప్రజలు... వినోదాన్ని, విజ్ఞానాన్ని, చైతన్యాన్ని పొందేవారు... తెలంగాణా సాయుధ పోరాట కాలంలో బుర్రకథ, ప్రజానాట్యమండలి వారి "మా భూమి" నాటకం లక్షలాది మంది ప్రజల్ని కదలించింది.. వేలాది ప్రదర్శనల ద్వారా జాతిలో చైతన్య స్ఫూర్తిని నింపింది... మరీ నాటక రంగం ఈ రోజు సర్కార్‌నందులకే పరిమితమై.. పరిషత్‌లకే కుదించుకు పోతున్నది.

భారతదేశంలో ప్రాచుర్యం, ప్రఖ్యాతినొందిన జానపదకళల్లో ముఖ్యమైనవి: 1. చౌదంగ్‌హాస్సరి, 2. మిర్ బిహునృత్యం, 3. టకారియా నృత్యం, 4. డాప్ నృత్యం, 5. కులూ లోయలోని నృత్యాలు, 6. కొలామ్ తుల్లాల్ నృత్యాలు 7. జికార్ నృత్యం, 8. భగోరియా నృత్యం, 9. తాబల్ చాంగ్ బి నృత్యం, 10. ఇంతోనాలకు నృత్యం, 11 మితున్ నృత్యం, 12. రన్ పా నృత్యం, 13. భంగ్రా నృత్యం, 14. పరిన్ హోరినృత్యం, 15. పొయిక్కల్ కుతిరై నృత్యం. మొదలైనవి ముఖ్యమైన భారతీయ జానపద నృత్యాలుగా పేరు పొందాయి.

అరుణాచల్, గుజరాత్, కేరళ, తంజావూర్, మొదలైన ప్రాంతాల్లో యింకా జానపద కళలు.. ఎంతో ప్రఖ్యాతి నొందుతున్నాయి.

శాతవహన రాజైన హాలుడు "గాథాసప్తసతి" శ్రీనాధుని క్రీడాభిరామం, పాల్కూరి సోమనాథుడు రాసిన "పండితారాధ్య చరిత్ర (క్రీ.శ. 13 శతాబ్ది) గ్రంథాల్లో ఈ జానపద కళల గురించి సమగ్రంగా రాసారు.

నేటి మన నృత్య, సంగీత, సాహిత్య, శిల్పకళలకు, యక్షగానాలకు, వీధి నాటకాలకు, మూలం అయిన మన తెలుగు జానపదకళలు ప్రస్తుతం ఆదరణ లేక అంతరించి పోనున్నాయి. తెలుగునాట అతి ప్రాచీన జానపద కళారూపాల్లో యక్షగానం

ఒకటి – ఇది నేడు మనం డి.డి.1 లో మాత్రమే చూసే దుస్థితిలో ఉన్నాం.

జానపదకళల్లోని ప్రధాన అంశాన్ని బట్టి ఈ కళలను సంగీత, నృత్య, నాటక రూపాలుగా వర్గీకరించారు.

ప్రస్తుతం అంతో, ఇంతో ప్రాచుర్యంలో కొండ ప్రాంతాల్లో, పల్లెసీమల్లో, ఉన్న జానపద కళారూపాల్లో ముఖ్యమైనవి 1. కురవంజి, 2. తోలుబొమ్మలాట, 3. యక్షగానం, 4. వీధినాటకం, 5. పిచ్చుక గుండ్లు, 6. చిందునృత్యం, 7. భామా కలాపం, 8. ఘంసాడి నృత్యం, 9. పులివేషం, 10. జముకుల కథ 11. పాండవలోళ్ళు, 11.సింహాద్రి అప్పన్న కథలు, 12. ఒగ్గుకథ, 13, గరగనృత్యం, 14. వీరముష్టినృత్యం, 15. పగటివేషాలు, మొ॥ మహోజ్వలంగా వెలుగొందాయి. ఈ విశాలాంధ్రదేశం అంతటా –వీటిని అంతరించి పోకుండా కాపాడుదాం. విష సంస్కృతిపై పోరాడుదాం.

సంగీతం, సాహిత్యం, నృత్యం, చర్విద అభినయ కౌశలం, మంచి సంభాషణ, వేషం, భావన, సమయస్ఫూర్తి ఆహార్యం, వంటి కళల సమాహారంగా తెలుగునాట జానపద కళలు, ముఖ్యంగా నాటకం, బుర్రకథ, వీధి భాగవతం, యక్షగానం, మొ॥ ప్రదర్శిత మౌతున్నాయి. ఆట, పాట, శబ్దం, లయ మేళవింపు, అభ్యుదయ భావ ఉషస్సుతో, తెలుగు సాంస్కృతిక వికాసానికి జానపద కళారూపాలు పట్టుకొమ్మలై జాతిని జాగృతం చేసాయి. జాతికి జీవననాళిక జానపదగీతిక అన్నారు శ్రీశ్రీ.

శ్రామిక జీవనవేదం నుండి జనించిన సహజకళల కల్పతరువులు మన జానపద కళలు. జానపద కళాకారుల్లోని మాట, పాట, ఆట, హావభావాలన్నీ వారి దైనందిన శ్రమైక జీవన సౌందర్యం నుండి రూపుదిద్దుకున్నవే. గ్రామీణ జానపదుల విశ్వాసాల నుండి, నిష్కల్మష నిర్మల హృదయ క్షేత్రాల నుండి మొగ్గ తొడిగినవే ఈ జానపదకళలు. వీటికి మన వెలుగు– తెలుగు నేల పుట్టిల్లు – పరదేశీ సామ్రాజ్యవాద విషసంస్కృతి, డిస్కో థెక్, క్లబ్, పబ్, డిష్ యాంటిన్నా, నెట్ విలయంలో మనం – మన కళా సంపద చిక్కుకొన్న సంధికాలంలో ఉన్నాం. పెట్టుబడిదారీ నీచ, సంస్కృతి, స్త్రీని మార్కెట్ వినిమయ సరుకుగా – విశృంఖలుగా ఫేషన్ టెక్నాలజీ ముసుగులో.. యువతను నిర్వీర్యం చేస్తున్న హైటెక్ – మాయాజాలాన్ని రంగుల ప్రపంచాన్ని కవులు ... కళాకారులు ఎదిరించి తిప్పకొట్టాలి.

అస్తవ్యస్త దురవస్థనుంచి ప్రజలను రక్షించడానికి, జనతకు.. జగతికి కర్తవ్యబోధ చేసి సమస్యల పరిష్కారానికి ప్రజల్ని సమాయత్తం చేయడానికి కవులు.. కళాకారులు.. కార్యార్థులయ్యే సమయం నేడు ఆసన్నమైంది. జన సంస్కృతికి ప్రతీక – పతాక వంటి జానపద కళారూపాల్ని పరిక్షణకు కార్యాచరణ దిశగా కదలాల్సింది కళాకారులే... జానపద కళ రూపాల గురించి ఆచార్య జి..వి. సుబ్రహ్మణ్యంగారి మాటలే నిలువెత్తు నిజాలు. వారి మాటల్లో.. "యక్షగానం నన్నయకు పూర్వకు పుట్టింది. పాల్కురికి ముందు గజ్జెకట్టింది. శ్రీనాధుడికి ముందే గొంతెత్తి పాడింది. రాయలకు ముందే రంగ మెక్కింది. విజయరాఘువుడికాలంలో విజృంభించింది. అర్థశతాబ్దిపైగా తాను ఆడింది ఆటగా, పాడింది పాటగా, వీరవిహారం చేసింది. మహారాష్ట్రుల మన్ననలు. కన్నడిగుల కస్తూరి నందుకుంది. దేశీ నాటకంగా సమాహార కళారూపంగా మెరిసింది. ఇప్పుడు ఒక స్మృతిగా జాతికి మిగిలింది."

ప్రపంచబ్యాంక్ విధానాలతో పాలన సాగించే ప్రభుత్వాలు, విదేశి విష సంస్కృతికి గేట్లు, కిటికీలు బాహాటంగా తెరుస్తూ – శ్రామిక ప్రజలకు, శ్రామిక ప్రజా కళా సాహిత్య – సంస్కృతులకు కీడు తెస్తున్న విధానాలపై – అశ్లీల, వ్యాపార మార్కెట్ – వినియమ సంస్కృతిపై కవులు.. కళాకారులు.,, కృషి చేయాలి. జాతిని జాగృతి పరిచేది, జాతిజీవనాన్ని ప్రతిబింబించే జానపద కళా సాంస్కృతిక పరిరక్షణకై కవులు.. కళాకారులు, మేధావులు,, కదలాలి... ఉద్యమించాలి.


## ప్రస్థానం చందా కట్టారా?

**లేనట్లయితే వెంటనే చందా కట్టండి.**

**5 & 10 సం॥ల చందా కట్టి పాత ప్రస్థానాలను బహుమతిగా పొందండి (2002 నుండి 2006 వరకు)**

### సాహిత్య ప్రస్థానం మాసపత్రిక చందా వివరాలు

**సంవత్సర చందా (వ్యక్తులకు) : రూ.120/–** **సంవత్సర చందా (సంస్థలకు) : రూ. 150/–**

**అయిదేళ్లకు : రూ. 500/–** **పదేళ్లకు : రూ. 900/–** **విడి ప్రతి : రూ. 10/–**

**ప్రజాశక్తి బుక్‌హౌస్ బ్రాంచీలన్నిటిలోనూ సాహిత్య ప్రస్థానం లభిస్తుంది. ప్రజాశక్తి దినపత్రిక ఏజంట్లకు చెప్పి వారి ద్వారా కూడా తెప్పించుకోవచ్చు.**

మేనేజర్

ప్రస్థానం

**1-1-187/1/2, వివేక్‌నగర్, చిక్కడపల్లి, హైదరాబాద్–20**

ఫోన్ :**27660013 ;** వివరాలకు : **9490099059 ;** ఇ.మెయిల్:Prasthanam_ss@yahoo.co.in

**భాష**

# మన ఇండ్లీషు!

**ఇంగ్లీషు గొప్పతనం గురించి చాలా మంది చాలా చెబుతుంటారు. తెలుగులో వత్తులు, పొట్టలో చుక్కల గురించి మాట్లాడితే ఛాందసమని ఈసడించేవాళ్లే ఇంగ్లీషు ఎలా మాట్లాడవచ్చో, ఎలా కూడదో గొప్ప పరవశంతో చెబుతుంటారు. ఇంగ్లీషు పత్రికల స్థాయికి మనమెప్పుడైనా చేరగలమా అని దీర్ఘ నిశ్వాసం వదులు తుంటారు**




**తెర**

ఇండియాలో ఎవరూ ఇంగ్లీషు మాట్లాడరు, ఇదంతా ఇంగ్లీషు, తెంగ్లీషు, బెంగ్లీషు లాంటిదే వంటి వ్యాఖ్యలు తరచూ వినిపిస్తుంటాయి. అయితే ప్రసిద్ధమైన వాటితో సహా ఈ దేశంలోని మొత్తం 416 ఆంగ్ల పత్రికలలో రాసేది కూడా అదేనని సోదాహరణంగా చారిత్రికంగా నిరూపించే చక్కటి పుస్తకం ఇండ్లీష్. దీన్ని రాసిన జ్యోతిసన్యాల్ సీనియర్ జర్నలిస్టు . 'ఇంప్రింట్' అనే శీర్షికలో ఇంగ్లీషు పత్రికల భాషా ప్రయోగాలను పరామర్శించేవారు. స్టేట్స్‌మన్ పత్రికలో ముప్పై ఏళ్లు పని చేసి తర్వాత బెంగుళూరులోని 'ఆసియన్ స్కూల్ ఆఫ్ జర్నలిజం'లో డీన్‌గా చేరారు. వాటినే ఈ పుస్తకంగా ప్రచురించారు. లండన్‌లోని సరళ ఆంగ్లభాషా సంస్థ డైరెక్టర్ మార్టిన్ కోట్స్ దీనికి సంపాదకుడిగా వుండి మంచి ముందుమాట రాశారు.

ఇంగ్లీషు గొప్పతనం గురించి చాలా మంది చాలా చెబు తుంటారు. తెలుగులో వత్తులు, పొట్టలో చుక్కల గురించి మాట్లాడితే ఛాందసమని ఈసడించేవాళ్లే ఇంగ్లీషు ఎలా మాట్లాడవచ్చో, ఎలా కూడదో గొప్ప పరవశంతో చెబుతుంటారు. ఇంగ్లీషు పత్రికల స్థాయికి మనమెప్పుడైనా చేరగలమా అని దీర్ఘ నిశ్వాసం వదులు తుంటారు. మరో వంకన నెలరోజుల్లో మీకు ఇంగ్లీషు నేర్పి టూ ఇంటలిజెంట్లను చేస్తామని స్పోకెన్ ఇంగ్లీషు కోర్సుల నిర్వాహకులు ఆశపెడుతుంటారు.

ఇంగ్లీషు గొప్ప భాష కనక దేశ దేశాల పదాలను తనలో కలుపుకొని విస్తరించిందనే మాట తరచూ వింటుంటాం. అది నిజం కూడా (ఇవన్నీ చెప్పే డిక్షనరీ అన్నమాట కూడా ఫ్రెంచి నుంచే వచ్చిందట). అయితే అదంతా బ్రిటిష్ సామ్రాజ్యం నాటి మాట. ఆ చరిత్ర చాలా వుంది. ఇంగ్లీషు భాషా చరిత్రనూ, పరిణామ క్రమాన్ని చెప్పే చాలా అంశాలు ఇందులో చూడొచ్చు.

ఈ పుస్తకంలో మొత్తం ఏడు అధ్యాయాలున్నాయి. అయితే మధ్యలో వున్న మూడు, నాలుగు అధ్యాయాలు భారతీయుల కోణం నుంచి కీలకమైనవి. 3,4,5,6 అధ్యాయాలలో ఆయన ఈ దేశంలో వివిధ మాతృ భాషలకు చెందిన వారు ఇంగ్లీషులో రాసేటప్పుడు ఎదుర్కొనే సమస్యలు, ఆ ప్రభావాలను వివరించారు. ఇండియాలో ఇంగ్లీషులో రాసేవాళ్లు చేసే తప్పులకు రెండు కారణాలు. ఇక్కడ ఇంగ్లీషు ప్రధానంగా వాణిజ్యపరమైన లక్షణాలతో పెరగడం ఒకటి. ఇంగ్లీషులో లేని అనేక లక్షణాలు భారతీయ భాషలకు ముఖ్యంగా దక్షిణాది భాషలకు వుండటం రెండోది. కొన్ని సమస్యలు కాలమూ, లింగమూ, క్రియలు, విశేషణాలు తదితర వ్యాకరణ సూత్రాలకు సంబంధించినవైతే మరికొన్ని మన సంప్రదాయాలు, కుటుంబ సంబంధాలు తదితరాల పద సంపదకు సంబంధించినవి.

ఉదాహరణకు 'పావని హావింగ్ టూ బుక్స్' వంటి ప్రయోగాలలో హావింగ్ అన్న మాట 'కలిగి వున్నది' అనే అర్థం తప్ప స్వంతమైనవి అన్న అర్థాన్ని ఇవ్వదు. తెలుగులో ఈ పుస్తకాలు పావనివే అని, తమిళంలో పావని వుడియా, కన్నడంలో పావనిందు, మళయాలంలో పావనిడే అని రాసే భావానికి హావింగ్ అన్న మాట సరిపోదు. కాని సమానమైన క్రియా విశేషణ పదాలు ఇంగ్లీషులో లేనందువల్ల ఇలా రాస్తుంటారు. అదే హిందీలో అయితే పావని కీ అని లింగ పదాన్ని కూడా కలిపితే తప్ప అర్థం కాదు. షి ఈజ్ హావింగ్ టూ డాటర్స్ అంటే ఆమె ఇద్దరు పిల్లల్ని కంటున్నది అని అర్థం. భారతీయ క్రియా పదాలకూ ఇంగ్లీషులో పదాలకు మధ్య తేడాను గుర్తించడంలో గందరగోళం ఇది.

తనే, అదే, అతనే వంటి తెలుగు మాటలకూ ఆజ్ హీ వంటి హిందీ ప్రయోగాలకు ప్రత్యామ్నాయంగానే ఇంగ్లీషులో 'ఇట్ సెల్ఫ్' ' హిమ్ సెల్ఫ్' వంటి మాటలు అనవసరంగా వాడుతున్నారు. ఆల్సో, లెస్, బోత్ వంటి ఇంగ్లీషు పదాలకు సందర్భాన్ని బట్టి పలురకాల అర్థాలువస్తాయి కాని భారతీయులు మాత్రం తమ భాషలకు అనుగుణంగా వాటిని అసందర్భంగా వాడుతుంటారు. ఇవే గాక ఈచ్ అండ్ ఎవరీ లాటి లేనిపోని జంట పదాలు కూడా మన ప్రత్యేకతలు. నోటెడ్,ఆడెడ్, ఛార్జ్‌డ్, సెడ్, మీన్‌వైల్, అస్యూర్డ్, రెస్పెక్టివ్‌లీ, మేకింగ్ అన్ ఇష్యూ వంటి మాటలను అనవసరంగా వాడేస్తున్నారు. తెలుగులో 'గుర్తుతెలియని దుండగులు' అని అనువదించే 'అన్ ఐడెంటిఫైడ్' ప్రయోగం అర్థం లేనిదని ఈ రచయిత చెబుతాడు. దుండగులకు గుర్తింపు కార్డులుండవు అని చమత్కరిస్తాడు. ఇన్ దిస్ రిగార్డ్, విత్ రిగార్డ్ టు లాటి అధికారిక ప్రయోగాలూ ఈ కోవలోవే.

ఇంగ్లీషులో దీర్ఘ వ్యాక్యాలు, సంక్లిష్ట వాక్యాలు సహజమైనట్టు చెబుతుంటారు. ఇంగ్లీషు పత్రికలు విషయం సూటిగా చెప్పకుండా దాటేయడానికి అటూ ఇటూ తిప్పి రాస్తుంటాయి. ఇదిసరికాదంటాడీ రచయిత. చేతిలో కలం పెట్టుకుని విడదీసుకుని గీతలు గీసుకుని చూస్తే తప్ప అర్థంకావని ఆయనే ఒప్పుకుంటాడు. ఇంగ్లీషులో 1387లో చాసర్ వంటివారు సరళంగా రాసేవారట.తర్వాత ఫ్రాన్సిస్ బేకన్ వంటివారు గ్రాంథిక తరహాను తెచ్చిపెట్టారు. అయితే ఇప్పటికీ ఛాసర్‌ను చదువుతారు తప్ప బేకన్‌ను కాదని సన్యాల్ వివరిస్తాడు. ఇండియాలోని ఇంగ్లీషు రచయితలు, పాత్రికేయులు ఆ క్లిష్టతనే ఘనతగా భావించి వంటపట్టించుకున్నారని విమర్శించాడు.

ఈ పుస్తకం ఇంగ్లీషు మాట్లాడే భారతీయులందరికీ పఠనీయమని అట్టపైన రాశారు. పత్రికా రంగంలో పనిచేసేవారు, మరీ ముఖ్యంగా ఇంగ్లీషు పత్రికలు క్రమబద్ధంగా చదివే వారు మిస్సవ కూడని విషయాలు ఇందులో వున్నాయి. అలాగే భాషలన్నీ గౌరవనీయమైనవేనని కూడా ఇంగ్లీషు భాషా చరిత్రను చూసినప్పుడు అర్థమవుతుంది.

సాహితీ ప్రస్థానం పాఠకులకు, సాహితీ మిత్రులకు
ఉగాది శుభాకాంక్షలతో...
**పెంట్యాల పుల్లయ్య**
**సర్పంచ్**
**పొద్దుటూరు గ్రామ పంచాయతీ**
**చింతకాని (మం), ఖమ్మం**

నచ్చిన పుస్తకం

# మన మాల్గుడి మిట్టూరోడి ఆల్ ఇన్ వన్!




**ఇంతకు ముందు విడివిడిగా విడుదలైన ఈ పుస్తకాలన్నీ ఒకచోట చేర్చి అందమైన బాపు బొమ్మతో 'మిట్టూరోడి పుస్తకం' గా అందించారు. ఆ విధంగా ఇది మిట్టూరోడి ఆల్ ఇన్‌వన్.**

## ప్రమర

**తె**లుగు రచనా రంగంలో ఒక సున్నితమైన స్థానీయ భాషా సంస్కృతీ సంచలనాలను తీసుకువచ్చి సాహిత్యాభిమానులు అంతరంగాలలో అల్లుకున్న రస సిద్ధుడు. సాదా సీదా పల్లీయుల జీవిత సత్యాలకూ, జీవన దృశ్యాలకూ శాశ్వత తత్వం సమకూర్చిన నవ్య శిల్పి. అఖిల భారతాన్ని అలరించిన ఆర్.కె. నారాయణన్ తరహాలో; కొన్ని కోణాలలో ఆయనను కూడా మించి పోయి తన లోకాన్ని సహజవర్ణాల్లో చిత్రించి ధన్యుడైన శిల్ప కోవిదుడు. వ్యక్తిగత జీవితంలో తన రేఖల్లో ఇమిడి పోయి నిశ్శబ్దంగా సంచరించే నామిని రచయితగానూ సరిహద్దులు ఎరిగి ఆ పరిధిలో అతి సూక్ష్మాంశాలను కూడా అద్భుతంగా అక్షరీకరించిన అన్వేషి.

నామిని పచ్చ నాకు సాక్షిగా.. అప్పటి ఆంధ్రజ్యోతిలో వారం వారం వస్తున్నప్పుడు ఆకట్టుకున్నా పుస్తకంగా వచ్చాక అంతకంటే ఎక్కువ ప్రభావం చూపింది. పాఠకులకు అపురూపమైన అనుభూతి మిగిల్చింది. అమ్మను కేంద్ర బిందువుగా చేసుకుని ఆమె సుఖదు:ఖాలను అమాయకపు పసి దృష్టితో చూసిన రోజులను మళ్లీ మననం చేసుకుని అచ్చంగా అలాగే రాయడం నామినికే చెల్లింది. ఆ తర్వాత నామిని రచనా యాత్ర ఆగింది లేదు. తెలిసింది మాత్రమే రాయాలని కంకణం కట్టుకుని కలం పట్టిన రచయితకు వుండే సదుపాయం నామినికి బాగా తెలుసు. అందుకే తర్వాత అదే నమూనాలో మరిన్ని కోణాలు అందిస్తూ ఆవిష్కరిస్తూ ముందుకు సాగాడు. తర్వాత సినబ్బ కతలు, మిట్టూరోడి కతలు వెలువరించాడు. సినబ్బ కతలు రచయిత పాఠశాలానుభవాలు కాగా మిట్టూరోడి కతలు ఒక ఇంటి వాడైన మిట్టూరోడి సంబంధ బాంధవ్యాలు. ఇవన్నీ ఆత్మకథ లక్షణాలు గలవైతే తర్వాత ఆయన 'మునికన్నడి సేద్యం' అనే చిన్న నవల అందించారు. కాయకష్టానికి వెనుదీయక స్వంత కమతం, స్వతంత్ర జీవితం ఏర్పరుచుకోగోరే రైతుయువకుని ఆత్మ ఘోషను వినిపించారు. పాల పొదుగు అన్నది నవలిక లాటిది. పాడిపశువులతోనూ పెనవేసు కున్న పల్లెపడుచు మనసుకు పట్టిన అద్దం.

ఇంతకు ముందు విడివిడిగా విడుదలైన ఈ పుస్తకాలన్నీ ఒకచోట చేర్చి అందమైన బాపు బొమ్మతో 'మిట్టూరోడి పుస్తకం' గా అందించారు. ఆ విధంగా ఇది మిట్టూరోడి ఆల్ ఇన్‌వన్. నామిని రచనకు ముగ్ధుడైన బాపు సవినయంగా రాసిన లేఖను సగర్వంగా చివరి అట్టమీద ప్రచురించడం సముచితంగా వుంది. బాపు చిత్రకారుడే గాక అద్భుతమైన దర్శకుడు కూడా కనక ఈ దృశ్యమాన రచనను అంచనా కట్టగల సమర్థులు.

'.... మీరు రాసే పద్ధతీ , మీ ఆలోచనలూ ఇంకోడికి రావు. ఒకో కథ – ముఖ్యంగా 'బతుకు గోరే తల్లి, కుచ్చుంటా కత చదువుతుంటే కలిగిన ఆనందం ఇంతని చెప్పలేను. రోజూ చూసే బతుకులో మీకు ఇంతటి అందం, చమత్కారం కనబడుతోందంటే అది దేవుడిచ్చిన వరం. అది మీ ద్వారా మేము కూడా పంచుకోగలగడం మా అదృష్టం..'

బాపునే బాపురే అనిపించిన నామిని కలం ఆర్ద్రతకు అచ్చమైన రూపం అమ్మ. పచ్చనాకుసాక్షిగా కతల నిండా కొడుకు కలం కళ్లలో ఆమె ఆప్యాయత, అభిమానం, ఆవేదన అడుగడుగునా అగుపించి మనలను చలింపచేస్తాయి, చమరింపచేస్తాయి. అలా అని కృత్రిమమైన సెంటిమెంటులో ముంచడం కాదు – జీవన వాస్తవికతలో కొంతభాగాన్ని పట్టుకోవడం ద్వారానే ఇంతటి ప్రభావం చూపిన బుద్ధిశాలి నామిని. ఎర్రని ఎండలో మా అమ్మ కడుపు అన్న మొదటి కథనమే కడుపులో పేగులు కరిగిస్తుంది. వున్న కాస్త సంగటి కడుపున పుట్టిన తమకే పెట్టేసి అది సరిపోదని సంకట పడుతున్న అమ్మకేసి అదోలా చూస్తే 'తింటావా' అని అడిగి మరో కవళం పెట్టబోతుంది.' నేను నా నోటికడ్డంగా చేయిపెట్టేసి మా అమ్మచేతి కవణాన్ని మా అమ్మ నోటికే అందించినాను' అంటూ ఇచ్చిన ముగింపు! ' ఇదంతా నా కడుపు మంట ' అన్నది రెండో కత. దోసిడి మిరపకాయల్ను రెండు దోసిళ్లనీళ్లలో వేసి వుడకపెట్టడం, ఆ తరువాత వుప్పు పామెయ్యడం. అదే కూర. ఇది తిన్న తర్వాత కడుపులో మంట. అమ్మను నిద్ర పోనివ్వకుండా లేపుతున్న కొడుకును విసుక్కుంటే'కడుపులో ఎండ గాసినట్టు వుండాదమ్మా' అంటాడు వాడు. అప్పుడా తల్లి నిద్దుర కళ్లలోకి నీళ్లు తెచ్చుకుని ' ఈ దీనురాలి కడుపులో ఎందుకు పుడితివిరా అష్టదరిద్రపు కొడకా' అంటుంది. 'మా అమ్మ నా గురించి అట్టా ఏడవటం బలే నాయంగా అనిపించింది నాకు' అంటాడు రచయిత. ఇంకా కొంచెం చెప్పి 'ఆ చీకట్లో నేను మా అమ్మ కండ్లనీళ్లను దప్పిక తాగేసేవాణ్ని' అంటూ ముగిస్తాడు. ఇలాటి ప్రయోగాలు, చిత్రణలూ ఎన్నో! ఇలాటి ఇంట్లో మాంసం కొన్న వైనాలు 'మా ఇంట్లో మాంసం కూర'లో చదివేయాల్సిందే గాని చెబితే చాలదు. మా అమ్మ ఏడుపు పాట, మా ఆవు వంటిదే మా అమ్మ వగైరా కతలు కాయకష్టం చేసే స్త్రీలందరికీ వర్తించేవే.

ఈ శ్రమైక జీవన సౌందర్యంలో భాగస్వామ్యం నామిని కతలకు ఇంత విలువ రావడానికి ప్రధాన కారణం. ఇలాగే చిన్నబడిలో తమతో చదివిన పూదోడు అర్ధంతరంగా జబ్బుచేసి వుబ్బిపోయి చనిపోయిన వైనమూ, అందరినీ ఏడిపించే మరో చురుకైన కుర్రాడు బడి మాని గొడ్లు కాసేందుకు వెళ్లిన వుదంతమూ ప్రతిదీ జీవితంలోంచి నడిచి వచ్చినట్టనిపిస్తాయి.

కొండమీద తన పెండ్లి జరగతా వుండినా గొడ్లు మేపుకుంటూ వుండిపోయిన నాయనకు అంకితమిచ్చిన ' సినబ్బ కతలు' స్కూలు పిలకాయలు, అయ్యోర్లు అందరినీ చూపిస్తుంది. పసి వాడి ఆశలు, ఆలోచనలు, అయిడీలు, ఆడపిల్లలను ఆకర్షించాలనే ఆరాటం, అన్నీ.... ఏదో తరగతిలో ఏదో కనిపెట్టాలన్న ఆరాటంలో... అడవిలో వాన పడినప్పుడు గుడ్డలు తడవకుండా విప్పి గన్నెలో దాచుకుని వచ్చి అదో పెద్ద మంత్రంగా గొప్పలు చెప్పే గుడ్డిపోలియన్ ద గ్రేట్ వంటి తమాషాలు చాలా వుంటాయి.

అమ్మలు, ఆత్మీయుల మధ్య స్నేహాలు సరసాలూ, విరసాలు వగైరాలే మిట్టూరోడి కతలు. పెళ్లయ్యాక మారి పోయాడని అయినోళ్ల చేత అనిపించు కోకుండా వుండేందుకు ఐడెంటిటీ నిలుపు కోవడానికి పడే అగచాట్లూ పాట్లూ ఫీట్లూ ..

మునికన్నడు, వాళ్లమ్మ యెంగటమ్మా, ఆమె పెనిమిటి ఇలా మంతునాయుడు ఇతర కొడుకులూ కిందామీదా పడి నడిపిన జీవన యానం' మునికన్నడి సేద్యం'. ఈ కథలో ప్రతి అక్షరం వారి జీవన పోరాటానికి సజీవ చిత్రణ. మరీ ముఖ్యంగా అహరహం శ్రమించడం తప్ప మరో ధ్యాస లేని మునికన్నడిని చూసి అమ్మ ఆనందమూ ఆవేదనా కలగలిపి స్పందించడం, చివరకు వాళు ఎంతో ఆశగా కౌలుకు తీసుకుని పండించిన మడిచెక్క స్వంతదారు అమ్మేసి నప్పుడు పడిన బాధ ప్రతిదీ జీవితంలోంచి నడిచి వచ్చినట్టే అనిపిస్తుంది. సేద్యం చేయాలని పరితపించిన మునికన్నడు చివరకు ఇటికిరాళ్లు మోసే కూలీగా పోవడం మన వ్యవసాయ జీవితంలో పెను మార్పులకు ప్రతిబింబం. కానైతే నామిని వీటిని అత్యంత సహజంగా జీవద్భాషలో చెప్పడం వల్ల మనం వ్యక్తుల కథగానే చదివేస్తాం! ఇతివృత్తాలూ, పాత్రలూ మాత్రమే కాదు. పదజాలం, మాట్లాడే తీరూ అన్నీ చిత్తూరుజిల్లా మిట్టూరువే. ముది గారం, యలబారడం ,తిరప్తి వంటి మాటలు మనకూ అలవాటై పోతాయి. అక్కడ కక్కడా బూతు మాటలూ, శృంగార పదాలూ దొర్లినా ఎబ్బెట్టు అనుకోకుండా లీనమై పోతాం.

మొత్తంపైన మిట్టూరోడి పుస్తకం వెల 180 రు. అయినా సాహిత్యాసక్తి, ఆర్థిక శక్తి వున్న ప్రతివారి దగ్గరా వుండదగింది. తెలుగు సాహిత్యంలో అదో అరుదైన వరవడి. అన్నిటికన్నా ముందు అమరావతి కథలూ – తర్వాతి కాలంలో మా పసలపూడి కథలు, ప్రళయ కావేరీ కథలు, పోలేరమ్మ బండ కథలు, వగైరాలు ఒకానొక భౌగోళిక సాంస్కృతిక నేపథ్యంలో జన జీవనాలకు అద్దం పడతాయి. అదే వాటి ప్రత్యేకత కూడా. నామిని కథలు పాఠకులకే గాక రచయితలకు కూడా చాలా ప్రయోజనకరమైనవి. జీవిత వీక్షణకు అవి మార్గాలు చూపుతాయి.

---

## ఇది చరిత్ర చెప్పిన సత్యం

**డా॥ వి. వీరాచారి**

మొన్న స్వతంత్ర భారతమ్మకు
షష్టిపూర్తి చేశాం
సంప్రదాయానికేం కొదవలేదు
హమేషా సాగుతూనే వుంటుంది
పైన పటారం లోనే లొటారం
ఇదే కదా మన ఆచారం!

నాకు తెలుసు ఆచారాన్ని ప్రశ్నిస్తే
అసురులవుతారని
నన్ను రాక్షసుడన్నా ఫరవాలేదు
ఇవ్వాల ఆచారాన్ని ప్రశ్నిస్తున్నాను
కణ కణమండే ఆలోచనల
నిప్పుకణికల్లో కడిగేయాలను కున్నాను

ఇన్నాళ్ళ నామౌనం!
నా అసమర్థకు చిహ్నమైంది
ఒకటా రెండా అరవై ఏండ్లు
ఎదురు చూశాను
వీర తెలంగాణ నిప్పురవ్వల్ని రాజేసినోన్ని
కరుకు నిజాం గుండెను నీరుగా చేసినోన్ని
బందూకం చేతబట్టి
బాధ్యతల్ని నేరవేర్చినోన్ని

తెల్లోడు పోయిండంటే ఎన్నో కలలతో
తెల్ల కలువనై జనంలో కలసినోన్ని...
అన్నా! నీవు నాలాగే నల్లోని వైవుండి
తెల్లోని తరికి అయిపోతుంటే
నిజాంతరికి నీల్గుతుంటే ఒకటా రెండా
అరవైఏండ్ల నుంచి మౌనంగా భరించాను

భూసంస్కరణ! గరిబ్‌హటావో అంటివి
బ్యాంకులు జాతీయకరణ! రైతే రాజంటివి
ఎన్ని సంస్కరణలు! ఎన్ని సంక్షేమపథకాలు
ఒక్కటన్నా నాకన్నీళ్ళు తుడిచిందా?
నా కలలను పండించిందా?
పేరునాది! ఊరు నీది
ఓటునాది! సీటు నీది
ఆకలినాది! అధికారం నీది
తూర్పు దిక్కు చూస్తూ వెలుగుకై నిరీక్షించి
నిరీక్షించి నిప్పు కణికనైనాను
ప్రజాబందూకునైనాను
అన్నా ఇప్పటికైనా కళ్ళు తెరువు.
బషీరాబాగ్‌లో భుజం కలపినోడివి
ముదిగొండలో బందూకువైతే ఎట్లా
లాటి ఎత్తిన అధికారం! తూటాలైన రాజ్యం!
చరిత్రలో నిల్చిన దాఖలాలు లేవు...
ఉవ్వెత్తున లేచిన ఈ భూపోరాటం
అరవైఏండ్ల స్వాతంత్ర్య వైఫల్య ఫలితం
నీవు పెంచి పోషించిన భూరాకాసుల
నీవు పెట్టని కోటగా నిల్చిన రియల్టర్ల
గుట్టు రట్టు చేయడానికి
కదలిన ప్రజా ఉద్యమం...

అన్నా! ఆయుధం ఆత్మరక్షణకే కానీ
అధికార పరిరక్షణకు కాదు
హిట్లర్, నెపోలియన్ ముసోలిన్ నిజాం
సూర్యడస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం

చరిత్రలో ఎవ్వడూ! ఏ అధికారం
ఆయుధంతో ఆయుషుపోసుకోలేదు.
ఇది చరిత్ర చెప్పిన సత్యం
ధరిత్రి నిల్చిన నిజం.
ఇది మాయిజం! మా నైజం!
ఇది ప్రజా ఉద్యమం!

## నచ్చిన రచన

# కొన్ని కలలు కొన్ని మెలకువలు

**'విద్యానుభవం' దాని నిజమైన అర్థంలో ఎప్పటికీ కొత్త భూమినీ, కొత్త భూమికనీ కనుగొనడమే. మానవత్వ పరిమళం పాఠశాలలో విరియాలి.**




## టి.రత్నమయ్య

**వా**డ్రేవు చిన వీరభద్రుడు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థలో చదివిన మొదటితరం గ్రామీణ విద్యార్థి. కళాశాల విద్య పూర్తి అయిన తరువాత ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగిగా నియమితుడైనాడు. శిక్షణా కాలమందు గిరిజనాభివృద్ధి సంస్థలో గిరిజన విద్యా సంస్థలు, కార్యాలయాలు, పనితీరుపై అధ్యయనం చేసి 'నివేదిక' తయారుచేశారు. కర్నూలు జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమంలో వనరుల కల్పన విభాగంలో పనిచేసినాడు. తరువాత ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన విద్యాసంస్థల అభివృద్ధికి ప్రణాళికను రచించి అమలు పరిచారు. వినూత్న కార్యక్రమాలు రూపొందించుటలో, అమలు పరుచుటలో ఎన్నో విజయాలను, అపజయాలను చవిచూశారు.

విద్యా సంబంధిత ప్రపంచ స్థాయి ప్రామాణిక గ్రంథాలన్నిటిని సమగ్ర అధ్యయనం చేశారు. విద్యావేత్తల మనోభావాలు తెలుసుకున్నారు. వీరు రూపొందించిన విద్యా విధానాలను అమలు పరచు క్రమంలో తన అనుభవాలను "సార్వత్రిక విద్యతో నా అనుభవాలు" అను శీర్షికన రచనను కొనసాగించారు. పచ్చని పూల పర్వతాల మధ్య, నీలి మేఘాల నీడన, లేగదూడల ప్రక్కన తన బాల్యాన్ని గడిపారు. ఆ అనుభవాలసారంగా తయారైన ఈ పుస్తకంలో ఎన్నో విషయాలు ఆర్ద్రంగా చెప్పగలిగారు.

**విద్య :** అన్నిటికన్నా విలువైనది తన తోటి మనిషికి ఇవ్వగలిగేది విద్య మాత్రమే. పక్షి తన తోటి పక్షికి రెక్కలతో ఎగరడం నేర్పినట్లుగా విద్యను అందించాలి.

మనిషి తన మానవత్వాన్ని, తను ఏ మూలాధారం వల్ల తనని తాను మానవుడిగా గుర్తిస్తున్నాడో ఆ అత్యంత మౌలిక సారాంశాన్ని తన తోటి మనిషికి అందిస్తాడు. అదే విద్య –

అన్ని ప్రాణులు తమ సంతతికి అందించేది నైపుణ్యం. అది జీవించడానికి, ఆ నైపుణ్య మనుగడకు అవసరమైన నేర్పరితనం మాత్రమే ఇస్తుంది. ఈ నైపుణ్యం విద్యలో అంతర్భాగం. ఉదా : సాలీడు తన సంతతికి గూడు అల్లడాన్ని, తేనెటీగ తేనె కూడబెట్టడాన్ని నేర్పుతూ వస్తున్నాయి. అది తమ జాతి జీవ లక్షణం. భిన్నమైన లక్షణాల్ని అది నేర్చుకోలేదు. భిన్నమైన లక్షణాల్ని విద్య ద్వారా మనం పొందగలం.

విద్య అంటే ఒక తరం మరొక తరానికి జీవన సంస్కృతిని అందించడం. జీవించడంలోని ఆనందాన్ని అనుభవించడాన్ని నేర్చుకోవడం. సంస్కృతి అంటే లలిత కళల్ని ఆస్వాదించ గల్గి, ఆనందించగల్గడం. ఎదుటి మనిషిని కూడా కలుపుకొని సామరస్య పూర్వకంగా తమకై తామొక ప్రపంచాన్ని నిర్మించుకోగల్గడం సంస్కృతి వల్ల మాత్రమే సాధ్యపడుతుంది. ప్రతి కదలికలోనూ తోటి మానవుని పట్ల అపార అనుభవం తొణికిస లాడాలి. మనం గడిపే ప్రతి క్షణం, తలపు, మాట, చేత ఒక శివానందలహరి కావాలి. తాము జీవిస్తున్నందుకు తమ చుట్టూ ప్రపంచంలో పూలతోటలు, సెలయేళ్ళు, నీలి మబ్బులు, తూనీగలు, పిల్లల నవ్వులు పొంగి పోతున్నందుకు మహదానంద పరవశులం కావాలి.

'విద్యానుభవం' దాని నిజమైన అర్థంలో ఎప్పటికీ కొత్త భూమినీ, కొత్త భూమికనీ కనుగొనడమే. మానవత్వ పరిమళం పాఠశాలలో విరియాలి.

**క్వాంటిటీ :** విద్యా సౌకర్యాలు, భౌతిక విషయాలకు సంబంధించిన అంశం. 'అందరికీ విద్య' లక్ష్య సాధనలో భాగంగా అందరికీ పాఠశాలలు తెరవాలి. ఉదాహరణ భవనాలు వగైరా కావాలి.

**క్వాలిటీ :** సుశిక్షితులైన ఉపాధ్యాయులు, ఉత్తమ బోధనా పద్ధతులు, చక్కని అభ్యసన ప్రక్రియలు, నిరంతర మూల్యాంకనం.

**ఈక్వాలిటీ :** ఉత్తమ విద్య అన్ని సామాజిక వర్గాలకు సమానంగా అందడానికి సంబంధించిన అంశం. ఉదా : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయములు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అల్పాదాయ వర్గాల కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థుల్ని వెలికి తీసి వారికి ఉత్తమ విద్య అందించడం.

**బేసిక్ ఎడ్యుకేషన్ :** పాఠశాల కార్యక్రమంలో కొంత కాయిక శ్రమనూ, ఉత్పాదక శ్రమనూ మేళవించాలి.

**లెర్నింగ్ సొసైటీ :** పాఠశాలను, పాఠశాల చుట్టూ ఉండే భౌతిక, సామాజిక పరిసరాలకు సన్నిహితంగా తీసుకుపోవడం.

**లెర్నింగ్ టు బి :** మనిషి తన అస్తిత్వాన్ని అంగీకరించడమెట్లానో నేర్చుకోవడం.

**లెర్నింగ్ టు నో :** మనిషి తనకై తను ప్రయాణించడం, తనకై తను రెక్కలు సాధించుకుని విజ్ఞాన వీధుల్లో ఎగరగల్గడం. లెర్నింగ్ టు డు : జ్ఞానం నైపుణ్యంగా మారడం, జ్ఞానశక్తి క్రియాశక్తిగా మారడం.

**లెర్నింగ్ టు లివ్ టుగెదర్** : అంటే మనుషులు ఒకరితో ఒకరు సహజీవనం చేయడం ఎలాగో నేర్పడం.

**సహజీవనం అంటే :** మనుషులు ఒకరినొకరు అర్థం చేసుకోవడాన్ని, కలసి మెలసి జీవించడాన్నీ నేర్వడమెట్లానో 'విద్య' నేర్పుతుంది.

**గుణాత్మకత :** మనం రోజూ చేసే పనులనే నిన్న చేసినదానికన్నా ఈ రోజు మరింత మెరుగ్గా చేయగలమేమో చూద్దామని ప్రయత్నించడం.

**Rousseau - 'Emily'** అనే గ్రంథంలో 'విద్య"కు నిర్వచనం.

శిశువులో నిద్రాణంగా ఉన్న ప్రాకృతిక సహజ సామర్థ్యాలు తమకై తాము మేల్కొని ఉండేదాకా ఉపాధ్యాయుడు అత్యంత సహనంతో వేచి వుండాలి. అప్పుడు పిల్లవాడిలో సంభవించే వికాసమే విద్య.

**సామర్థ్య క్షేత్రం (Cognative domine) :** పుస్తక విద్య (భాష, గణితం, ప.వి)

**భావావేశ క్షేత్రం (Emotive domine)** : సహ పాఠ్య అంశాలు, ఆటలు, వ్యాయామం

**మానసిక – శారీరక చలనక్షేత్రం (Psycho Motor domine):** అదనపు పాఠ్య కార్యక్రమాలు – సాంస్కృతిక కార్యక్రమాలు, యాత్రలు, తోటపని ప్రాథమిక పాఠశాలలు 60%–40%, ప్రాథమికోన్నత 70% – 30%, ఉన్నత పాఠశాలలు 75%–25%.

పఠనం. వ్రాత, గణితం లేని ప్రాథమిక విద్యాబోధన సంపూర్ణమనిపించుకోదు. బాలలకు సరిగ్గా అక్షరాలు నేర్చుకునే యోగ్యత కలిగినపుడే పఠనం జరపాలి. వ్రాత దాన్ని అనుసరించే ఒక ప్రక్రియ. దస్తూరి ఒక కళ. చిత్రకారుడు బొమ్మలను వేసేటంత శ్రద్ధతో ప్రతి అక్షరాన్నీ కుదురుగా వ్రాయాలి.

**పూర్వ ప్రాథమిక పాఠశాల విద్య :** పిల్లల తొలి అభ్యాసనం వస్తువుల చుట్టూ, రంగుల చుట్టూ, ఆటపాటల చుట్టూ అల్లుకుంటుంది.

**పిల్లలు :** పిల్లల అల్లరి నిజానికి అల్లరి కాదు. అది ప్రకృతి వాళ్ళకు ఇచ్చిన వరం. ఆ చలనశీలత్వం వల్లనే వాళ్ళు ఏదో ఒక కొత్తదనానికో, కొత్త కోణానికో తమ నేత్రాల్ని తెరుచుకుంటూ ఉంటారనీ, ఆ ఆకతాయితనం వల్లనే ఎప్పుడు ఏదో కొత్త ప్రపంచపు తలుపు తట్టే అవకాశం పొందబోతున్నారని.... ఆ అల్లరిలో చూడాలి.

పిల్లల మంచి నడవడిపై దృష్టి పెట్టాలి. ఆరోగ్యం గురించి, పారిశుధ్యం గురించి దృష్టాంత పూర్వకంగా పాఠాలు నేర్చుకోవాలి. అనుభవజ్ఞానంతో ఇళ్ళకు చేరాలి. బలవంతంగా చెప్పే చదువుకన్నా, పిల్లలకు ఇష్టమైన పద్ధతిలో చదువు చెప్పే పద్ధతిని అన్వేషించాలి.

ప్రతి విద్యార్థికీ కుతూహలం ఆరకుండా ప్రజ్వలింప చేయగల సహనశీలురైన ఉపాధ్యాయులు అవసరం. విద్య అందించడం పువ్వులు పూయడానికి మనమొక తోట పెంచడం వంటిది. ఉపాధ్యాయుల కృషి. ప్రతి శిశువుకు తన శక్తి సామర్థ్యాల్నీ నిజం చేసుకునే హక్కు, తన భవిష్యత్తును తను నిర్మించుకోగలననే నమ్మకం, ఎరుకతో కూడిన అనుభవం పాఠశాల అందిస్తుంది. పిల్లవాడిని బహుముఖంగా తీర్చిదిద్దడానికి పాఠశాల ఉత్తమ సాధనం. చదువుతో పాటు క్రమశిక్షణ అందివ్వాలి.

**(పూర్వపు గురుకులాలు)**

**'మోదుగ' గిరిజన పాఠశాల దినచర్య :**

ఆ పాఠశాల పిల్లలు పొద్దున్నే లేచి నెమ్మదిగా ఆ ఎండ వెచ్చదనాన్ని అనుభవిస్తూ అక్కడ కొండవాలులో ప్రవహించే ఏటిదాకా నడుచుకుంటూ పోయేవారు. ఆ ఏరు సన్నని కలస్వరంతో ప్రవహిస్తూ ఉండేది. దాని తేమ ఇసుక మీద బంగారం పోసినట్లు సూర్యరశ్మి పరచుకొనేది. దాని ఇరువైపుల అల్లుకున్న పొదల్లోంచీ, తీగల మీదనుంచో, చెట్ల గుబుర్లలోంచీ తెల్లని బాణాల్లా సూర్య కిరణాలు సూటిగా భూమిని తాకుతుండేవి. ఆ కొమ్మల మీద రకరకాల పక్షులు. ఆకుపచ్చ వన్నెవి, పసుపు వన్నెవి, ధూపర వర్ణానివి, రెక్కలల్లార్చుకునేవి, కిచకిచలాడేవి. ఆ పైన ఆకాశంలో రివ్వున సంధించిన శరంలా ఎగిరిపోయేవి. పిల్లలు కూడా ఆ పిట్టల్నీ, ఆ గాలుల్నీ తాకుతూ, ఆ తీగల్నీ, ఆ పువ్వుల్నీ పక్కకు తోసుకుంటూ ముఖాలు కడుక్కునే వారు. ఆ ఏట్లో మునిగి తేలేవారు. ఈతలు కొట్టేవారు. పిల్లలకు నిర్భయత్వాన్ని నేర్పవలసినది పాఠశాలయే.

పాఠశాల చుట్టూ ఆకర్షవంతమైన వాతావరణం నిర్మించాలి. ఆటవస్తువులు ఏర్పాటు చేయడం, తరగతి గదిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం, లెర్నింగ్ బోర్డు ఏర్పాటు చేయడం, ప్రాథమిక పాఠశాలకు అంగన్‌వాడీ కేంద్ర సమన్వయం. పాఠశాల కూడా ఇంటి బాధ్యతను నిర్వహించాలి. పాఠశాల కార్యక్రమాలు ఇంటి పనుల్లానే సాగాలి. దండనకు దూరంగా ఉండాలి. తుంటరి పనులు చేస్తే హెచ్చరించాలి. పాఠశాల అసెంబ్లీ పాఠశాలకు గుండెకాయ లాంటిది. అసెంబ్లీలో మనం పాఠశాల మొత్తాన్ని చూడవచ్చు. ఆ రోజు చేయవలసిన కార్యక్రమాలకు దిశానిర్దేశం లభిస్తుంది. ఇలా అందరినీ మరోచోట మరో సమయంలో మనం చూడలేము. అసెంబ్లీ అంటే అన్ని వర్గాల వేదిక. అక్కడ మనకు నిజమైన పాఠశాల ముఖచిత్రం ఆవిష్కృతమవుతుంది. మనకు అందరి భావాలు తెలుస్తాయి. ఎందరి ప్రతిభలో ప్రదర్శితమవుతాయి. పాఠశాల కార్యకలాపాలు వెల్లడవుతాయి. విద్యాలయ గమనాన్ని గమనించవచ్చు.

పాఠశాలలో చదువు ఒక్కటే సర్వస్వం కారాదు. ఆట, పాట వంటి సహపాఠ్య, పాఠ్యేతర కార్యక్రమాలు ఎక్కువగా జరగాలి. ఇలాంటి కార్యక్రమాల వల్ల వారి అభిరుచికి తగిన అంశంలో రాణిస్తారు. వారికంటూ ఒక గుర్తింపు లభిస్తుంది. సమగ్ర మూర్తిమత్వ వికాసం జరుగుతుంది.

**ఉపాధ్యాయుడు :** బోధించే వాచకం కన్నా, దాన్ని బోధిస్తున్న ఉపాధ్యాయుడు మరింత ఉన్నతంగా కనబడినపుడే అతడు బోధిస్తున్న పాఠశాల ఆదర్శ పాఠశాల అవుతుంది. ఉపాధ్యాయుడు అంటే ఒక అభినయవేత్త. సృజనాత్మక కళాకారుడు. తన పని పట్ల తను అత్యంత వ్యామోహంతో అంకితం కావడం. అతడు పనిచేస్తున్న ఆవాస ప్రాంతములో అతడే అందరికన్నా ముఖ్యమైన వ్యక్తిగా ఉండవలసిన వాడు. అతన్ని పిల్లల తల్లి దండ్రులు ఏమడిగినా అందుకు సమాధానంతో సంసిద్ధుడిగా ఉండవలసిన వ్యక్తి.

**సంకల్పం – సామర్థ్యం :** సంకల్పం మార్పుకి ఒక పార్శ్వం కాగా, సామర్థ్యం మరొక పార్శ్వం. కానీ సంకల్పం దృఢపడకుండా సామర్థ్యాన్ని నిర్మించలేం. సంకల్పం దృఢపడకుండా మనం ఎటువంటి శిక్షణ యిచ్చినా అది నిరుపయోగం కాక తప్పదు.

**ప్రణాళిక :** తను చేయవలసిన పనిని నిర్దిష్టంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించుకున్న ఏ వ్యక్తి కూడా ఆ పనిని వాయిదా వేయాలనుకోడు. నేడు వాయిదా వేసిన పనిని రేపు తిరిగి తప్పక చేయవలసి వుంటుంది అని అతనికి ఎరుకే. తమ పనిని తాము సకాలంలో సక్రమంగా నెరవేర్చుకోగల సామర్థ్యాన్ని వారికి అందించవలసిన బాధ్యత సంస్థదే.

నిరంతరం చిన్నారి పిల్లలతో సహజీవనం ఉపాధ్యాయునిలో మానవత్వాన్ని మరుగుపడనీయదు.

**ఉపాధ్యాయులు :** ఉపాధ్యాయునికి సామర్థ్యం కొరత అయినందువల్ల కాక, అతని మనస్సును తట్టి లేపనందువల్ల మాత్రమే పాఠశాలలు నిస్తేజంగా వున్నాయి. ఒకసారంటూ అతడి మనసుని స్పృశించి మేల్కొల్పాక ఇక తక్కిన వారు చేయవలసినదంటూ ఏమీ ఉండదు. అంతా తన మనోబలంతో ఉపాధ్యాయుడే నడుపుకుంటూ పోగల్గుతాడు.

పిల్లలు బడిలో క్రియాశీలకంగా పాల్గొనేటందుకు వీలుగా తరగతి గదిని, బోధనాభ్యసన ప్రక్రియను ఆకర్షవంతం చేయడం, అభ్యసన సామాగ్రిని రూపొందించడం ఉపాధ్యాయుడి కర్తవ్యం.

ప్రతి ఉపాధ్యాయుడు తన జీవితంలోని అత్యంత అమూల్యమైన ఉత్పాదక సమయాన్ని విద్యార్థుల కోసం ధారపోయాలి. పిల్లలకు జ్ఞానాన్ని, విలువల్నీ, ధర్మాల్నీ బోధించడం తమ జీవికగా మారిపోవాలి.

అభ్యసన కృత్యాలను కల్పించేటపుడు ముందుగా పిల్లలను అధ్యయనం చేయాలి. వారిని భాగస్వాములుగా చెయ్యాలి. చిన్న చిన్న గీతాల ద్వారా వారికి మంచి బుద్ధులు నేర్పాలి.

విద్యార్థులను నిశితంగా పరిశీలించాలి. నిత్య పఠనశీలిగా ఉండాలి. మన వ్యూహం ఏమిటో టీచర్స్ డైరీలో ఉండాలి. నల్లబల్లపై మనం ఏం రాస్తున్నామనేది ఎంత ప్రధానమో, ఎలా వ్రాస్తున్నామనేది అంతే ప్రధానం. విద్యార్థి మానసిక స్థితిగతులను గుర్తించి పాఠం చెప్పాలి. పిల్లవాడికి ఈత నేర్పించేటపుడు వాడి స్థాయిని బట్టి చేయి ఎలా అందిస్తామో అలాగే పిల్లలు కృత్యాలు చేస్తున్నపుడు విద్యార్థులతో కలిసి జ్ఞానసాగరాన్ని ఈదడంలో ఉండే మాధుర్యాన్ని రుచి చూడాలి.

**సమాజం :** పిల్లవాడికి చక్కని విద్యనందించగలిగేది మొదట ఇల్లే. కానీ పిల్లవాడి వికాసానికి అనువైన పరిస్థితులు ఇంట్లో లభించనపుడు పాఠశాల అందించవలసి ఉంటుంది. సమాజం తన వంతు పాత్ర అది నిర్వహిస్తుంది. సామాజిక భాగస్వామ్యం లేకుండా, సమాజానికొక ఆతృతను కలిగించకుండా క్రొత్త విద్యావిధానం గురించి మాట్లాడటం వల్ల ప్రయోజనం ఉండదు. ఏ సామాజిక కార్యక్రమములోనైనా సరే నిపుణుడెప్పుడూ ఫెసిలిటేటర్‌గానే ఉండాలి తప్ప నాయకత్వ బాధ్యతను స్వీకరించ కూడదు. సమాజం నుంచి ప్రభవించి, సమాజం తనకై తాను ఎంచుకున్న ప్రణాళికై ఉండాలి. సమాజం సూక్ష్మ స్థాయిలో భాగస్వామ్యం అయినపుడు భవిష్యత్తులో కూడా తమంతట తామే కొనసాగగలిగే శక్తిని పొందుతాయి. ప్రతి పాఠశాల తన సంస్థాగత ప్రణాళిక రూప కల్పనలో ఆవాస సమాజాన్ని భాగస్వామిగా చేసుకోవాలి. సార్వత్రిక విద్యా ఉద్యమంలో సమాజమే అందరికన్నా పెద్ద భాగస్వామి. మనఃపూర్వకంగా సంకల్పించాలి. కలిసికట్టుగా పనిచేయాలి.

**ప్రభుత్వం :** ఒక పాఠశాలను ఎంపిక చేసుకుని దాన్ని ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దితే దాని ప్రభావానికి తక్కిన పాఠశాలలు మేల్కొంటాయి. ఏ పాఠశాలకైనా తనకు అనుకూలమైన పాఠ్య ప్రణాళికను ఎంచుకొనే స్వేచ్ఛ ఉండాలి.

గతంలో ఏ చిన్న పనిని ఎవరు వదిలి పెట్టినా వారిని ఎత్తి చూపే సమీక్ష ఉండేది. ఇపుడు ఏ చిన్న ప్రగతి కనబడినా పైకెత్తి చూపే వైఖరిని అలవరచుకుంది. ఉద్యోగులు వార్షిక ఇంక్రిమెంట్ల కోసమో, పదోన్నతుల కోసమో తమ పనితీరును మెరుగుపరచుకోరనేది జగమెరిగిన సత్యం. తమ ఆత్మానందం కోసమో, తమ పనితీరును మెరుగుపరచు కుంటారని జగమెరిగిన సత్యం. ఏ ఉద్యోగి అయినా ఎవరో ఒకరు తన పనిని చూస్తున్నారనీ, తన ఏ చిన్ని ప్రయత్నానికైనా తనను వెన్నుతట్టి ప్రోత్సహిస్తారని నమ్మకం ఉంటే తప్పక తమ పని తీరును మెరుగుపరచుకోవడానికి సిద్ధపడతారు.

అభ్యసన వాతావరణం మెరుగు పరచడం, ఉపాధ్యాయుల సంసిద్ధతను, అంకితభావాన్ని వికసింప చేయడం, అన్ని వర్గాల వారికి సమాన అవకాశాన్ని అందించడం, విద్యపై పెట్టుబడి పెంచడం చేయాలి. పాఠశాలలను తరచు సందర్శిస్తూ ఉండాలి.

**ముగింపు :** ఎంత త్వరగా ప్రజా సమూహాల్లో చైతన్యం, విద్య వ్యాప్తి చెందుతాయో అంత త్వరగా జాతులు అభివృద్ధి చెందుతాయి. పిల్లవాడు తరగతి గదిలో చక్కగా రాణించాలంటే అతడి తరగతి గది బయట జీవితాన్ని కూడా పాఠశాల అవగాహన చేసుకోవాల్సి వుంటుంది.

మన మన వ్యక్తిగత దర్శనాలు, విద్య పట్ల మనకి కలిగిస్తున్న కలల్ని, మన మన వ్యక్తిగత అనుభవాలు మనకి కలిగిస్తూ వచ్చిన మెలకువల్ని మనమొకరితో ఒకరం పంచు కుంటే ఇప్పుడున్న దానికన్నా మరింత బలపడతాం. మనం జీవిస్తున్న సమాజాన్ని, ప్రపంచాన్ని మరింత బలపర్చుకోగలుగుతాం.

ఇలాంటి చక్కటి భావాలతో కూడిన ఈ పుస్తకం అత్యంత ప్రయోజనకరమైంది.

సాహితీ ప్రస్థానం పాఠకులకు, సాహితీ మిత్రులకు
ఉగాది శుభాకాంక్షలతో...
సత్యదేవ్ గ్రానైట్స్
తెల్దారుపల్లి, ఖమ్మం రూరల్ (మం)

## నివాళి

ప్రముఖ రచయిత, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట యోధుడు తిరునగరి రామాంజనేయులు మార్చి 13న మృతి చెందారు. వారు జ్వలిత జ్వాల, రగులుతున్న కొలిమి (కవితాసంపుటాలు) బందగీ, తెలంగాణా వీరయోధులు, కన్నెగంటి హన్మంతు (బుర్రకథలు) రాష్ట్రవాంఛ, అల్లూరి (గొల్లసుద్దులు) కష్టజీవి (హరికథ) వీరతెలంగాణా నాటకం, వీర కుంకుమనాటిక, రైతు బాగోతం నృత్య నాటిక, సంగం నవల వంటి పలు పుస్తకాలు రాశారు.

తెలంగాణా గోర్కీగా పిలవబడ్డ తిరునగరి కి నివాళి అర్పిస్తూ.. 1973లో విశాలాంధ్ర ప్రచురించిన తెలంగాణా పోరాట గేయాలు ముందుమాట ను ప్రచురిస్తున్నాం.



# నేను సైతం కవిని అయ్యాను

### - తిరునగరి రామాంజనేయులు

అసలు నేను కవిని కాను. తెలంగాణా సాయుధ పోరాటం నా చేత కలం పట్టించింది. కవిని చేసింది. గాయకుణ్ని చేసింది. నాయకుణ్ని చేసింది.

మాది పలనాడు. నేను గాంధేయ వాదిని. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాను. అక్కడుంటే తీవ్ర రాజకీయాల్లో పాల్గొని ప్రభుత్వ నిర్బంధానికి గురి అవుతానేమోనన్న భయంతో నా తల్లిదండ్రులు నన్ను అత్తవారింటికి పంపారు.

మా అత్తవారిది తెలంగాణం. తెలంగాణా ఆంధ్రోద్యమానికి కొత్త మలుపు యిచ్చిన, అష్టమాంధ్ర మహాసభ అధ్యక్ష పీఠం నుంచి రావి నారాయణరెడ్డిగారు కొత్త పిలుపు యిచ్చిన చిల్కూరు మా అత్తవారి ఊరు.

నేను గాంధేయవాదినే అయినా కమ్యూనిస్టులతో స్నేహం వుండేది. అత్తవారింటికి బయలు దేరేముందు వారు నా చేత "ప్రజాశక్తి" చందాకట్టించారు. బ్రిటిషు వారిమీద కసితో, స్వాతంత్ర్యంకోసం తహతహతో, ప్రజాశక్తి చందాతో, నూత్న యవ్వనంతో నేను 1943 తొలి రోజుల్లో చిలుకూరులో ప్రవేశించాను.

అక్కడి ప్రజా జీవితం చూచేసరికి గుండెలవిసిపోయాయి. తలతిరిగిపోయింది. ప్రజలంతా గ్రామంలోని నలుగురైదుగురు పెత్తందార్లకు బానిసలై బ్రతుకుతున్నారు. దారుణమైన వెట్టిచాకిరి, అంతకన్నా దారుణమైన అధికార్లజులుం, నిత్యం తన్నులు, తిట్లు కచ్చేరిచావిళ్ల వద్ద వంగబెట్టి మూపున బండలు, బండలేకాదు, రైతుల మూపున గ్రామవెట్టి వానిని ఎక్కించి తొక్కించేవారు. పండిన పంటనంతా "లెవీ" లనీ, "తావాను" లనీ, "నాగూలనీ" "నజరానా" లనీ దోచుకునే వారు. ఆరు నెలలకాలంలోనే మహా ఘనత వహించిన నిజాం నవాబుగారి నరకాసుర పరిపాలనను నేను కూడా అనుభవించాను.

అప్పటికి జనగామ తాలూకాలో లంబాడీ రైతుల పోరాటం సాగుతూ వుంది. దొరలపెత్తందార్ల జులుము నెదిరించి ప్రజలు సాగించే పోరాటాలు నాకు ఉత్తేజాన్ని కలిగించాయి. నాలాగే ఉత్తేజం పొందిన కొందరు మిత్రులతో ఆలోచించి, తాలూకాలో ఆంధ్రమహా సభను నిర్మించడానికి ఉద్యమించాం. అలాగ నేను ఆంధ్ర మహాసభ కార్యకర్తనైపోయాను.

### కవిత్వానికి ప్రేరణ

నాకు కవిత్వం అల్లడం రాదు కాని పాటలు పాడేవాడిని – బాగా పాడుతానని అంతా మెచ్చుకునేవారు. సంఘం ప్రచారకోసం గ్రామాలకు వెళ్ళినప్పుడు ప్రజా సమస్యల మీద ఉపన్యాసాలకన్న పాటలు ప్రజల మనసులకు బాగా హత్తుకొనేవి. కాని అప్పటికి ప్రచారపు పాటలు ఎక్కువలేవు. దాశరథి రాసిన రెండే రెండు ప్రబోధగీతాలు ప్రచారంలో వుండేవి. "ఆంధ్రమహాసభ కరుగుదెంచండీ – జనులార మీరూ" అనేది అందులో ఒకటి. అదే పాట మేం పాడేవారం. తాలూకాలోని ముఖ్య కార్యకర్తలం మేమే. అందుకే, ఎక్కడికి వెళ్ళినా మీటింగుల్లో ఉపన్యాసాలివ్వడం, పాటలు పాడడం, రెండూ మేమే చేసేవారం.

అప్పటికి సుంకర సత్య నారాయణగారు రాసిన "కష్టజీవి" బుర్రకథకు మంచి ప్రజాదరణ వుండేది. ఉపన్యాసాల తర్వాత నేనూ, దొడ్డా నర్సయ్య, కోట నారాయణ బుర్రకథ దళంగా మారిపోయే వారం. పుస్తకం చేత పట్టుకొని చదువుతూ బుర్రకథ చెప్పేవారం.

దాశరథిగారి ప్రబోధ గేయాలు తప్ప మరొక పాట లేనందువల్ల వినేవారికేమో కాని పాడేవారికి మాకే విసుగు పుట్టింది. కొత్తపాట వుంటే బాగుండుననిపించింది. ఎవరు రాస్తారు పాట. శ్రీశ్రీ గారి "పదండి ముందుకు పదండి తోసుకు" అనే మహా ప్రస్థానగీతం అంటే నాకెంతో అభిమానం. శ్రీశ్రీగారి బాణీ, దాశరథి గారి ప్రబోధం జోడిస్తే బాగుండుననిపించింది. గొంతులో రాగం మెదిలింది. మాటలు కదిలాయి. ఒక గేయం పుట్టింది.

ఆంధ్ర మహాసభ
ఆంధ్ర మహాసభ
ఆంధ్ర మహాసభ అదిగదిగో
చంద్రకిరణకళ
ఇంద్ర ధనస్సున
ఆంధ్ర స్టేటులో వెలిసిందీ.

ఇది నా తొలికవిత. ఈపాటను సభల్లో పాడుతూ వుంటే ప్రజలు చేసే హర్షధ్వానాలకు ఉప్పొంగి పోయేవాడిని. ఒక కొత్త ఉత్సాహం వచ్చింది. ఆ ఉత్సాహంతో ఆంధ్ర మహాసభ మీద మరొక గేయం రాశాను.

ఎక్కు బాబా! పడవెక్కు బాబా!
ఆంధ్ర మహాసభకు పడవెక్కు బాబా!
చుక్కాని బట్టె రావినారాయణరెడ్డి
పెద్ద తెరచాప బట్టె బద్దం ఎల్లారెడ్డి
గడలు పట్టిరి కార్యకర్తలు ప్రాణాలొడ్డి
కదులుతుందీ పడవ గమ్యస్థానముచేరు.
॥ఎక్కుబాబా॥



ఈ పాట జిల్లా అంతటా పాకి పోయింది. నా పాటను ఎందరో పాడడం విన్న నాకు ఉత్సాహం ఇనుమడించి, ఆత్మవిశ్వాసం కలిగింది. ప్రజల సమస్యలను ఒక్క పాటల ద్వారానేకాక అనేక ఇతర కళారూపాల ద్వారా వివరించడం అవసరం అని అనుభవం ద్వారా తెలుసుకున్నాం. తెలంగాణా మీద అప్పటికే ఎందరో కవులు కవితలల్లారు. కాని అవి స్థానిక సమస్యల వ్యక్తీకరణలేనందువల్ల మాకు పనికిరాలేదు. అందుకని వివిధ రూపాలలో రచనకు నేనే నడుము బిగించవలసివచ్చింది.

కవితకు ఏదో ఛందస్సు వుంటుందని విన్నాను, కాని ఆ ఛందస్సు తలా తోకా నాకు తెలియదు. గురువులు, లఘువులు, గణాలు అన్నపేర్లు విన్నానేకాని, వాటి రూపం తెలియదు. నాకు నచ్చిన భాష అంతంత మాత్రం. సమాసాలు, అలంకారాలు లాంటివేవో కవిత్వానికుంటాయని విన్నాను. అవేవీ నాకు రావు. నాకు తెలిసిందల్లా ఒక్కటే. అది పాట తాళం తప్పకుండా పాడే మెలకువ. అదే నా కవితా రచనకు ప్రధానశక్తి అయింది.

నేను ఏ విషయాలనైతే ప్రజలకు చెప్పాలనుకున్నానో ఆ విషయాల నన్నింటినీ పాటలలో కట్టగలిగాను. ఆనాడు ప్రజల సమస్యలతో నాకు అవసరం. నాతో ప్రజలకు అవసరం. ఈ అవసరమే నన్ను కవిని చేసింది.

## నాటక రచన

ఖమ్మంమెట్టు మహాసభ నాటికి మా తాలూకాలో ఆంధ్ర మహాసభ బాగా విస్తరించింది. అనేక గ్రామ సంఘాలేర్పడ్డాయి. "వెట్టిచాకిరి" అనే చిన్న నాటకాన్ని రాసి దాన్ని గ్రామాల్లో ప్రదర్శిస్తున్నాం. దానిలో నటులంతా తాలూకా సంఘ నాయకులు. పటేలు దగ్గరనుంచి పోలీసు అమీనుకు వెట్టివాడు. రోజు నాంచా తీసుకొనిపోయి ఇవ్వాలి. అలా పోయేటప్పుడల్లా కట్టెలు కొట్టి, పెద్ద మోపుకట్టి అమీన్ సాబ్‌కివ్వడం ఆనవాయితీ. ఈ నాటకంలో వెట్టివాడు సంఘంలో చేరుతాడు. కట్టెమోపు లేకుండానే రోజు నాంచాతో పోలీసు స్టేషనుకు వెళతాడు. "కట్టెలు తేలేదేం?" అని గద్దిస్తాడు అమీను. అప్పుడు వెట్టి రొంటినుంచి చెకుముకి తోలుసంచీతీసి అందులో అతి భద్రంగా దాచిన చీటీ తీసి చూపుతాడు. అమీన్‌సాబు అదిరిపోతాడు. అది సంఘం చీటీ. ఇదీ ఆ నాటకంలో కథ.

ఖమ్మం మహాసభకు డాక్టర్ రాజారావుగారి నాయకత్వాన అనేక ప్రజానాట్య దళాలు వచ్చాయి. మా నాటకాన్ని బహిరంగ సభలో ప్రదర్శించడానికి వీలులేక పోయింది. ప్రతినిధుల ముందు మాత్రం ప్రదర్శించాం.

ఆంధ్ర మహాసభ విస్తరించటంతో మా కార్యకలాపాలు చాలా పెరిగాయి. అంతవరకూ మీటింగులకు ముగ్గురు నలుగురం జట్టుగా వెళ్ళేవారం. ఉపన్యాసాల తర్వాత బుర్రకథ చెప్పేవారం. సంఘం కార్యకలాపాలు విస్తరించడంతో మీటింగుల సంఖ్య పెరిగిపోయింది. జట్టుగా ముగ్గురు నలుగురు వెళ్ళడానికి వీల్లేకపోయింది. జట్టు చీలిపోయి ఎవరి ఫిర్కాకు వారే పరిమితం కావలసిన పరిస్థితి వచ్చింది. అందుకని ఉపన్యాసం తర్వాత బుర్రకథ చెప్పడానికి వీల్లేకపోయింది. కాని మీటింగులో ఏదో ఒక వైజ్ఞానిక ప్రదర్శన వుండి తీరాలి. లేకపోతే ప్రజలకు ఉత్తేజం కలగదు. ఈ పరిస్థితి కొత్త ఆలోచనను పురికొల్పింది.

ఒక్క మనిషి ఇవ్వగల వైజ్ఞానిక ప్రదర్శన హరికథ. సుంకర సత్యనారాయణగారి కష్టజీవి బుర్రకథను హరికథగా మార్చాను. హరిదాసు వేషం లేకుండా తలవని తలంపుగా ఆ హరికథను మొదటిసారిగా చెప్పవలసిన విచిత్ర పరిస్థితి ఏర్పడింది.

అప్పుడు ఆంధ్రమహాసభ జిల్లా కమిటీ ఆఫీసు సూర్యాపేటలో వుండేది. నేను జిల్లా కమిటీ సమావేశానికి వెళ్ళాను. అప్పుడు టౌను వర్తక గుమస్తాల సంఘం వార్షిక సభ జరుగుతోంది. వారు ఆంధ్ర మహాసభ నాయకులందరినీ ఆ సభకు ఆహ్వానించారు. సాయంకాలము ప్రఖ్యాత గాయకుడు వెంకటరాజుగారి గాన కచేరీ జరిగింది. అది ఎక్కువ సేపు సాగలేదు. నేను సంఘం పాటను పాడాలని ప్రేక్షకుల నుండి సన్న సన్నగా బయలు దేరిన కోరికల కేకల రూపం ధరించింది. కచేరీ చేసే రాజుగారు పాట ఆపి "నన్ను పాడండి" అని చెప్పే పరిస్థితి కల్పించారు. ప్రేక్షకులు, ఆంధ్రమహాసభ పాటలకు ఆనాడున్న ఆదరం అటువంటిది.

వేలాది ప్రజానీకం అందరూ సంఘం పాటలు కోరడం విని ఉప్పొంగి పోయింది నా మనసు. వెంకటరాజుగారు స్వయంగా హార్మోనీ అందుకున్నారు. ఒకటి రెండు, మూడు, నాలుగు పాటలు పాడాను.

పాట పాటకూ హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. ఇంకా ఇంకా పాడాలన్న డిమాండువచ్చింది. ఇక పాడదగ్గ పాటలు లేవు. ప్రజలు ఊరుకోనడం లేదు. ఆ స్థితిలో పక్కనే కూర్చున్న హుజూరు నగరు తాలూకా ఆర్గనైజరు వెదిరే రాజారెడ్డి గారు "హరికథ చెప్పండి" అని సలహా ఇచ్చారు.

ఒక వర్తకుని ఇంటినుంచి వెంటనే చిన్న చిటెకెలు తెచ్చారు. నాకున్న వేషం పైజామా, లాల్చీ, గాంధీటోపి, ఎవరో అందించిన తువ్వాలు నడుముకు బిగించి చిటెకెలందుకున్నాను. అదే నా హరిదాసు వేషం, వాయిద్యాలు అద్భుతంగా వున్నాయి. నాలోపాల నన్నీ కమ్ముకురాగల సంగీత విద్వాంసుని చేతిలో హార్మోనీ వుంది. కష్టజీవి హరికథా కాలక్షేపం రెండు గంటల సేపు సాగింది. కథ ప్రజల మన్ననలే కాదు, పండితుల మన్ననలు కూడా పొందింది. ఆ రోజుల్లో దేవీ నవరాత్రులు తొమ్మిది రోజుల్లోనూ తొమ్మండుగురు పండితుల చేత హరికథలు చెప్పించడం ఆ ప్రాంతంలో రివాజుగా వుండేది. ఆనాటినుండి దేవీ నవరాత్రోత్సవాలలో "కష్టజీవి" హరికథ తప్పనిసరి అయింది. కష్టజీవి కథ వున్న రోజున శ్రోతల సంఖ్య ఆశ్చర్యకరంగా పెరిగిపోయేది.

ఇది పౌరాణిక పండితులకు కన్నెర్రగా వుండేది. ఐనా సంఘాన్ని సంఘం కథలను, వాటిని అభిమానించే అశేష ప్రజానీకాన్ని కాదనగల శక్తి ఆనాడెవరికీ వుండేది కాదు.

## పార్టీ సభ్యత్వం

అంతవరకు ఆంధ్ర మహాసభ కార్యకర్తగా వున్న నన్ను 1944లో కమ్యూనిస్టు పార్టీ సభ్యునిగా తీసుకున్నారు. పార్టీ సభ్యత్వం పొందడం అంటే



పెద్ద గౌరవం. పార్టీ కార్డు చాలా పవిత్రమైనదిగా భావించేవారం. అప్పటి నుంచీ సంఘమే పార్టీ. పార్టీయే సంఘంగా పెనవేసుకొని పోయాయి.

గ్రామాల్లో ఎదురులేని దౌర్జన్యం సాగించే దొరలకు సంఘం గండకత్తెర అయింది. సంఘ కార్యకర్తలు సింహస్వప్నం అయ్యారు. జనగామ తాలూకా కడవెండి, దేవరుప్పల గ్రామాలనుండి ప్రజా ఉద్యమం పాత సూర్యాపేట, బాలేముల, మల్లారెడ్డి గూడెములకు మహోధృతంగా వ్యాపించింది. ఎదురు దెబ్బలకు తోక ముడుస్తున్న దొరలకు మద్దత్తుగా ఖాసిం రజ్వీ రజాకారు ముఠా గ్రామాల మీద పడుతోంది. ఆ రోజుల్లోనే బందగీ హత్య జరిగింది.

బందగీ తన భూమి కోసం విసునూరి దొరతో పన్నెండు సంవత్సరాలు పోరాడారు. కొసకు కోర్టులో నెగ్గాడు. బందగీ పట్నం నుంచి బస్సు దిగి కాలిబాటన ఊరుకు వస్తూండగా దారిలో దొర రౌడీలు పొంచి వుండి గొడ్డళ్ళతో కొట్టి చంపారు. గ్రామానికి ఈ వార్త చేరింది. సకల వర్గాల ప్రజలూ రోషంతో కదిలారు. బస్సు స్టాండు పక్కనే బందగీ సమాధి కట్టారు. దొరల దౌర్జన్యంపై తిరుగుబాటుకు చిహ్నంగా వెలిసిన ఆ సమాధి వద్ద ఇప్పటికీ ప్రజల జాతర జరుపుతూ వుంటారు. ఈ వీరుని గాథను నేను బుర్రకథగా రాశాను. దాన్ని ఒక దళంగా సాధన చేశాం.

ప్రజా ఉద్యమం పెంపుదలతో పాటు వైజానిక దళాల ప్రాముఖ్యం కూడా హెచ్చింది. జిల్లాలో వైజ్ఞానిక రంగం చూడవలసిందని పార్టీ నన్ను ఆదేశించింది. సూర్యాపేటలో జిల్లా వైజ్ఞానిక దళాన్ని ఏర్పాటు చేశాం. ఆ దళంలో గాయకులే కాక కవులు కూడా వున్నారు. డాక్టరు కీలువాల వెంకయ్య మంచికవి. హర్మోనిస్టు గాయకుడు, ఆయన స్వయంగా కొన్ని ప్రచార గేయాలు రచించాడు. పినపాల వెంకటేశ్వరరావు పార్టీ కార్యకర్త. కవి – ఆయన కూడా ఎన్నో గేయాలు రచించాడు. ఆవుల పిచ్చయ్య పార్టీ కార్యకర్త. కథా రచయిత. ఈయన రాసిన కథలు ఆ రోజుల్లో అడివి



బాపిరాజుగారి సంపాదకత్వాన వెలువడే తెలుగు మీజాన్ పత్రికలో అచ్చుఅయ్యాయి. ఓరుగంటి రంగయ్య మంచి గాయకుడు, జిల్లా బుర్రకథ దళంలో కథకుడు. ఆనాడు మా రచనలు ఒక్క మీజాన్ తప్ప మరే పత్రికకూ ఎక్కలేదు. అయినా మా రచనలకు అపారమైన ప్రజాదరణ వుండేది. పాట రాసిన వెంటనే ఇట్టే గ్రామాలకు పాకిపోయేది.

పల్లె ప్రజలకు తెలిసిన భాష, బాణి, మా పాటలకు ప్రాణం. అప్పటికి బస్తీల్లో ప్రచారం పొందిన సినిమా పాటల బాణీలు కూడా తీసుకునేవారం. భావం, భాష, బాణీలను గురించి మాకు సలహాలిచ్చే నాయకులు అందుబాటులో వుండేవారు. కాని చందస్సు వగైరాలను గురించి, కవితా రీతులను గురించి చెప్పేవారు మాత్రం మాకు అందుబాటులో ఉండేవారు. కాని ఆయన యిచ్చే సలహాలు మాకు అర్థం అయేవి కావు. ప్రజానీకానికి చెప్పవలసిన విషయాలను సూటిగా మాకు తెలిసిన మాటల్లోపెట్టి, వాటిని ఒక జానపద బాణీలలో లయ బద్ధంగా బిగించడం మా పని. దానికి కవితా లక్షణాలున్నా లేకపోయినా ప్రచండ తరంగం లాగా ప్రజానీకం నోళ్ళల్లో పోరాడేది. మాకు కావలసింది కూడా అదే.

నిజాం ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను అణచేందుకు తీవ్ర నిర్బంధ విధానాన్ని చేపట్టింది. నాయకులపై దొంగ కేసులు పెట్టి ప్రజలనుండి దూరం చేయాలనుకుంది. ఆ విధంగా ప్రజా ఉద్యమాలను అణచగలననుకొంది. ప్రజలు తమ నాయకుల్ని ప్రభుత్వానికి చిక్కకుండా కాపడుకొంటున్నారు. నిజాం పోలీసులు గ్రామాలమీద పడి నాయకుల్ని చూపించమని ప్రజలను హింసించసాగారు. ఆ రోజుల్లోనే నేనే "నైజాము సర్కారురా! ఓరన్న నాజీల మించిందిరా!" అన్న పాట రాశాను. ఈ పాటను ప్రజాశక్తి వారపత్రిక ప్రచురించింది. అచ్చుకెక్కిన నా తొలి రచన అదే.

## రహస్య జీవితం

ప్రజల ధన, మాన, ప్రాణాలమీద ప్రభుత్వ దాడి ఉధృతమవుతోంది. దానితో ప్రజల్లో ప్రతీకార వాంఛ కూడా పెరిగింది. ఆత్మరక్షణకు ఆలోచన చేయసాగారు. అలాంటి ఆలోచనలకు కమ్యూనిస్టు పార్టీ, ఒక నిర్మాణ రూపం ఇచ్చింది. ఆత్మరక్షణోపాయాలను వివరిస్తూ ఒక కరపత్రం వేసింది. ఆ కరపత్రం



సారాన్ని పాటలుగా కట్టి ప్రచారం చేయవలసిన అవసరం వచ్చింది.

పట్టరా వడిశాల పట్టరా రైతా!
కొట్టరా పోలీసు కుక్క లదిరేటట్లు!.....
రణ మందు దూకోయి తెలుగోడా
వణికించు శత్రువుల మొనగోడా!...
రక్తమోడ్చి కషపడే రైతుకూలి అన్నలార
సందుదొరికె ముందుకురికి రండిరా :....

– అనే పాటల్ని ఆనాడు రాశాను. ఈ పాటల్ని పాడుతూనే ప్రజలు నిజాం రజాకారు, పోలీసు మూకల్ని తరిమికొట్టడానికి ఉద్యమించారు.

అది 1947 ఆగస్టు 15, యూనియన్ ప్రాంతంలో అధికారం బ్రిటిషు వారి నుంచి కాంగ్రెస్ వారికి బదిలీ అయింది. నిజాం నవాబు ఏలుబడి నిరాటంకంగా సాగుతోంది. అంతవరకు నిమ్మకు నీరెత్తినట్లున్న స్టేటు కాంగ్రెసులో చలనం పుట్టింది. ఐక్య పోరాటానికి కలిసి రావలసిందని కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర మహాసభల ఆహ్వానాన్ని అంతవరకు పెడచెవిన పెట్టినవారు ఇప్పుడు తాము కూడా ఏదో ఒకరకం పోరాటానికి తయారయ్యారు.

నిజాం ప్రభుత్వం జాతీయ పతాకాన్ని నిషేధించింది. ఆ నిషేధాన్ని ధిక్కరించి జాతీయ పతాక ప్రతిష్ఠ చేయడమే అప్పటి పోరాటం. బేతవోలులో జాతీయ పతాకాన్ని స్థాపించిన కమ్యూనిస్టుపార్టీ ఆంధ్ర మహాసభ కార్యకర్తలు పందిరి నర్సయ్య, మాతంగి మట్టయ్య నిజాం పోలీసుల తుపాకీలకు బలి అయ్యారు, ఆనాటి ఆ పోరాటాన్ని వివరించే గేయం.

నిదరబోతున్నావ తెలుగోడా
ఇది పరువు కాదురా మొనగోడా......
ముందుకురికాడు మన పందిరీ నర్సయ్య
రండిరాయని తొడను గాండ్రించిచరిచాడు.
మన సంఘమునకు జైయనీ
మాతంగి మట్టయ్య దూకాడురా!

కాంగ్రెసు వారు జెండా ప్రతిష్ఠాపనల వరకే పోరాటాన్ని పరిమితం చేయాలనుకున్నా నిజాం పోలీసులూ రజాకార్లూ అంతటితో ఆగనీయలేదు.

ఇలాగ ప్రజలు ఇక్కడ జీవన్మరణ పోరాటంలో తలమునకలవుతూవుంటే ఈ ప్రజలను వదలి నెహ్రూ ప్రభుత్వం ఫాసిస్టు



నిజాంతో యథాతథ ఒడంబడిక చేసుకుంది. ఆ దశంలో అగ్నిపర్వతం బద్దలై లావా విరజిమ్మి నట్లు సాహిత్యం పుట్టింది. గొల్లసుద్దులు, వల్లభాయి, నెహ్రూ వీధి భాగవతం, విచిత్ర వేషాలకు రచనలు చేశాను. ఈ రచనలతోనే నేను తిరిగి వైజ్ఞానిక రంగంలో ప్రవేశించాను.

రాజీకి దిగినావ ఓరన్న! వచ్చి
నైజాముతో చేరి పెద్దన్నా

.....

తెలిసింది తెలిసింది అసలైన నీ రూపు
తెలిసింది కాంగ్రేసు సిసలైన రూపు!

.....

వద్దురా మనకొద్దు రైతన్నా
కాంగ్రేసు రాజ్యము వద్దురా
అసలొద్దురా కూలన్నా

....

తేనెబూసిన కత్తి నెహ్రూరయ్య
తెలిసింది నీ రూపు నెహ్రూరయ్య!

అనేవి ఆనాడు బహుళ ప్రచారం పొందిన గేయాల్లో కొన్ని.

మా భూమి నాటకం చూసిన తర్వాత వీర తెలంగాణ అన్న ఒక నాటకం రాశాను. దాన్ని మునగాలలో ప్రదర్శించాం. శ్రీ కొండేపూడి లక్ష్మీనారాయణగారు ఆ ప్రదర్శనం చూసి కొన్ని సలహాలిచ్చారు.

యథాతథపు ఒడంబడికతో ధైర్యంవచ్చిన నిజాం దమనకాండ హెచ్చింది. దానికి ప్రజల ప్రతిఘటన కూడా ఎక్కువై, తుదకు సాయుధ గెరిల్లా పోరాట రూపం ధరించింది.

గెరిల్లా దళాలేర్పడ్డాయి. కదం తొక్కుతూ పదం పాడుతూ గ్రామం నుంచి, గ్రామానికి కదిలేవి.

మ్రోగెనదుగొ యుద్ధభేరి
సాగిరమ్ము సైనికా!
ఓ గెరిల్లా సైనికా
ఒహో గెరిల్లా సైనికా!

ఇది గెరిల్లా దళాల మార్చింగ్ సాంగ్ ''ఓ పండితా సరదారులారా మండుతోందీ పేదకడుపోయీ!'' అనే పాటను ఆ రోజుల్లో గెరిల్లా దళాలన్నీ పాడేవి. అప్పుడే గెరిల్లాల కర్తవ్యాన్ని వివరించే పాట కూడా రాశాను.

'ఓ గెరిల్లా! ఓహో గెరిల్లా!
ఆపదలోనున్న అక్కయ్య పిలిచింది.
చిక్కులోపడి చిట్టి చెల్లి కేకేసింది
గుట్టలల్లో వుండి గూడేలు కాపాడు. ఓ గెరిల్లా!

జిల్లా అంతా తిరిగి పరిస్థితులను పరికించి రచనలు చేయాలన్న కోరిక కలిగింది. అందుకు పార్టీ అనుమతించింది. ఆనాడు ఒక చేత పెన్ను, ఒక చేత గన్ను పట్టగలిగినవారు జిల్లాలో మరెవరూ లేరు. నేను గ్రామాలు పర్యటిస్తూవుంటే గోపాలరెడ్డి దళం నాకు రక్షణగా వుండేది.

గోపాలరెడ్డి స్వతహాగా మంచి పాటగాడు. అతని గెరిల్లా దళంలో మల్చూరు అనే బుర్ర కథకుడు కూడా వున్నాడు. నేను ఏకాంత ప్రదేశంలో కూర్చుని పాటలల్లుతూ వుంటే ఈ దళం నన్ను కనిపెట్టుకుని రక్షణయిస్తూ వుండేది.

సాయుధ గెరిల్లా పోరాటం దావానలంలాగ విస్తరించింది. మిలటరీ క్యాంపులను కొట్టడంలోను, శత్రువు వలయాలను ఛేదించడంలోనూ రోడ్లను, గాడీలను మిలిటరీ క్యాంపులను అనువైన బంగళాలను విధ్వంసం చేయడంలోనూ వేలసంఖ్యలో ప్రజలు గెరిల్లా దళాలకు తోడ్పడేవారు.

## ఎర్రబాడు గడీ మీద దాడి

ఎర్రబాడు గడీ మీద జరిగిన ఇలాంటిదాడిని నేను స్వయంగా చూశాను. ప్రజా వ్యతిరేకులందరికీ పెద్ద అని పేరెన్నికగన్న జన్నారెడ్డి ప్రతాపరెడ్డిది ఎర్రబాడు గడీ. ఆ గడీలో పెద్ద పోలీసు క్యాంపు పెట్టారు. అంతవరకు పోలీసు క్యాంపులు పెట్టిన అనేక దొరల బంగళాలు నేలమట్టం అయ్యాయి. ఎర్రబాడు గడీని నేలమట్టం చేసే వరకు ఆ చుట్టు ప్రక్కల శాంతి వుండదు.

పథకం సిద్ధమయింది. సందెవేళ నుంచీ జనం చిల్వకుంట గ్రామ శివార్లకు చేరుకుంటున్నారు. ప్రతివారి భుజానా పలుగో, పారో, తట్టో వున్నాయి. అర్ధరాత్రి కల్లా అయిదారు వందల మంది చేరారు. నూట యాభై మంది దాకా సాయుధ గెరిల్లాలున్నారు. ఒక ఎద్దుబండి మీద "జజ్జాయి" వుంది. రెండు గజాల పొడవు మూడంగుళాల కై వారం గల పైపులతో తయారుచేసిన నాటు ఫిరంగికి జజ్జాయి అని పేరు: జజ్జాయి బండి, బండి వెంట దళం, దళం వెంట ప్రజలు బయలు దేరారు. కోడికూసే వేళకు గడీని చుట్టు ముట్టారు.

జజ్జాయిలో మందు దట్టించి, బంగళా చివరి అంతస్తునున్న గదికి బారుపెట్టి పేల్చారు. గది కూలలేదు. రంధ్రం మాత్రం పడింది గోడకు. ఆ గదిలోనే మిలిటరీ వాళ్ళున్నారు. కిటికీలోంచి కాల్పులు మొదలు పెట్టారు. ప్రజలు ప్రహరీ ఇవతలవున్నారు. మిలిటరీ గుళ్ళబారుకు అందని స్థలం అది. మరొక జజ్జాయి దట్టించి, ప్రహరీగోడను కొట్టారు. గండి పడింది. ప్రజలు పలుగులతో ఆ గండి దగ్గరకు పరుగుపెట్టే లోపలే మిలిటరీ వాళ్ళ తుపాకులు అక్కడ గుళ్ళ వర్షం కురిపించసాగాయి.

గెరిల్లా కమాండర్లు సంప్రదించు కున్నారు. లోపల ప్రహరీ పక్కనున్న మిలిటరీ వారిమీద చేతి బాంబు విసిరి చెదరగొట్టాలని నిశ్చయించారు. అప్పుడే గడీని స్వాధీనం చేసుకొనడం సాధ్యమవుతుందన్నారు. నిర్ణయం మేరకు గురిచూసి బాంబు విసిరాడు దాయం రాజిరెడ్డి. కాని అది గోడ అంచుకు తాకి ఇవతలనే పడింది. కొందరు దళ సభ్యులకు గాయాలు తగిలాయి.

ఆనాటి పోరాటంలో గడీ స్వాధీనం కాలేదు. కాని బంగళాపై నున్న ఇద్దరు మిలిటరీ వాళ్ళు మాత్రం హతం అయ్యారు. పది గంటల పాటు పోరాటం తర్వాత ప్రజానీకం వెనక్కుమళ్లారు. ఆ మర్నాడు ప్రభుత్వ ఆశ్వికదళం చిల్పకుంట గ్రామం మీద దాడిచేసి ఎందరో యువకుల్ని కాల్చి చంపింది. ఎర్రబాడు క్యాంపును కూడా ఎత్తివేసుకొనిపోయింది. కోపోద్రిక్తులైన ప్రజలు ఆ తర్వాత నాలుగురోజులకు ఎర్రబాడు గడీని. గడీలోని బంగళాలను కసితీరా నేలమట్టం చేశారు. ఆ స్థలంలో వీర యువకుల పేర తొమ్మిది సమాధులను నిర్మించారు. జన్నారెడ్డి ప్రతాపరెడ్డి నరకాసురపాలన ముగిసింది. ఆయన వేయి ఎకరాల పండ్లతోటను ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. అలాగ దొరల చెర నుండి విడివడిన భూమిని చూసి నేను రాసిన పాట.

కళ కళలాడే, కనకము కురిసే,
తెలంగాణ భూమి
మురికిపాలన కూలె, దొరలంత పారిపోయె
చెర వదిలింది, మెరిసిపోతుంది,
తెలంగాణ భూమి.

నల్లగొండ జిల్లాలోని జనగామ, భువనగిరి, సూర్యాపేట తాలూకాల్లో అనేక గ్రామాల్లో



ప్రభుత్వ పాలన అంతరించింది. అలాంటి గ్రామాల మధ్య కచ్చడంలో ప్రయాణం చేసే వాడిని, అంతకుముందు కచ్చడంలో దొరలు మాత్రమే ప్రయాణాలు చేసేవారు. ఇప్పుడు మొదటిసారిగా ప్రజా కార్యకర్తలు కచ్చడాల్లో ప్రయాణం చేసే స్థితి వచ్చింది. ఎక్కడ చూసినా గెరిల్లా దళాలే కనిపించేవి. అప్పుడప్పుడు ప్రభుత్వ మిలిటరీ పోలీసు దళాలు తమ ఉనికిని తెలియపరుచుకొనడం కోసం ఏదో గ్రామానికి నిప్పుపెట్టి పారిపోయే వారు.

## పోలీసు చర్య

అది 1948 సెప్టెంబరు 13 వ తేదీ ఉదయం పది గంటలయింది. సూర్యాపేట తాలూకా సింగారం గ్రామంలో బహిరంగ సభ జరుపుకున్నాం. ప్రజలు వేల సంఖ్యలో వున్నారు. సభా ప్రదేశాన్ని, గ్రామాన్నీ రెండు గెరిల్లా దళాలు కాపాడుతున్నాయి. ఉపన్యాసాలు ముగిశాయి. లక్ష్మణాచారి దళం నాడు "తెలంగాణా వీర యోధులు" బుర్రకథ చెపుతున్నారు. రేణికుంట రామిరెడ్డి దళం జరిపిన వీర పోరాటగాథ ఇది.

కథ మంచి రసవత్తర ఘట్టంలో వుంది. ప్రజలంతా కథలో లీనమయ్యారు. అంతలో "ధాం ధాం ధాం" అని శబ్దాలు సభాస్థలం మీదికే గుండ్లవర్షం కురుస్తున్నాయా అనిపించింది. అదిరి అందరం లేచాం. జనం అంతా అలాంటి దశలో చేయదగ్గరీతిగా గ్రామం విడిచి పొలాలదిక్కు పరుగు బెడుతున్నారు. వేషాల మీద వున్న బుర్రకథ దళం కూడా, తంబురా, గుమ్మెట్లతో ఘల్లుఘల్లుమనే కాళ్ల గజ్జెలతో పరుగుపెట్టింది. హఠాత్తుగా జనం యిలా ఎందుకు పరుగెడుతున్నారో గ్రామాన్ని కాస్తున్న గెరిల్లా దళానికి అర్థం కాలేదు. ఎందుకేనా మంచిదని వారూ నాలుగడుగులు వేశారు. ధాం ధాంమనే కాల్పుల శబ్దాలు వినవస్తూనే వున్నాయి. కనుచూపు మేరలో ఎక్కడా శత్రువుల జాడ కానరావడం లేదు. అప్పుడు జ్ఞాపకం వచ్చింది. పోలీసు చర్య సంగతి. పెద్దగా అరుస్తూ విషయం చెప్పగానే ప్రజానీకం ఆగిపోయారు. అంతా తిరిగి సింగారం చేరుకున్నాం. ప్రజాపోరాటాల దెబ్బకు కీళ్ళు సడలిపోయి వున్న నిజాం ఎక్కువ ప్రతిఘటన లేకుండానే యూనియన్ సైన్యాలకు లొంగి



పోయాడు. వీర తెలంగాణా ప్రజానీకం రక్తతర్పణం చేసి నాలుగు వేల గ్రామాలలో నిజాం నిరంకుశ పాలన అంతం చేసింది. పదిలక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి పెట్టింది. పోలీసు చర్య అయిన వెంటనే భారత ప్రభుత్వం ఆ ప్రాంతాలలో 50 వేల సైన్యాన్ని దింపింది. గెరిల్లా ప్రాంతాలలో పెద్ద శిబిరాలను నెలకొల్పింది. అదివరకు కుచ్చుటోపిలు పెట్టుకున్న దొరలు, వారి కిరాయి గూండాలు గాంధీటోపిలు తగిలించు కొని భారత సైనిక సహాయంతో గ్రామాలకు తిరిగి వచ్చారు. అది వరకు రజాకార్లు చేసిన ఘోరాలనే ఈ దొరలు, వీరి కిరాయి గూండాలు చేపట్టారు. ఆనాడు వీరి దాడి నుంచి ముస్లిం కుటుంబాలను రక్షించడం మన గెరిల్లా దళాల ప్రధాక కార్యక్రమం అయింది. వల్లభాయి నెహ్రూ వీధి భాగోతం కట్టే వైజ్ఞానిక దళాలకు క్షణం తీరికలేదు.

## సైసై గోపాలరెడ్డి

ఆ రోజుల్లో గొట్టి ముక్కల గోపాల రెడ్డి దళం నాకు సన్నిహితంగా వుండేది. గోపాలరెడ్డి నూనూగు మీసాల నూత్న యవ్వనంలో వున్నాడు. ఎప్పుడూ నవ్వుతూ వుండేవాడు. పాటలంటే చాలా సరదా. ఆత్మకూరు నుంచి పాతర్లపాడువరకు రక్షణ యీ దళం బాధ్యత.

ఆ రోజు సాయంత్రం గోపాలరెడ్డి వచ్చి తాము వేరే ప్రాంతానికి తరలిపోతున్నట్లు చెప్పాడు. నన్ను జాగ్రత్తగా వుండమని హెచ్చరించాడు, రేపు భోజనానికి ఇక్కడికే వస్తామన్నాడు. ఈ పొద్దురాసిన పాట రేపు నేర్పాలంటూ లాల్ సలాం చేసి వెళ్ళిపోయాడు గోపాలరెడ్డి. గెరిల్లా వేషంలో గోపాలరెడ్డిని జూసినప్పుడల్లా మా పలనాటి బాలచంద్రుడు నా మనసులో మెదిలేవాడు.

నా కొరియరు రాములు మర్నాడు పదిగంటలకు పిడుగులాంటి వార్తతెచ్చాడు. గోపాలరెడ్డి మరణించాడంటే నమ్మలేక పోయాను. గోపాలరెడ్డి పోరాటాన్ని రాములు వివరంగా చెప్పాడు.

మాగాణి చెలకల పక్కచిన్నబోడు. గోపాలరెడ్డి దళం దానిమీద నిద్రపోతోంది. ఆ దశలో శత్రువులు గుట్టను చుట్టుముట్టారు. దళం కన్నా పదిరెట్లుంది శత్రువుబలం. శత్రువలయాన్ని ఛేదించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. దగ్గరకు రావడానికి శత్రువులకు గుండెలు చాలడం లేదు. లొంగిపోతే కాపాడుతాం అని శత్రువులు కేకలు వేశారు. "కమ్యూనిస్టు అన్నవాడు, తుదివరకు



పోరాడుతాడుకాని మీకు లొంగడురా" అని గోపాలరెడ్డి జవాబిచ్చాడు. తూటాలు వున్నంత వరకు శత్రువులు ఒక్కంగుళం ముందుకు వేయకుండా అటకాయించాడు.

శత్రువు గుండొకటి పొట్టను చీరింది. పేగులు బయటికి వచ్చాయి. బాల చంద్రుని లాంటి గోపాలరెడ్డి పేగులను లోపలికి తోసి తువ్వాలుతో దట్టిబిగించాడు, ప్రాణంవుండగా శత్రువు తనను తాకలేదు. తన ఆయుధం కూడా శత్రువుకందరాదని బలాన్ని కూడదీసుకుని తుపాకిని బండకుబాది ముక్కలు చేశాడు.

మాగాణి బురదలో పనిచేస్తున్నట్లు నటించి, రాములు శత్రువు కళ్ళు కప్పి బయటపడ్డాడు. పాట నేర్పమన్నాడు గోపాల రెడ్డి. బాలచంద్రునిలాగ, వీరాభిమన్యుని లాగ వీర మరణం చెందిన గోపాలరెడ్డి వీర గాథను "సై సై గోపాలరెడ్డి" అని రాశాను. ఈ పాట తెలంగాణా అంతటా ఒక వీరగాథగా వ్యాపించింది.

తెలంగాణా సాయుధ పోరాటంలో రక్తతర్పణచేసిన ఎందరో వీర కిశోరాల మీద పాటలు రాశాను. అవి ప్రజల నోళ్ళల్లో మిగిలాయి. నాకు దొరికినవి గోపాలరెడ్డి, పసునూరు వెంకటరెడ్డి, రేణికుంట రామిరెడ్డి, వడిశాల పిచ్చయ్య, వెంకటేశ్వరరావు, దొడ్డి కొమరయ్య, మాతంగి మట్టయ్య, పందిరి నర్సయ్య మీద రాసిన పాటలు రేణికుంట రామిరెడ్డి వీరగాథను వివరించే తెలంగాణా వీరయోధులనే బుర్రకథ, ఈ బుర్రకథను బూర్గుల వారి ప్రభుత్వం నిషేధించింది. నిషేధాన్ని తొలగించడం కోసం ప్రతిపక్షాలు రెండు సంవత్సరాలు పోరాటం చేసిన తర్వాత ప్రభుత్వం లొంగి వచ్చింది.

ఇలాగ ఆనాటి పోరాటాలు, అవసరాలు నాచేత కవిత చెప్పించాయి, పెన్ను పట్టించాయి, గన్ను పట్టించాయి, వైజ్ఞానిక దళాల్లోను, గెరిల్లా దళాల్లోను పని చేయించాయి.

ఆనాడు నా పాటలు ప్రజల నాలుకల పైనే నిలిచాయి. కాని అచ్చుకు నోచుకోలేదు. పాతిక సంవత్సరాల తర్వాత, నాకు జ్ఞాపకం వున్నవి, మిత్రుల ద్వారా సేకరించినవి నా రచనలలో కొన్ని మాత్రమే.




# సంస్కరణ, సాహిత్యం మేళవించిన హేమలత లవణం

వొరప్రసాద్

ప్రముఖ సంఘసంస్కర్త, మానవతావాద దృక్పథంతో, గాంధేయ ఆలోచనా ధోరణిని అనుసరించి పలురచనలు చేసిన హేమలతా లవణం(76) మార్చి 19న విజయవాడలోని నాస్తిక కేంద్రంలో మృతి చెందారు. శ్రీమతి హేమలతా లవణం ప్రముఖ కవి గుఱ్ఱం జాషువా ద్వితీయ కుమార్తె. ప్రముఖ సంఘసంస్కర్త, నాస్తికవాది అయిన గోరా(గోపరాజు రామచంద్రమూర్తి) కుమారుడు లవణం ను వివాహం చేసుకున్నారు. వివాహ అనంతరం మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోయలో భూదానోద్యమ నాయకులు వినోబాబావే నాయకత్వంలోని బందిపోటు దొంగల లొంగుబాటుకై జరిగిన పాదయాత్రలో లవణం దంపతులు పాల్గొన్నారు. అక్కడ ప్రేరణ పొందిన శ్రీమతి హేమలతా లవణం స్టూవర్టుపురంలోని నేరస్తుల సెటిల్‌మెంట్‌లో సంస్కరణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దివిసీమ ఉప్పెన సమయములో తన సేవా కార్యక్రమాలతో పలువురిని ఆకట్టుకున్నారు. కుముద్‌బెన్ జోషి మన రాష్ట్ర గవర్నర్‌గా ఉన్న సమయములో నిజామాబాద్ జిల్లాలోని జోగిని దురాచారాన్ని నిర్మూలించడానికి శ్రీమతి హేమలతా లవణం ను ఆహ్వానించారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని కోటయ్య క్యాంప్ అనే కుగ్రామంలో స్థానిక మిత్రుల సహకారంతో జోగిని సంస్కరణ ఉద్యమం కోసం "చెల్లి నిలయం" స్థాపించారు. తెలంగాణా ప్రాంతంలోని జోగిన దురాచార నిర్మూలన కోసం చివరి కంటా తన కృషిని కొనసాగించారు. కొత్తగా జోగిని లను తయారు చేయకుండా నిజామాబాద్ జిల్లాలో నిరోధించగలిగారు.



**తండ్రి గుఱ్ఱం జాషువాతో శ్రీమతి హేమలతా లవణం**

సంస్కరణోద్యమ కార్యక్రమాలతో పాటు సాహితీ కృషిని కూడా శ్రీమతి హేమలతా లవణం కొనసాగించారు. స్టూవర్టుపురం నేరస్థుల సంస్కరణ ఇతివృత్తంతో తను రాసిన జీవన ప్రభాతం నవలకు రాష్ట్ర సాహిత్య పురస్కారం పొందారు. ఈ నవలలో పాత్రలు అత్యంత మానవత్వం కలిగి ఉండి మనుషుల్లో సంస్కార భావాలను వ్యాప్తి చేస్తాయి. నేరస్త ముఠాల గురించి అనేక విశేషాలను ఈ నవల తెలియజేస్తుంది. నేరస్థ ముఠాలలోని అమ్మాయిలు అత్యంత చాకచక్యంగా, సాహసంగా నేరాలు చూసే యువకులను ప్రేమించడం, వివాహం చేసుకోవడానికి ఆసక్తి చూపడం వంటి పలు ఆసక్తి కరమైన విషయాలు ఈ నవలలో చూస్తాం. వీరు రాసిన అహింసా మూర్తులు–అమర గాథలు, మా నాన్నగారు, జాషువా కలం చెప్పిన కథ, తాయెత్తు–గమ్మత్తు, జీవ సాగరం, నేరస్తుల సంస్కరణ వంటి పలు రచనలు ప్రాచుర్యం పొందాయి. తన జీవితంలో పలుసార్లు మరణం సమీపంగా వచ్చి పోయిందని భావించి 'మృత్యోర్మా అమృతంగమయ' అనే పేరుతో తన జీవిత కథను రాశారు. తన నాన్నగారి పేరిట జాషువా ఫౌండేషన్ స్థాపించి 1995 సంవత్సరం నుండి ప్రతీ యేటా వివిధ భాషలకు చెందిన సాహితీ ఉద్దండులకు లక్ష రూపాయల అవార్డును జాషువా సాహిత్య పురస్కారం పేరిట ఇచ్చి ఆ సత్కార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేవారు. ఈ అవార్డులను పశ్చిమబెంగాల్ కు చెందిన సాహితీవేత్త శంఖాఘోష్ నుండి మహారాష్ట్రకు చెందిన దళిత రచయిత నారాయణ సుర్వే వంటి వారితో సహా మన రాష్ట్రం నుండి బోయి భీమన్న వంటి ప్రసిద్ధులు అందుకున్నారు. దేశవ్యాప్తంగా మొత్తం తొమ్మిది భాషలలో తొమ్మిది జాషువా పురస్కారాలను లబ్ధప్రతిష్టులకు అందజేశారు. డా॥ సి. నారాయణ రెడ్డి ఛైర్మన్‌గా జాషువా ఫౌండేషన్ ఆధ్వర్యాన విభిన్న అంశాలపై సాహితీ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. వందమంది తెలుగు మహిళలతో అస్మిత ప్రచురించిన మహిళావరణం పుస్తకంలో తన అత్తగారు సరస్వతీ గోరాతో పాటుగా తను కూడా చోటు పొందారు. ఒకే కుటుంబం నుండి ఇద్దరుస్త్రీ మూర్తులు ఈ పుస్తకంలో ఉన్నది వీరే కావడం విశేషం. జోగిని సంస్కరణ ఉద్యమంలో భాగంగా శ్రీమతి హేమలతా లవణం చేసిన పలు రచనల్లో 'ఎవరు చేశారమ్మ నిన్నిలా" అనే గేయం ప్రసిద్ధమైంది. స్వాతంత్ర్యానంతరం మొదటి తరానికి చెందిన శ్రీమతి హేమలతా లవణం విశ్వమానవ దృక్పథంతో తన జీవన పథాన్ని సాగించారు. ఎనభై, తొంభై దశకాలలో తెలుగు సాహిత్యాన్ని తాకిన స్త్రీ వాదం, దళిత వాదం వంటి అస్థిత్వ ఉద్యమాలను గమనించినా తన విశ్వమానవత్వ ధోరణిని వీడక వాటి జోలికి పోలేదు. తన తండ్రి గుఱ్ఱం జాషువా తనకు వ్రాత పూర్వకంగా ఇచ్చిన ఆస్తి ఆయన పుస్తక హక్కులు. ఆ ఆస్తిని ఆనందంగా స్వీకరించిన ఆమె ఆ పుస్తకాలను ప్రచురించి వచ్చిన సొమ్ముతో సాహిత్య సేవ చేసి జాషువా కీర్తి కిరీటాన్ని నలుదిశలా చాటారు. లవణంతో తన వివాహం నాటికే మామగారు గోరా కుటుంబం నాస్తిక కుటుంబంగా ఆంధ్ర దేశంలో ప్రాచుర్యంలో ఉంది. జాషువా కూతురిగా సాహిత్య స్ఫూర్తితో ఉన్న హేమలతకు గోరా సంస్కరణ, నాస్తిక వాద నేపథ్యం తోడయ్యింది. భర్త లవణం తో కలిసి సామాజిక సంస్కరణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఆంధ్ర దేశం అంతటా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. గోరా, లవణం ప్రతిష్టలను తట్టుకుని తనకంటూ ఒక వ్యక్తిత్వాన్ని, ఉనికిని ప్రతిష్టించుకోవడంలో హేమలత ప్రత్యేకత కనపడ్తుంది. ఈ కవిపుత్రిక తన తండ్రి పేరు మీద చేసిన సాహిత్య కృషిని గుర్తించిన వరంగల్ కవి మిత్రులు తాము ప్రచురించిన 'నాయిన' కవితా సంకలనాన్ని శ్రీమతి హేమలతా లవణం దంపతులతో ఆవిష్కరింపజేయడం ఆమె విశిష్టతకు అద్దం పడుతుంది. తన తండ్రి గుఱ్ఱం జాషువా రాసిన పద్యాలను తన గంభీర కంఠంతో సన్నిహితుల మధ్య పాడుతూ తన్మయం చెందేవారు. మంచి హాస్యప్రియత్వం కలిగిన హేమలతా లవణం తన చుట్టూ ఉన్న ఆత్మీయుల మధ్య ఎప్పుడూ నవ్వులు పండిస్తూ ఉండేవారు. తనతో పాటు ఎప్పుడూ నలుగురు మనుషులు ఉండాలని కోరుకునేవారు. కులమతాల కతీతంగా తన ప్రవర్తనా సరళి చూసిన సన్నిహితులు విస్మయం చెందేవారు. తన ఉన్నత వ్యక్తిత్వంతో, అపురూప ప్రేమ భావనతో సంస్థలోని అనేక మంది కార్యకర్తలను ప్రభావితం చేసిన సంస్కారమూర్తి శ్రీమతి హేమలతా లవణం. తనకు సంతానం లేదనే బాధ తను ఏనాడు వ్యక్తపరచలేదు. తనచుట్టూ ఉన్న వారినందరినీ తన కుటుంబంలా భావించేవారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీమతి హేమలతా లవణం కు రెండు సార్లు ఆత్మగౌరవ పురస్కారాన్ని అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో అంబేద్కర్ పేరున ఇచ్చే ప్రతిష్టాత్మక భీమ అవార్డు అందుకున్న మొదటి మహిళ శ్రీమతి హేమలతా లవణం. జాషువా గారన్నట్లు 'సుకవి జీవించు ప్రజ నాల్కయందు' అన్నట్లు ఈ ప్రేమైక మూర్తి సాహిత్యాభిమానుల్లో, తన సన్నిహితుల మనస్సుల్లో శాశ్వతంగా ఉంటారు. ఆమెకు సాహిత్య ప్రస్థానం నివాళి అర్పిస్తోంది.



**శ్రీమతి హేమలతా లవణం దంపతులు**

- వొరప్రసాద్

## నివేదన

# సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై దాడిని నిరసించిన కవులు, కళాకారులు




"నిరంతరం ప్రజల మేలు కోరుకున్న సుందరయ్య
నీలాగ నిప్పులాంటి నేతలు మాకెందరయ్య
సోషలిజం ఈ దేశపు బిడ్డల తల నిమిరినపుడు
ఏ మబ్బుల తేరు మీదో వచ్చి చూడు"

**ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య మరణించినపుడు ఉదయం దినపత్రికలో రన్నింగ్ కామెంటరీ శీర్షికలో ప్రముఖ కవి దేవీప్రియ రాసిన వాక్యాలు ఇవి. తన ఆదర్శ జీవన పథంతో రాజకీయ పార్టీల కతీతంగా ఎందరినో ప్రభావితం చేసిన మహోన్నతుడు సుందరయ్య. ఆ మహానేత పేరున వెలుగొందుతున్న విజ్ఞాన భాండాగారం. ఎందరో కవులు, కళాకారులు తమ కళా సాహిత్యాలను ప్రదర్శించే వేదికగా జంటనగరాలలో ప్రముఖంగా వెలుగొందుతున్న కళా సాంస్కృతిక వేదిక -సుందరయ్య విజ్ఞాన కేంద్రం. అక్కడ దాడి జరగడం అందరిలో ఆందోళనలు రేపింది. సాహిత్యలోకం వెనువెంటనే స్పందించింది. తమ నిరసన గళాలను వినిపించింది. ఫాసిస్టు మూకల దుశ్చర్యలను తీవ్రంగా ఖండించింది.**

ఒక అసహనం, ఒక ఆక్రోశం, వెర్రెక్కిన మతోన్మాదం- ఫలితం సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై దాడి. ఆర్ఎస్ఎస్ మూకలు అన్ని విలువల్ని, వలువల్ని వదిలేసి నిస్సిగ్గుగా ఒక జ్ఞాన సముపార్జనా కేంద్రంపై వారి పైశాచికత్వాన్ని ప్రదర్శించారు. అసాధారణ సంకల్పబలంతో సమసమాజ సిద్ధాంత ప్రేరణతో పేద ప్రజల కష్టాల తొలగింపుకోసం తన జీవితాన్ని అర్పించిన నిరాడంబర ఆదర్శమూర్తి పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాన్ని పెట్రోలు పోసి తగటబెట్టడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఆయన ఆశయాల సాధనకోసం ఒక పరిశోధనా కేంద్రంగా వెల్లివిరుస్తున్న విజ్ఞాన కేంద్రంపై చేసిన దాడిని సాహితీ వేత్తలు, కళాకారులు, మేధావులు తీవ్రంగా ఖండించారు.

ఫిబ్రవరి 10, సోమవారం రాత్రి 8.30 గం.ల సమయములో జరిగిన ఈ దాడిని ఖండిస్తూ 11వ తేదిన 12 గం.లకు సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కవులు, కళాకారులు, సాహిత్యవేత్తలు, మేధావుల నిరసన ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖ సాహితీవేత్తలు ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. "సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిత్యం అనేక కళాసాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటాయని, పేద ప్రజల కష్టసుఖాలు ప్రతిఫలించే కళారూపాల ప్రదర్శనలకు కేంద్రస్థానమని'' సాహితీస్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి పేర్కొన్నారు. ఈ కేంద్రంలో ఉన్న రెండు లక్షల యాభైవేల పుస్తకాలలో రామాయణంతో మొదలుకొని అన్ని రకాల సాహిత్యం ఉందని, అందులోనూ 21 రకాల రామాయణాలతో పాటు అత్యంత అరుదైన ఉర్దూ సాహిత్యం కూడా ఉందని అన్నారు. ఆరుద్ర వంటి మహానుభావులు సేకరించిన అరుదైన చారిత్రక గ్రంథాలకు ఈ విజ్ఞాన కేంద్రం నిలయమని అన్నారు. అలాంటి కేంద్రంపై దాడి చేసిన, మార్క్సిస్టు గాంధీగా పేరొందిన సుందరయ్య చిత్రపటంపై పెట్రోలు పోసి తగలబెట్టడానికి ప్రయత్నించిన ఫాసిస్టు మూకల చర్యను ప్రతీ ఒక్కరూ ఖండించాలని" ఆయన అన్నారు. "ఆనాడు గాంధీని హతమార్చిందీ ఈనాడు మార్క్సిస్టు గాంధీగా పేరొందిన సుందరయ్య చిత్రపటాన్ని తగలబెట్టడానికి ప్రయత్నించీ ఆ ఫాసిస్టు ముఠాలేనని" అన్నారు. ప్రముఖ కవి శివారెడ్డి మాట్లాడుతూ " హైదరాబాద్‌లో లౌకిక స్ఫూర్తితో కళాసాంస్కృతిక కేంద్రంగా భాసిల్లుతున్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై దాడి చేయడాన్ని ప్రతీ ఒక్కరూ ఖండించాల' ని అన్నారు. అధికార భాషా సంఘం అధ్యక్షులు ఎబికె ప్రసాద్ మాట్లాడుతూ " సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై దాడి చేసిన ఫాసిస్టు మూకల చర్యల్ని" తను తీవ్రంగా నిరసిస్తున్నానని అన్నారు. ప్రజాశక్తి సంపాదకులు వినయ్ కుమార్ మాట్లాడుతూ " సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై మతోన్మాదులు చేసిన దాడిని లౌకిక శక్తులన్నీ కలిసి ఐక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. అరసం అధ్యక్షుడు ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ "సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని" కోరారు. హైదరాబాద్ మిర్రర్ సంపాదకులు ప్రముఖ కవి దేవీ ప్రియ మాట్లాడుతూ " ఎందరో కళాకారులకు, సాహిత్యవేత్తలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై దాడి చేయడాన్ని ప్రతీ ఒక్కరూ నిరసించాలని' అన్నారు. వెంటనే దాడి చేసిన దుండగులను రాష్ట్ర ప్రభుత్వం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. పర్‌స్పెక్టివ్స్ ఆర్.కె. మాట్లాడుతూ "మతోన్మాదం ఏదైనా దాన్ని లౌకిక శక్తులు తీవ్రంగా ప్రతిఘటించాలని" విజ్ఞప్తి చేశారు.

ఇంకా ఈ నిరసన కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్‌హౌస్ అసోసియేట్ ఎడిటర్ గుడిపూడి విజయరావు, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ఉపాధ్యక్షుడు రాజు, సాహితీ స్రవంతి నగర కన్వీనర్ సత్యభాస్కర్, కో. కన్వీనర్ జి. యాదగిరి రావు, కవులు శిల్పా జగదీష్, పసునూరి రవీందర్, శర్మ, గోవర్ధన్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టీ సాంబిరెడ్డి, ప్రజాశక్తి బుక్‌హౌస్ హైదరాబాద్ బ్రాంచి మేనేజర్ లక్ష్మయ్య తదితరులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సాహిత్యకారుల సంయుక్త ప్రకటన**

ఉత్తమ గ్రంథాల నిలయంగా, ఉద్యమాల కేంద్రంగా, సభా నిర్వహణ వేదికగా రాష్ట్ర రాజధానికే గర్వకారణమైన సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై ఆరెస్సెస్ దాడిని సీనియర్ కవులు, రచయితలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. ఆ ప్రకటనలో ఇలా పేర్కొన్నారు :

దేశం వివిధ ప్రాంతాలలో కళాకారులు, చిత్రకారులు తదితరులపై జరుగుతున్నదాడుల కొనసాగింపే సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై జరిగిన దుర్మార్గం. ఆదర్శప్రాయుడైన ఆయన చిత్రపటాన్ని తగలబెట్టేందుకు ప్రయత్నించడం, వాచ్‌మన్‌ను గాయపర్చడం, అనేక రకాల విధ్వంసానికి పాల్పడ్డం సహించరానివి. ఒక సంస్థపైన గాక ప్రజాస్వామిక లౌకిక విలువలైన భిన్నాభిప్రాయాలపైన జరిగిన దాడిగా దీన్ని చూడవలసి వుంది. మతోన్మాద శక్తుల అసహన పోకడలు భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ వారసత్వాన్నే దెబ్బ తీసేవిగా వున్నాయి. ప్రజాస్వామ్యంలో ఈ విధమైన దాడులకు దౌర్జన్యాలకు ఆస్కారం వుండరాదని స్పష్టం చేస్తున్నాం. గతంలో గుజరాత్ మతోన్మాద హత్యాకాండతో సహా వివిధ సందర్భాలలో లౌకిక విలువలను చాటిచెప్పిన ప్రజాస్వామిక సాహిత్య కారులు, మేధావులు సుందరయ్య విజ్ఞాన కేంద్రంపై జరిగిన ఈ దాడిని ఏకోన్ముఖంగా ఖండిస్తున్నారు. ఇందుకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని, ఇలాటి ఘటనలు పునరావృతం కాకుండా తగు భద్రత కల్పించాలని కోరుతున్నాం. ఇందుకోసం ప్రజాతంత్రవాదులందరూ సమైక్యంగా నిల్చి మతోన్మాద శక్తుల కుట్రలు కుత్సిత ప్రచారాల పట్ల అప్రమత్తతంగా వుండి లౌకిక ప్రజాస్వామిక విలువలను ప్రజా సంస్కృతిని పరిరక్షించుకోవాలని పిలుపునిస్తున్నాం.

కె.శివారెడ్డి (ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత) – జ్వాలాముఖి (కవి విమర్శకులు) – డా. అద్దేపల్లి రామమోహన రావు (ప్రసిద్ధ కవి) – దేవీప్రియ (ప్రముఖ కవి, హైదరాబాద్ మిర్రర్ సంపాదకులు) – కొలకలూరి ఇనాక్ (రచయిత, మాజీ వైస్ ఛాన్సలర్) – అంపశయ్య నవీన్ (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత) – ఎస్వీ సత్యనారాయణ (అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు) – చేకూరి రామారావు (ప్రముఖ భాషావేత్త) – వి.హనుమంతరావు (సీనియర్ పాత్రికేయులు, సుందరయ్య సహచరులు) – ఎస్.వినయకుమార్ (ప్రజాశక్తి సంపాదకులు) – జి.ఆంజనేయులు (ప్రధాన కార్యదర్శి, ఎపియుడబ్ల్యుజె ఎఫ్) – ఎస్. శ్రీనివాసరావు (హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షులు) – ఎస్.రాజు (విశాలాంధ్ర బుక్‌హౌస్) – ఎ. గాంధీ (పీకాక్ క్లాసిక్స్ ప్రచురణ కర్త, సీనియర్ జర్నలిస్టు) – ఆర్.కె. (పర్‌స్పెక్టివ్స్ ప్రచురణలు) – కేతు విశ్వనాథరెడ్డి (ప్రముఖ రచయిత, ఈ భూమి వారపత్రిక సంపాదకులు) – మల్లేపల్లి లక్ష్మయ్య (ప్రముఖపాత్రికేయులు) – బండారు రామ్మోహనరావు (సంపాదకులు, జనబలం మాసపత్రిక) – మోహన్ (ప్రముఖ చిత్రకారులు) – చంద్ర (ప్రముఖ చిత్రకారులు) – మోతుకూరు నరహరి (ఆంధ్ర సారస్వత కళాశాల మాజీ ప్రిన్సిపాల్) – ఓల్గా (ప్రముఖ రచయిత్రి) – జుగాష్‌వలీ (కవి) – డి. పాపారావు (రచయిత) – తెలకపల్లి రవి (రాష్ట్ర కన్వీనర్ సాహితీ స్రవంతి).

# జానపద కళలపై కవితా స్రవంతి

మార్చి 9, ఆదివారం నాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో "అంతరించిపోతున్న జానపద కళలు" అంశంతో కవి సమ్మేళనం నిర్వహించబడింది. జానపద కళలు ప్రజా జీవితంతో ముడిపడిన వైనాన్ని పలువురు కవులు తమ కవితల్లో హృద్యంగా చిత్రించారు. బుర్రకథ, హరికథ, ఒగ్గుకథ, చిందు బాగోతం, తప్పెటగుళ్ళు వంటి జాన పద కళలు సుమారుగా 750 కు పైగా ఉన్నాయని ఈ కార్యక్రమ సమన్వయ కర్త తంగిరాల చక్రవర్తి అన్నారు. ఈ సందర్భంగా జానపద కళల గురించి మరికొన్ని విశేషాలతో కూడిన వ్యాసాన్ని చదివి వినిపించారు. ప్రపంచీకరణ ప్రభావంతో జానపద కళలపై జరుగుతున్న నిర్లక్ష్యాన్ని జి. యాదగిరి రావు తన కవితలో బలంగా వ్యక్తీకరించారు. సత్యభాస్కర్, ఆలువాల సురేష్, విప్లవ్ దత్ శుక్లా, గడ్డం రవీందర్, సిహెచ్.లీల, అరిబండి ప్రసాద రావు, చింతాడ కూర్మారావు, జి. నరసింహమూర్తి, శాంతారావు, తంగెళ్ళపల్లి కనకాచారి, వొరప్రసాద్ తదితరులు ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ప్రతీ నెలా రెండవ ఆదివారం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఈ కవితా గోష్ఠి ఇలాగే జరగాలని ప్రతీ ఒక్కరూ ఆకాంక్షించారు. వచ్చే నెల ఏప్రిల్ 13న(రెండవ ఆదివారం) "బాల సాహిత్యం" అంశంతో కవి సమ్మేళనం ఉంటుందని సాహితీ స్రవంతి నగర కన్వీనర్ సత్యభాస్కర్ ప్రకటించారు.

## ప్రతి నెలా కవితాగోష్ఠి

**సాహితీ స్రవంతి, హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో ప్రతీ నెలా రెండవ ఆదివారం (ఏప్రిల్ 13) కవితా సమ్మేళనం నిర్వహించబడుతుంది. ఈ నెల అంశం 'బాలసాహిత్యం'. అందరికీ ఆహ్వానం.**




**డా॥ ఎన్. గోపి రచించిన 'నానీలు' కు మరాఠీ అనువాద గ్రంథం 'నానీలు – ముక్తక్ మణికా'ను మరాఠీ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శ్రీ.డి.పి. జోషి హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో ఆంధ్రప్రదేశ్ హిందీ ఆకాడమీ పూర్వ అధ్యక్షుడుడా॥ పి. విజయరాఘవరెడ్డి, అనువాదకుడు శ్రీ సురేష్ గంగాఖేడ్‌కర్, మూలకవి గోపి, సభాధ్యక్షురాలు, ఉస్మానియా డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ మీరామాన్వీ, ఉస్మానియా మరాఠీ శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ ప్రొఫెసర్ శోభాదేశ్‌ముఖ్ శాఖాధిపతి ప్రొపెసర్, గీతా సురేశ్ కాటే**

# మాడభాషి రంగాచార్య ట్రస్టు సాహిత్య పురస్కారాలు

ప్రముఖ రచయిత కీ॥శే॥ డా॥ మాడభాషి రంగాచార్య పేరున ట్రస్టు నెలకొల్పి పలు సాహితీ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఫిబ్రవరి 26 న సిటీ సెంట్రల్ లైబ్రరీలో ట్రస్టు నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సాహితీ ప్రముఖులు ఈ కృషిచేస్తున్న డా॥ రంగాచార్య గారి శ్రీమతి లలితను ప్రశంసించారు. ట్రస్టు తరపున ప్రతీ సంవత్సరం ఎంపిక చేసిన ఒక కథా సంపుటికి రూ.5000/–లు, మెమెంటోను పురస్కారంగా అందజేస్తున్నారు. కథా సాహిత్యం మీద అవగాహన కల్పించే నిమిత్తం కథా ప్రక్రియలో అధ్యయనం చేసిన వారిచేత ప్రసంగాలు ఏర్పాటుచేస్తున్నారు. అంతేకాకుండా ప్రతీ సంవత్సరం క్రమం తప్పకుండా హైదరాబాద్‌లోని కొన్ని పాఠశాలలను ఎంపికచేసుకుని బాలబాలికల్లో కథా సాహిత్యం పట్ల మక్కువ పెంచడానికి పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నారు. ఈ సంవత్సరం పోటీలకు ముందు కథా వర్క్‌షాప్ కూడా నిర్వహించారు. గత సంవత్సరం సాహితీ స్రవంతి ప్రచురించిన డి.సుజాతాదేవి పుస్తకం "చేపలు" కథా సంపుటికి ఈ పురస్కారాన్ని అందించారు. ఈ సంవత్సరం గొరుసు జగదీశ్వర రెడ్డి పుస్తకం "గజ ఈతరాలు" కథా సంపుటిని ఎంపికచేశారు. కథా సంపుటి ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగటానికి ఒక ఎంపిక కమిటీని ట్రస్టు ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో శీలా వీర్రాజు, డి. చంద్రశేఖర్ రెడ్డి, సుధామ, నాళేశ్వరం శంకరం, రామడుగు రాధాకృష్ణమూర్తి సభ్యులుగా ఉన్నారు.



**డా॥ మాడభాషి రంగాచార్య ట్రస్టు ప్రచురించిన కె.కె. రంగనాథాచార్యులు రాసిన 'తొలినాటి తెలుగు కథానికలు' పుస్తకావిష్కరణ దృశ్యం**

## గొరుసు జగదీశ్వర రెడ్డికి పురస్కారం

హృదయాన్ని కదిలించే కథలున్న "గజ ఈతరాలు" కథా సంపుటిపై మొదటి సమీక్ష తనే చేసానని గొరుసు జగదీశ్వర రెడ్డికి పురస్కారాన్ని అందించిన ప్రముఖ కథకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మునిపల్లె రాజు అన్నారు. పురస్కార సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత



**"గజఈతరాలు" ఈ కథాసంపుటి రచయిత గొరుసు జగదీశ్వరరెడ్డికి మాడభాషి రంగాచార్య పురస్కారాన్ని అందజేస్తున్న ప్రముఖ కవి కథారచయిత మునిపల్లెరాజు చిత్రంలో శ్రీమతి లలిత, కవి శివారెడ్డి, కథా రచయిత డి. వెంకట్రామయ్య.**

శివారెడ్డి మాట్లాడుతూ "అతి తక్కువ కథలు రాసి మంచి పేరు తెచ్చుకున్న కథా రచయిత గొరుసు అని అంటూ, ప్రస్తుతం రచయితలు తక్కువ కథలు రాసి గొప్ప పేరు తెచ్చుకోవాలనుకోవడం దురాశ అన్నారు. గొరుసు లాంటి రచయితలు ఎంత ఎక్కువగా కథలు రాస్తే అంతగా సామాజిక ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ట్రస్టు కార్యక్రమంలో భాగంగా ప్రచురించిన కె.కె.రంగనాథాచార్యులు రాసిన "తొలితరం కథానికలు" వ్యాస సంపుటిని మునిపల్లె రాజు ఆవిష్కరించారు. తను ఆ పుస్తకం గురించి మాట్లాడుతూ తెలుగు కథానికల మీద అత్యంత గొప్పగా విశ్లేషణ చేసిన పుస్తకం అని పేర్కొన్నారు. తెలుగు కథల మీద ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదవాలని కోరారు. అరవై నుండి డెబ్బై దశకం వరకూ వచ్చిన కథల పై ప్రముఖ కథా రచయిత డి. వెంకట్రామయ్య ప్రసంగించారు. కె.కె. రంగనాథాచార్యులు, శీలా వీర్రాజు, నాళేశ్వరం శంకరం, సుధామ, రామడుగు రాధాకృష్ణమూర్తి, డి. సుజాతా దేవి, యాళ్ళ అచ్యుతరామయ్య, బి. అజయ్ ప్రసాద్, డా॥ కాకుమాను శ్రీనివాసరావు, జుగాష్ విలి, పర్‌స్పెక్టివ్స్ ఆర్.కె., చిత్రకారులు చంద్ర, ఆంధ్ర సారస్వత పూర్వ అధ్యక్షులు మోతుకూరి నరహరి తదితర సాహిత్య వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



**న్యూఢిల్లీలో ఇటీవల "నాట్యశాస్త్రము – ఆధునిక నాటకశాస్త్రము" గ్రంథావిష్కరణ సభలో పాల్గొన్న (ఎడమ నుంచి) ఢిల్లీ తెలుగు సంఘం కార్యదర్శి సాయి కృష్ణారావు, గ్రంథ రచయిత ఎన్.ఎస్. కామేశ్వరరావు. డా. జె. భాగ్యలక్ష్మి, పద్మభూషణ్, కె. పద్మనాభయ్య (ఐ.ఎ.ఎస్) పార్లమెంటు సభ్యులు జె.డి. శీలం.**

# సాహిత్యం ప్రజల జీవన విధానంతో ముడిపడి వుంది : ఎమ్మెల్సీ చుక్కా రామయ్య



అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 26న నల్లగొండలో "తెలుగు కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ డా॥ చుక్కా రామయ్య, రచయిత పున్న అంజయ్య, గోనారెడ్డి తదితరులు

సాహిత్యానికి, ప్రజల జీవన విధానానికి సంబంధం ఉందని ప్రముఖ విద్యావేత్త శాసన మండలి సభ్యుడు డాక్టర్ చుక్కారామయ్య అన్నారు.

ఫిబ్రవరి 26న నల్గొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన తెలుగుతల్లి పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వచ్చిన సాహిత్యం మరే జిల్లాలో రాలేదని, ఇక్కడ జరిగిన పోరాటాలే అందుకు నిదర్శనమన్నారు. జిల్లాకు చెందిన వట్టికోట ఆళ్వార్‌స్వామిని పేర్కొంటూ ఆయన ఈ ప్రాంతం సంస్కృతిని, జీవన విధానాన్ని, అన్యాయాన్ని తన నవలలో ప్రతిబింబించాడని, అందుకే వట్టికోట ఇప్పటికీ చిరస్మరణీయుడని ఆయన కొనియాడారు. కవికి మాటలకన్నా దాని భావమే ప్రధానమని, ఆకలికేకలు ఎక్కడైతే ఉంటాయో అక్కడ కవిత్వం ఉంటుందన్నారు. సమాజానికి భయపడకుండా వాడే నిజమైన కవి అని కాళోజీని ఉదహరించారు. తెలుగు తల్లి ఎంత ప్రధానమో తెలంగాణ తల్లి కూడా అంతే ముఖ్యమన్నారు. తెలుగు భాషా పరిరక్షణ కోసం కృషి చేస్తూ కవితా సంకలనం వెలువరించటం అభినందనీయమన్నారు. త్వరలోనే తెలుగు ప్రాచీన భాషగా గుర్తింపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చే:శారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోనారెడ్డి మాట్లాడుతూ అంతరించిపోతున్న మాతృభాషను రక్షించుకోవాలని కోరారు. కవి వున్నా అంజయ్య సంపాదకత్వంలో వెలువడిన తెలుగుతల్లి పుస్తకాన్ని రామయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంఎన్ భూషి, పురుషోత్తమాచార్యులు, బాలనర్సింహాచారి మాట్లాడారు. విద్యాభారతి పాఠశాల ఉపాధ్యాయులు పాపిరెడ్డి, సత్యనారాయణ, ప్రసాద్, శర్మ వున్నా అంజయ్య సన్మానించారు.

## నేషనల్ బుక్‌ట్రస్ట్ తెలుగు పుస్తకాల ఆవిష్కరణ

వివేకనగర్ : ఉత్తమ ఉపయుక్త గ్రంథాలను సామాన్య పాఠకులకు అందుబాటులోకి తెచ్చి విజ్ఞానాన్ని వికసింపజేయడానికి 'నేషనల్ ట్రస్ట్, ఇండియా' సంస్థ అయిదు దశాబ్దాలుగా గణనీయ కృషి చేస్తోందని వక్తలు ప్రస్తుతించారు. నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియా' తాజాగా వెలువరించిన తెలుగు పుస్తకాల ఆవిష్కరణ సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమం త్యాగరాయగానసభ భవనంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంలో పద్మారామచంద్రన్ రచించగా డా. వకుళాభరణం లలిత తెనుగించిన 'భారతదేశంలో ప్రభుత్వ పాలన', అనితా ఇందర్‌సింగ్ రాయగా తెలకపల్లి రవి ఆంధ్రీకరించిన 'భారతదేశ విభజన', ఆర్వీ రామారావు అనువదించిన కాన్పూర్ మతకలహాల విచారణ కమిటీ నివేదిక 'మతతత్వ సమస్య' పుస్తకాలను ప్రెస్ అకాడమి పూర్వ అధ్యక్షుడు డా. పొత్తూరి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయ చరిత్ర శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ అధ్యక్షోపన్యాసం చేశారు. సంస్థ తెలుగు విభాగం సహాయ సంపాదకుడుగా డా. పత్తిపాక మోహన్, 'ఆంధ్రజ్యోతి' సంపాదకుడు కె. శ్రీనివాస్, విశాలంధ్ర ప్రచురణాలయం మేనేజర్ పి. రాజేశ్వరరావు, రచయిత జూకంటి జగన్నాథం మాట్లాడారు.



## కవి సమ్మేళనం




ఉల్లిరామసుబ్బయ్య, పెద్దోజు నమశ్శివాయ, దుబ్బలదాసు సి.వి. సుబ్బారావు, ఎన్. రత్నవర్మ

బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కారంపూడిలో శతర సుధా స్రవంతి వారి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం ఫిబ్రవరి 14న నిర్వహించబడినది. 19 మంది కవులు పాల్గొని తమ స్వీయ రచనలు వినిపించారు.

జిల్లా బాలల రచయితల సంఘం కార్యదర్శి బెజ్జంకి జగన్నాధాచార్యులు, ఉపాధ్యక్షులు దార్ల బుజ్జిబాబు పాఠశాల బాలబాలికలను సమావేశపరిచి "బాలసభ"ను నిర్వహించారు. పిల్లలలో రచనాసక్తిని పెంపొందించే విధంగా ప్రసంగించారు. గేయములు, కథలు రాయటానికి తగిన మార్గదర్శనం చేశారు. అనంతరం 30 మంది విద్యార్థులు అప్పటికప్పుడు రచనలు చేసి సభాముఖంగా చదివినారు. అతిథులు, ఎమ్.ఇ.ఓ, వి.వి. ఆచారి బాలబాలికలలో వచ్చిన స్పందనను అభినందించారు.

చివరగా బెజ్జంకి జగన్నోధాచార్యులు రచించిన "తెలుగుధీర శతకములను' మడవా సత్యనారాయణ సమీక్ష చేసినారు. 'విధ్వంసరీ ముఖచిత్రం' సరిహంద నరిసింహరాజు రచనను కోసూరి రవికుమారు సమీక్ష చేయగా, దుబ్బలదాసు అక్షర శిల్పాలను దానం శివప్రసాదు సమీక్షించారు.

శతక సుధా స్రవంతి వ్యవస్థాపకుల పరిణతం నాగేశ్వరరావు కవులను ఘనంగా సన్మానించారు.

## డైరీ

# కవిత్వం జీవితంలోంచి వచ్చినపుడే కదిలిస్తుంది

ప్రముఖ విమర్శకులు అద్దేపల్లి రామోహన్‌రావు గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్వర్యములో జరిగిన కోసూరి రవికుమార్ రచించిన "బొడ్డుపేగు" గ్రంథ ఆవిష్కరణ సభలో ఆవిష్కర్తగా పాల్గొని ప్రసంగిస్తూ రవికుమార్ కవ్వితం పల్లెలోంచి ప్రపంచంలోకి విస్తరించిందనీ ప్రస్తుతం కవిత్వం రాస్తున్న యువకవులలో రవికుమార్‌ది సొంతగొంతుక అనీ వ్యాఖ్యానించారు.

కవులెప్పుడూ సమాజ సంక్షేమాన్నే కోరతారు. సమాజానికి కీడు చేసే విషయాల్ని ఖండిస్తూనే ఉంటారు. అందుకే ఒక్కొక్క సామాజిక పరిస్థితికి తగిన మూల వైరుధ్యం ఒకటి. ప్రధానంగా ఉంటుంది., ఎన్నో అప్రధాన విషయాలుండవచ్చు. వాటి ప్రయోజనమూ ఎక్కువగానే ఉండవచ్చు. కానీ ప్రధాన వైరుధ్యమే కవుల్ని ఆకట్టుకుంటుంది. ఊపిరి సలపనివ్వదు. వర్తమానకాల వైరుధ్యం ఈ దేశపు మౌలిక రాజకీయార్థిక సంస్కృతికీ, ప్రపంచీకరణ పూర్తిగా మార్చివేయదలచుకున్న, సుస్థిరం చెయ్యదలచుకున్న విష సంస్కృతికీ, ఈ వైరుధ్యం ఈనాటి కవులందరిలో కనిపిస్తుంది. కొందరికిది అనుషంగిక అంశం. కొందరికి ప్రధానాంశం. ప్రధానాంశంగా భావించే కవుల్లో బలమైన కవితాస్వరంతో కోసూరి రవికుమార్ 'బొడ్డుపేగు' కవితా సంపుటి తెస్తున్నాడు. బొడ్డుపేగు – అనే శీర్షికలోనే తల్లికీ, బిడ్డకీ ఉన్న అవినాభావ సంబంధాన్ని సూచిస్తున్నాడు. మౌలిక సంస్కృతి సామాజిక వారసత్వపు పునాదికి సంబంధించినది. బొడ్డుపేగు వేరుచేయబడినా ఆ వారసత్వం కొనసాగుతుంది. ఇది ప్రతీకాత్మకమైన శీర్షిక అని కవిత్వం జీవితానికి పర్యాయపదము అయినప్పుడే కవిత రాణిస్తుందని అలాంటి కవిత్వం రాసేందుకు యువతరం ముందుకు రావాలనీ కోరారు. ప్రపంచీకరణ నేపథ్యములో ఇప్పటి కవిత్వం కొత్త శిల్పాన్నీ, కొత్త వస్తువునీ వెతుక్కుంటోందనీ అలాంటి కవిత్వం రావలసిన ఆవశ్యకత ఎంతైనా వుందనీ వ్యాఖ్యానించారు.

ఈ సభకు అధ్యక్షత వహిస్తూ డా॥ పాపినేని శివశంకర్ పాత తరపు దారుల్లో కొత్తతరపు కవిత్వం సమాజానికి నిలువుటద్దమై నిలుస్తోందనీ, అటువంటి కవిత్వపు దారిలో పయనిస్తున్న రవికుమార్ ఒక మంచి కవిగా ఎదుగుతాడని నమ్మకం అతని కవిత్వం వలన కలుగుతోందని తెలియజేశారు.



ఫిబ్రవరి 24వ తేదీన గుంటూరు యు.టి.ఎఫ్. హాల్‌లో కోసూరి రవికుమార్ రచించిన "బొడ్డు పేగు" కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ప్రఖ్యాత కవి, విమర్శకులు, శ్రీ అద్దేపల్లి రామమోహన్ రావు, చిత్రంలో శ్రీ. పాపినేని శివశంకర్, డా॥ బీరం సుందరరావు, పెనుగొండ లక్ష్మీనారాయణ మరియు రచయిత కోసూరి రవికుమార్

ఈ సభలో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న పెనుగొండ లక్ష్మీనారాయణ మంచి కవిత్వం రాస్తున్న కొందరు పలనాటి యువకవుల్లో రవికుమార్ ఒకరనీ సాహిత్యం సమాజ హితాన్ని కోరాలనీ, అటువంటి ఆలోచనలువున్న ప్రతి ఒక్కరు కవిత్వం రాయకపోయినా చదివే అలవాటు చేసుకోవలసి వుందని అన్నారు.

"బొడ్డుపేగు" కవితా సంపుటిని సమీక్షిస్తూ డా॥ బీరం సుందరరావు ఈ సంపుటి నిండా పల్లెతనం నిండి వుందనీ, పల్లె ప్రజల గుండె చప్పుడునూ, రైతు జీవన చిత్రణనూ చిత్రికబట్టి కవిత్వం చేశారనీ పేర్కొన్నారు. ఈ సభల్లో గుంటూరు జిల్లా రచయితల సంఘం అధ్వర్యములో ఇటీవల "మాతృభాష పురస్కారం" రాష్ట్ర స్థాయిలో పొందిన సోమేపల్లి వెంకట సుబ్బయ్య గారిని, గౌరవ అధ్యక్షులు డా॥ పి.వి. సుబ్బారావు, అధికార ప్రతినిధి నాగిశెట్టి తాతయ్యానాయుడు, కార్యదర్శి ఎన్.వి. రత్నశర్మ, బొమ్మ ఉమామహేశ్వరరెడ్డిలు ఘనంగా సత్కరించారు.

# వట్టివేళ్ళు నానీలకు జగన్నాథ సాహితీ పురస్కారం

ప్రముఖ కవి డా॥ యన్.గోపి సృష్టి 'నానీల' ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా ప్రచురితమైన నానీల సంపుటిలను పరిశీలించి ఉత్తమ గ్రంథంగా చీరాలకు చెందిన ప్రముఖ కవి వడలి రాధాకృష్ణ రచించిన "వట్టివేళ్ళు" ను జగన్నాథ విశిష్టసాహితీ పురస్కారానికి ఎంపిక జేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కూచిబోట్ల రామకృష్ణ వెంకట వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇటీవలే నానీల దశమ వార్షికోత్సవాలను అత్యంత వైభవోపేతంగా జరుపుకున్న శుభ తరుణంలో "వట్టివేళ్ళు" జగన్నాథ సాహితీ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల డా॥యన్.గోపి, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షులు బి. హనుమారెడ్డి, కె. బాలకృష్ణారెడ్డి, పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ప్రముఖ కవయిత్రి శ్రీమతి యన్.అరుణ హర్షం వెలిబుచ్చి రచయిత వడలి రాధాకృష్ణను అభినందించారు.



చీరాల సహజసాహితీ ఆధ్వర్యంలో ప్రముఖ కథా రచయిత వడలి రాధాకృష్ణ రచన "మనసు మూలాల్లోకి.." కథల సంపుటి ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో డా॥ కె.వి. నరసింహారావు, కె.ఎస్.టి. శాయి, కొత్తమాసు శ్రీనివాసరావు, లయన్ కాకరపర్తి వెంకటేశ్వర్లు డా॥కె.వి.ఎస్. ఆచార్య, ఆవిష్కర్త బి. హనుమారెడ్డి, డా॥ సూరం శ్రీనివాసులు, రచయిత వడలి రాధాకృష్ణ, పొన్నూరు వేంకట శ్రీనివాసులు, కె. రఘు

డైరీ

# అలరించిన బహుభాషా కవి సమ్మేళనం



పెనుగొండలో జాతీయ కవి సమ్మేళనంలో ప్రసంగిస్తున్న డాక్టర్ రామచంద్రరాజు

పశ్చిమ గోదావరి జిల్లాలో మొట్ట మొదటి శతాధిక కవి సమ్మేళనాన్ని పెనుగొండకు చెందిన రమ్య సాహితీ సమితి ఫిబ్రవరి 24న రెడ్డి కళ్యాణ మండపంలో నిర్వహించింది.

సమితి గౌరవ అధ్యక్షులు, ఆంధ్ర విశ్వ విద్యాలయ ప్రైవేట్ కళాశాలల సంఘం ఛైర్మన్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు సభకు అధ్యక్షత వహించారు. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల నాయకులు డి. సోమసుందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కవులు నిష్పక్షపాతంగా, నిర్భీతిగా సమాజ సమస్యలను కవిత్వీకరించాలని, నేడు ప్రతి జర్నలిస్టు రోజూ కవిగా వార్తలను సామాన్యుడి కర్థమయ్యే రీతిలో రచిస్తున్నాడని సోమసుందర్ అన్నారు. కవులు, ప్రాంతీయ, భాషా భేదాల కతీతంగా రచనలు సాగించి సమాజానికి మార్గదర్శకులుగా వుండాలని డాక్టర్ రామచంద్రరాజు అన్నారు. ప్రముఖకవి, అనువాదకుడు రామతీర్థ, సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ శరత్ జ్యోత్స్న రాణి, కవి లకుమ, టి. సుబ్బారాయలరెడ్డి ప్రసంగించారు.

రమ్య సాహితీ 2007లో నిర్వహించిన కథ సంపుటిల పోటీలలో శరత్ జ్యోత్స్న రాణి "వెండి కిరీటం" పుస్తకానికి రెండువేల రూపాయలు, కవితా సంపుటి విభాగంలో లకుమ "గోరింటాకు చందమామ"కు రెండు వేల రూపాయలు అందజేసి సత్కరించారు.

సభ అనంతరం జాతీయ కవి సమ్మేళనం జరిగింది. కె.వి. ఎస్.ఆర్ బాపన్న శాస్త్రి, తాడేపల్లి వీరలక్ష్మి సంస్కృతంలోనూ, కె. సూర్యకుమారి, కె. కల్పన హిందీలోనూ, వై. ఉమా సంజీవరావు కన్నడంలోనూ వై.ఎస్. సంజీవరావు, రామతీర్థ, బడబాగ్ని శంకరరాజు ఆంగ్లంలోనూ కవితాగానం చేసారు. మిగిలిన వారంతా తెలుగులో తమ కవితలను వినిపించారు.

రైతుల దయనీయ స్థితులు, స్త్రీల మానసిక వేదనలను, బాలలు చదువుల భారంతో విలవిలలాడటం, గ్లోబలైజేషన్ వలన కలిగే దుష్పరిణామాలు, వరకట్న సమస్యల్ని, లుప్తమవుతున్న మానవతా విలువల్ని కవులు తమ కవితలలో తెలిపారు.

108 మంది పాల్గొన్న ఈ జాతీయ కవి సమ్మేళనానికి శ్రీమతి శరత్ జ్యోత్స్న రాణి, శ్రీమతి జగద్ధాత్రి, కొంపెల్ల కామేశ్వరరావు, బడబాగ్ని శంకరరాజు, రామతీర్థ, డాక్టర్ రంకిరెడ్డి రామమోహన్‌రావు, భవిష్య, తెన్నేటి సంచాలకులుగా వ్యవహరించారు.

శ్రీకాకుళం, సింహాచలం, విశాఖపట్టణం, అనకాపల్లి, తుని, అమలాపురం, రాజమండ్రి, విజయవాడ, ఖమ్మం, తిరువూరు, మచిలీపట్నం, నిడదవోలు, తణుకు, భీమవరం ప్రాంతాలకు చెందిన కవులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు.

రమ్య సాహితీ అధ్యక్షులు ఎం. ఆర్.వి. సత్యనారాయణ మూర్తి కార్యక్రమాన్ని నిర్వహించగా కార్యదర్శి ఎం. రాజేశ్వరి వందన సమర్పణ చేసారు.



## డాక్టర్ పాపినేని శివశంకర్‌కు డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి కథాపురస్కారం (2007)

కడపజిల్లా నందలూరు కథానిలయం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ కథా రచయితకు ప్రతి ఏటా అందించే ప్రతిష్ఠాకరమైన డాక్టర్ కేతువిశ్వనాథరెడ్డి కథాపురస్కారం–2007 సంవత్సరానికి గాను గుంటూరుకు చెందిన కథారచయిత, విమర్శకులు డాక్టర్ పాపినేని శివశంకర్‌ను ఎంపిక చేసినట్లు కథానిలయం అధ్యక్షులు ఎ. రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. పురస్కారం క్రింద ఐదువేల రూపాయల నగదు, శాలువాతో పాటు జ్ఞాపికతో ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. ఈ పురస్కారం కోసం 164 కథా సంపుటిలు రాగా 1. డాక్టర్ మధురాంతకం నరేంద్ర, 2. సన్నపు రెడ్డి వెంకట్రామి రెడ్డి, 3. సాహిత్యనేత్రం సంపాదకులు శశిశ్రీ, గల న్యాయనిర్ణేతల కమిటీ గుంటూరుకు చెందిన డాక్టర్ పాపినేని శివశంకర్ రచించిన "సగం తెరచిన తలుపు" కథా సంపుటిని ఎంపిక చేసినట్లు తెలిపారు. డాక్టర్ పాపినేనికి గతంలో ఫ్రీవర్స్ ఫ్రంట్, జేష్ట లిటరరీ ట్రస్టు, డాక్టర్ సి.నారాయణ రెడ్డి ట్రస్టు, తెలుగు విశ్వవిద్యాలయం, ఉమ్మిడిశెట్టి, నూతలపాటి, నాగభైరవ, గరికపాటి పురస్కారాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారాలు కూడా లభించాయి. గతంలో ఈ పురస్కారాలు సింగమనేని నారాయణ (2005), వి.ప్రతిమ (2006)లకు లభించాయి.

## 'మనిషిలో మనిషి' ఆవిష్కరణ

కథా కథన కౌశలంతో, కొసమెరుపులతో, సమాజంలోని సంఘటనలను, మనస్తత్వాలను సుశితంగా పరిశీలించి రాయగల ప్రతిభామూర్తి ఆర్.కె. కటారి అని పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డి ప్రశంసించారు. మానస ఆర్ట్‌థియేటర్స్, శ్రీత్యాగ రాయగాన సభల ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన 'మనిషిలో మనిషి' కథల సంపుటిని ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ కె.బి.లక్ష్మి ప్రసంగిస్తూ కటారి రచనల్లో నిజాయితీ ఉంటుందని, శిల్పపరంగా ఆయన కథలు మనసుల్ని ఆకట్టుకుంటాయని పేర్కొన్నారు.

ప్రముఖ రచయిత సుధామ సోదాహరణగా పుస్తకంలోని కథలను విశ్లేషించి, రచయిత ఎంచుకున్న ఇతి వృత్తాలను, ప్రపంచీకరణ, నేపథ్యంలో ముందస్తు పరిశీలనాశక్తిని అభినందించారు.

ప్రముఖ కవులు ఎం.ఎల్. కాంతారావు, యు.వి. రత్నం తదితరులు కటారి వ్యక్తిత్వాన్ని గురించి ఆయన నట, రచనా జీవితం గురించి ప్రసంగించారు. రచయిత తన ప్రతిస్పందనలో తన ఆలోచనలకు, ఆయా సందర్భాల పరిశీలనకు కట్టుబడి రచనలు చేశానన్నారు. ఈ సందర్భంగా అతిథులు రచయితను ఘనంగా సత్కరించారు. మానస ఆర్ట్ థియేటర్స్ వ్యవస్థాపక కార్యదర్శి రఘుశ్రీ సమన్వయ బాధ్యతలు నిర్వహించారు.



**హైదరాబాద్ శ్రీ త్యాగరాయగాన సభలో 'మానస ఆర్ట్ థియేటర్స్' గాన సభల ఆధ్వర్యంలో జరిగిన మనిషిలో మనిషి' ఆవిష్కరణ సభలో రచయిత ఆర్.కె. కటారిని సత్కరిస్తున్న పద్మభూషణ్ డాక్టర్ సి. నారాయణ రెడ్డి. చిత్రంలో మానస రఘుశ్రీ, డా॥కె. బి. లక్ష్మి, సుధామ, కోకావీరప్రసాద్ తదితరులు.**

## "చేవగలిగిన కవి చేమకూర వేంకట కవి"

### "నెల నెలా జాబిలి"లో శ్రీమతి ఉషారాణి ఉద్ఘాటన

భద్రాచల సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో 'లిటిల్ ఫ్లవర్స్' విద్యాసంస్థల ప్రాంగణంలో చేమకూర వేంకటకవి ప్రణీతం విజయ విలాసం' కావ్యంపై బూర్గంపాడు రెసిడెన్షియల్ హైస్కూలు తెలుగు భాషా బోధకురాలు శ్రీమతి కె. ఉషారాణి సాహిత్య ప్రసంగం చేసారు. చేమకూర వేంకటకవి, చతుర్వేద కవితా రీతులలో నిపుణుడని, విద్యత్కవియని, అతని విజయ విలాసం సాటిలేని రసవత్కావ్యమని అభివర్ణించారు. సన్నివేశ కల్పన, పాత్ర చిత్రణ, పద్య రచనా ప్రావీణ్యతలను సోదాహరణంగా తన ప్రసంగంలో వినిపించారు. ఇంకా ఈ సమావేశంలో సభాధ్యక్షులు యస్.సి.హెచ్. చక్రవర్తి సాహితీ స్రవంతి అధ్యక్షులు – మాల్యశ్రీ – ఉపాధ్యక్షులు వీధుల రాంబాబు, కార్యదర్శి దుర్గాచారి, పాడిచేటి సీతారామానుజా చార్యులు, వేంకటకవి కవిత లక్షణాలను కొనియాడారు. సి. నాగేంద్రప్రసాద్, శ్రీధిరాల వెంకటచారి, డి. హరిసర్వోత్తమ్, జీవా, యాదగిరి, అమ్మిన శ్రీనివాసరాజు, జి. దుర్గాప్రసాద్, తిరుపాల్, ఎ.ఆర్.కె. రాజు మొదలగు వారు కూడా పాల్గొన్నారు.

ముఖ్య అతిథి – మేరెడ్డి శ్రీనివాసరెడ్డి, మహిళాప్రతినిధులు – శ్రీమతి సి. విజయలక్ష్మి, శ్రీమతి ఎ. అనురాధ సాహితీస్రవంతి పక్షాన శ్రీమతి కె.ఉషారాణిని –జ్ఞాపిక,శాలువాలతో సన్మానించారు.

## తెలుగు వెలుగు అమరజీవి అల్లూరి సంస్మరణ

"శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక కళాసమితి" ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి – అమరవీరుల సంస్మరణ దినం సందర్భముగా జనవరి 30న భద్రాచలంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు, ఘాము గంటందొర, ఘామమల్లు – దొరల విగ్రహ వేదిక వద్ద అల్లూరి సీతారామరాజు, గాము దొరల సంస్మరణ సభ జరిగింది. ఈ సమావేశం సందర్భంగా పలువురు కవులు, కళాకారులు, పురజనులు, ఈ అమరవీరుల విగ్రహాలకు పుష్పమాలలు వేసి, వారి త్యాగాలను దేశభక్తిని గూర్చి ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో యన్.సి.హెచ్. చక్రవర్తి మాల్యశ్రీ, జీవా, టి. దుర్గాచారి, తులసీదాసు, ఏ.వి. పాల్, ఆర్.యస్.రావు, పుల్లయ్య మొదలగువారు పాల్గొన్నారు. ఈ కళా సమితి ద్వారా ప్రతి సంవత్సరం అల్లూరి వర్ధంతి, జయంతులను జరపడం, సామాజిక, సాంఘిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం, సాంస్కృతిక కళా ప్రదర్శనలను ఏర్పాటు చేయడం మొదలైన ఆశయ సాధనలతో ముందుకు సాగడం తమ లక్ష్యాలుగా నిర్వాహకులు ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు, గాము దొరల స్ఫూర్తితో గిరిజన గిరిజనేతరుల సమైక్యత గురించి పాటుపడేందుకు ప్రతిజ్ఞ చేసారు.

# “సమీక్షా చక్షువు” ఆవిష్కరణ

ఆరాధన, త్యాగరాయగాన సభల సంయుక్త అధ్వర్యంలో డా. ద్వానాశాస్త్రి రచించిన “సమీక్షా చక్షువు” గ్రంథావిష్కరణ సభ జరిగింది. రాష్ట్ర మంత్రివర్యులు మండలి బుద్ధ ప్రసాద్ గ్రంథావిష్కరణ చేయగా, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీతలు డా. సి. నారాయణ రెడ్డి సమీక్ష సవ్యసాచి బిరుదుతో సత్కరించారు. నిరంతర సాహితీకృషీవలుడనీ, సహృదయ విమర్శకుడనీ, కొట్టి చెప్పకుండా తట్టి చెప్తాడనీ వక్తలు ద్వానాశాస్త్రిని కొనియాడారు. ఆచార్య సమతీ నరేంద్ర సభాధ్యక్షత వహించగా, ద్వానాశాస్త్రి గురువుగారు ఆచార్య చేకూరి రామారావు ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. పుస్తకాన్ని ప్రచురించిన విజియస్ పబ్లిషర్స్ అధినేత శిరం రామారావు, ఆరాధన సంస్థ గుడిబండి వెంకటరెడ్డి, కార్యదర్శి లోకం కృష్ణయ్య పాల్గొన్నారు. ద్వానాశాస్త్రి తన స్పందనను తెలియజేస్తూ సమీక్షకి అవకాశమిచ్చిన వివిధ పత్రికా సంపాదకులకు కృతజ్ఞతలు తెలిపారు.



‘ఆరాధన’ సంస్థ ఆధ్వర్యంలో డా. ద్వానాశాస్త్రి రచించిన “సమీక్షా చక్షువు” గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ “సమీక్షక సవ్యసాచి” అనే బిరుదును ప్రధానం చేస్తున్న ఆచార్య సి. నారాయణరెడ్డి, మంత్రివర్యులు శ్రీమండలి బుద్ధ ప్రసాద్
చిత్రంలో ఆచార్య చేకూరి రామారావు, ఆచార్య సమతీనరేంద్ర, ఆరాధన వెంకటరెడ్డి, లోకం కృష్ణయ్య, విజియస్ రామారావు



### ఆర్థర్ క్లార్క్ మరణం

ప్రముఖ సైన్స్ కాల్పనిక రచయిత ఆర్థర్ క్లార్క్ 19.03.08 న బుధవారం కొలంబాలో మృతి చెందారు. అంతరిక్షం, సైన్స్, భవిష్యత్‌లో కమ్యూనికేషన్స్ వంటి అంశాలపై క్లార్క్ పలు పుస్తకాలు రాశారు. బ్రిటన్ దేశానికి చెందిన క్లార్క్ శ్రీలంకలో స్థిరపడ్డారు. 1940 ప్రాంతాలలోనే చంద్రునిపైకి మానవుడు చేరుకోవడం సాధ్యమేనని వ్యాసం రాసి సంచలనం కల్గించారు. తర్వాత కాలంలో ఆయన ఊహలు నిజం చేస్తూ మానవుడు చంద్రునిపై కాలుపెట్టాడు. ఆ సందర్భంలో అమెరికా తమ విజయానికి క్లార్క్ వ్యాసం స్ఫూర్తి కలిగించిందని ప్రకటించడం ఆయన ప్రతిభకు తార్కాణం. సైన్స్‌నే ప్రేమించి, శ్వాసించిన క్లార్క్ తన యావత్ జీవితాన్ని శాస్త్ర సంబంధ సమస్యలను చేధించడానికి అంకితం చేశారు.



## ‘పునాస’కు ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు

రెండు దశాబ్దాల ప్రతిష్ఠాత్మక పురస్కారం ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు -2007 కోసం తైదల అంజయ్య కవితా సంపుటి ‘పునాస’ ఎంపికైనట్లు అవార్డు వ్యవస్థాపకులు రాథేయ ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ అవార్డు న్యాయ నిర్ణేతలుగా హెచ్చార్కె, పాపినేని శివశంకర్, రామాచంద్రమౌళి... గార్లు వ్యవహరించారు. అవార్డు పొందిన కవి తైదల అంజయ్య కరీంనగర్ జిల్లా కోహెడ్ మండలం నాగసముద్రాల గ్రామానికి చెందినవారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. సమకాలీన వర్తమానకవిగా జీవితాన్ని దగ్గరగా స్పృశించినవారు, అన్నివాదాల సత్యాల్ని స్వీకరించి వెన్నెల కన్నీరును కూడా స్వచ్ఛంగా చూసిన కవిత్వకు ‘పునాస’ అని న్యాయనిర్ణేతలు పేర్కొన్నారు. ‘పునాస’ వీరి తొలి కవితా సంపుటి, ఈ అవార్డు పొందిన వారిలో వీరు 20వ, వారని రాథేయ పేర్కొన్నారు.

దశాబ్దకాలం పైగా అన్నిరకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించే సంస్థ

మెడినోవా డయాగ్నొస్టిక్ సర్వీసెస్
ఫోన్ : 08742 -224100
వైరా రోడ్, ఖమ్మం

★ 4 అల్ట్రాసౌండ్ స్కానింగ్, కలర్ డాప్లర్, 2D-Echo, TMT మరియు EEG.,
★ క్వాలిఫైడ్ డాక్టర్లచే కంప్యూటరైజ్డ్ లేబొరేటరీ నందు ఫాథాలజీ, మైక్రోబయాలజీ, రేడియోలజీ పరీక్షలు
★ ప్రముఖ సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లచే కన్సల్టేషన్ సర్వీసులు

రోటేరియన్ డా॥కె. హరిష్ పౌండేషన్ ద్వారాతెల్లరేషన్ కార్డుకలిగి చూపిన వారికి 0-20% వరకు ప్రత్యేకమైన తగ్గింపు

ప్రపంచ ఖ్యాతి చెందిన “ EEECSYS -2010 ROCHE HITACHI ” వారి పూర్తి కంప్యూటరైజ్డ్ ఆటోమేటిక్ ఎనలైజర్ తో థైరాయిడ్ హార్మోన్స్ మరియు ఇతర ఉన్నత శ్రేణి పరీక్షల రిపోర్టులు ఒకే రోజులో ఇవ్వబడును

# స్వీకారం




పాలమూరు నానీలు
మరికంటి
వెల : రు. 30




నానీల పీరికా ప్రస్థానం
డా।। పత్తిపాక మోహన్
వెల : రు. 100




తరిగొండ వెంగమాంబ
డా।। వి.ఆర్. రాసాని
వెల : రు. 50



మృత్యోర్మా అమృతంగమయ
హేమలతా లవణం
వెల : రు. 100




తొలి తెలుగు పరిశోధకులు
డా।। ఎన్. గోపి
వెల : రు. 30




తొలి సంధ్య
డాక్టర్ సిహెచ్. కళావతి
వెల : రు. 70




కార్టూన్ శతకం
అంబటి చంటిబాబు
వెల : రు. 27




భారత భారతి
మేడిచర్ల ప్రభాకరరావు
వెల : రు. 40




జలజూదం
డా।। వి.ఆర్. రాసాని
వెల : రు. 20




శ్రీనివాస శతకం
డాక్టర్ కృష్ణ కౌండిన్య
వెల : రు. 30




జవాబు రేపిన ప్రశ్నలు
నాగభూషణాచార్యులు
వెల : రు. 60




చిలుకల చెట్టు
నేలపూరి రత్నాజీ
వెల : రు. 20

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

SAHITYA PRASATHANAM Postal Regd. No.H/SD/415/07-09 RNI N0.APTEL/ 2004/18396






శ్రీ సర్వధారినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలతో...

For Quality Products... Reliable Services...

35 YEARS OF EXCELLENCE

# Kumar®

AN ISO 9001 : 2000 CERTIFIED COMPANY

## PUMPS & MOTORS

SUPERIOR QUALITY, SUPERIOR VALUE

IS: 8034

ISI

CM/L : 6425466

TÜV

## KUMAR GROUP OF INDUSTRIES

Industrial Estate, Sultanabad, Tenali - 522 202. A.P.

Tel : (08644) 226473, 74 Fax : 08644 - 226478

e-mail : kumar_pumps@yahoo.com website : www.kumarapumps.com

AUTHORISED DISTRIBUTOR

## ARUNA JYOTHI DISTRIBUTORS

Kumar Building, Wahab Road, Tenali - 522 201

Ph :08644 - 226471 Cell : 94907 59522

BRANCH OFFICES

CHENNAI : 336/3 (Old No. 166/3) Thambuchetty Street - 600 001. Ph: 25357697 Cell : 98407 77340

SECUNDERABAD : D.No. 5-2-396-81/A, Shop No. 4 & 5, Hyderbasti, R.P. Road, Behind SBI - 500 003. Ph: 27534811, Cell: 94907 59500

VISAKHAPATNAM : 30-12-25, Ranga Street, Daba Gardens, Visakhapatnam - 530 020. Ph : 2738273 Cell : 94907 59511. Complaint : 94907 59512

NELLORE : Shop.No.14, J.V.R. Buildings, Subedarpet road, Nellore - 524 001 Ph : 2304109 Cell : 94409 20001

TENALI : Industrial Estate, Sulthanabad-522 202. Ph: 226473,74 Cell : 94907 59522